సాహిత్య (గత వారం రోజుల్లో విడుదలైన పుస్తకాలు)
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తిరుపతి : fb.com/vaartha Digital

Published from Tirupathi, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

27-8-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 208 పేజీలు: 10+4 వెల: 6.50

పిల్లల్ని కంటే రూ. 55 లక్షలు ప్రోత్సాహకం!
ప్రపంచవ్యాప్తంగా అమెరికా వీసా అపాయింట్‌మెంట్ల వాయిదా
5లో

# జనవరి 1 నుంచి 'సంజీవన్ని'

## ఎఐ ఆధారిత వైద్య సేవలకు అత్యధిక ప్రాధాన్యం

వైద్య సేవల్లో ఎపిని మోడల్‌గా 'సంజీవన్ని విజయవంతం చేయాలి

కుప్పం, చిత్తూరు ఫలితాలతో పక్కాగా కార్యాచరణ చేపట్టండి

వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు సిఎం చంద్రబాబు ఆదేశాలు

వైద్యారోగ్యం, సంజీవని ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి ఉన్నత సమీక్ష



బుధవారం విజయవాడలో 'సంజీవన్ని ప్రాజెక్ట్‌పై అధికారులతో సిఎం చంద్రబాబు సమీక్ష దృశ్యం

**విజయవాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** వైద్యారోగ్య సేవలు మరింత మెరుగ్గా అందించేందుకు చేపట్టిన 'సంజీవన్ని ప్రాజెక్టును జనవరి 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. డిజిటల్ హెల్త్ రికార్డులతో సంజీవని ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అమలైతే వైద్య సేవల్లో అనూహ్య మార్పులు సాధించవచ్చన్నారు. వైద్య సేవల్లో ఎపిని ఇతర రాష్ట్రాలు అనుసరించేలా 'సంజీవన్ని ప్రాజెక్టును విజయవంతం చేయాలని సిఎం సూచించారు. క్యాంపు కార్యాలయంలో బుధవారం 'సంజీవన్ని ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించారు. కుప్పం నియోజకవర్గం, చిత్తూరు జిల్లాల్లో ఇప్పటికే సంజీవని ప్రాజెక్ట్ అమలుతో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని, వీటిని రాష్ట్రమంతటా అమలు చేసేలా చూడాలన్నారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబం విద్యకు, వైద్యానికే అత్యధికంగా ఖర్చు పెట్టాల్సి వస్తోందన్నారు. ఈ వ్యయాన్ని తగ్గించేలా చూసేందుకు సంజీవని వంటి కార్యక్రమాలను తీసుకువస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. సంజీవని ప్రాజెక్టులో అధికారిక భాగస్వామిగా ఉన్న టాటా ఎండీ సంస్థ వైద్యారోగ్య రంగంలో సరి కొత్త ఆవిష్కరణలకు కృషి చేయాలని నిర్దేశించారు. సంజీవని కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు 90 రోజుల ప్రణాళిక సిద్ధం చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. బేస్‌లైన్ అధ్యయనం, డిజిటల్ మౌలిక వసతుల ఏర్పాటు, శిక్షణ, సర్టిఫికేషన్, జాతీయ, రాష్ట్ర పోర్టల్స్‌తో ఇంటిగ్రేషన్ వంటి చర్యలు 90 రోజుల ప్రణాళికలో ఉన్నాయని వెల్లడించారు. 28 జిల్లాల్లో వైద్య సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్టు వివరించారు.

**డేటా గోప్యత, భద్రతకు ప్రాధాన్యం**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ "ప్రిడెక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్, కాస్ట్ ఎఫెక్టివ్‌గా వైద్యసేవలు అందించాలి. వైద్య సేవలు అందించడంతో పాటు ఆహారపు అలవాట్లు, ఆలోచనా విధానం మారేలా చూడాలి. హోమియోపతి, ఆయుర్వేద, యోగా, ప్రాణాయామం, ఇంకా అత్యాధునిక వైద్య విజ్ఞానాన్ని వినియోగించుకోవాలి. ఎఐ డాక్టర్ కూడా విస్తృతంగా వినియోగంలోకి తీసుకురావాలి. డేటాను భద్రపరచడం, గోప్యంగా ఉంచడంతో పాటు డ్యాష్ బోర్డు సిద్ధం చేయాలి. ఆస్పత్రుల్లో శానిటేషన్ సహా వివిధ ఔట్ సోర్సింగ్ సేవల విషయంలో దృష్టి పెట్టాలి. సమర్ధవంతంగా వైద్య సేవలు అందించని ఔట్ సోర్సింగ్ సర్వీస్ ప్రొవైడర్లను తొలిగించేలా ఒక విధానం తీసుకురావాలి. విశ్వాసం పెంచేలా వైద్య సేవలు ఉండాలి. ప్రజల మొబైళ్లకు నేరుగా హెల్త్ అప్డేట్స్ పంపించేలా వ్యవస్థను తీర్చిదిద్దాల్లి అని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**వ్యాధుల నియంత్రణకు దోహదం**

కుప్పం, చిత్తూరు ప్రాంతాల్లో సంజీవని కార్యక్రమం అమలుతో వచ్చిన ఫలితాలను సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించారు. ప్రాజెక్టు అమలుతో మెరుగైన ఫలితాలు సాధిస్తు >>2



# సాగర్ నీళ్ల కోసం జలజగడం

ఎన్ఎస్‌పి కుడి కాలువకు నీటి విడుదల

అనుమతి లేదంటూ అడ్డుకున్న తెలంగాణ

ఇరు రాష్ట్రాల అధికారుల మధ్య వాదనలు

ఎడమ కాలువకు నీరు వదిలిన తెలంగాణ

సెప్టెంబర్ 4న కెఆర్‌ఎంబి త్రిసభ్య కమిటీ భేటీ

**హైదరాబాద్, ఆగస్టు 26 ప్రభాతవార్త:** నాగార్జున సాగర్ కుడి కాలువకు బుధవారం ఆంధ్రప్రదేశ్ అధికారులు నీటిని విడుదల చేయడంతో తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య మరోసారి జల జగడానికి తెరలేచింది. కెఆర్‌ఎంబి అనుమతి లేకుండా ఆంధ్ర ప్రదేశ్ అధికారులు నాగార్జునసాగర్ రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేయడాన్ని తెలంగాణ అధికారులు అడ్డుకోవడంతో సాగర్ డ్యామ్ వద్ద ఉద్రికత్త పరిస్థితులు తలెత్తాయి. ఎన్ఎస్‌పి కుడికాలువకు 2 వేల క్యూసెక్కులు ఎపి ప్రభుత్వం విడుదల చేయడంతో తెలంగాణ కూడా ఎడమకాలువకు 2 వేల క్యూసెక్కులు విడుదల చేశారు. ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి అవసరాల కోసం నాగార్జున సాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేశారు. త్రిపురారం మండలం పెద్ద దేవులపల్లి రిజర్వాయర్‌లో నీటి నిల్వలు తగ్గిపోవడంతో ఆ జలాశయాన్ని నింపడం కోసం ఈ నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. నాలుగు రోజుల పాటు నీటిని విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. మొదట 5వందల క్యూసెక్కులు విడుదల చేసి క్రమంగాపెంచుతున్నారు. పెద్దదేవుల పల్లి రిజర్వాయర్ నిండిన తరు వాత ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్‌కు నీటిని తరలించి >>2

## 23రోజుల తర్వాత శుభవార్త

# మత్స్యకారులు క్షేమం!

2లో

- పశ్చిమ బెంగాల్‌లో ఏడుగురూ సురక్షితం
- బోటు ఎలా తప్పిపోయింది? ఏ మార్గంలో వెళ్లింది? అన్ని కోణాల్లో పరిశీలన
- స్వస్థలాలకు తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం: రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడి



**విజయవాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లి ఆచూకీ లేకుండా పోయిన ఏడుగురు మత్స్యకారులు పశ్చిమ బెంగాల్‌లో సురక్షితంగా ఉన్నట్లు నిర్ధారణ కావడం పట్ల వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. మత్స్యకారులు క్షేమంగా ఉన్నారన్న శుభవార్తతో వారికుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారని, వారిని త్వరగా స్వస్థలాలకు తీసుకు వచ్చేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. ఈ >>2

## హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తూ

# తెల్లారిన బతుకులు

కంటైనర్‌ను ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

ఆరుగురు మృతి, 20 మందికి గాయాలు

మృతులు, క్షతగాత్రులంతా ఎపి వాసులే

సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి, విచారం




ప్రమాదంలో ధ్వంసమైన ప్రైవేటు బస్సు

**సూర్యాపేట/కోదాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త:** హైదరాబాద్- విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం దొరకుంట గ్రామ శివారులో బుధవారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో ఆరుగురు మృతి చెందగా, 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఐరన్ పిల్లర్లతో వెళ్తున్న కంటైనర్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. బుధవారం నుంచి వరుసగా నాలుగు రోజుల సెలవులు ఉండటంతో కుటుంబాలతో కలిసి సంతోషంగా గడిపేందుకు వెళ్తున్నవారిని ఈ ప్రమాదంరూపంలో మృత్యువు కబళించింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు సహాయక చర్యలు చేపట్టి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదంలో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఘటనాస్థలంలోనే మృతి చెందారు. >>2

## వరద కల్లోలం

# నేపాల్ అతలాకుతలం



నేపాల్‌లో పలు గ్రామాలను వరదలు ముంచెత్తిన దృశ్యం

భోటేకోశి నది పొంగిపొర్లడంతో తుడిచిపెట్టుకు పోయిన పలు గ్రామాలు

400 మంది పైగా మానస్ సరోవర్ యాత్రికుల గల్లంతు

133 మంది భారతీయుల కోసం అన్వేషణ

ఆకస్మిక వరదలకు ముందు భూకంపం కూడా..

మృతులు 98 మంది పైనే..

నేపాల్ ప్రధానికి మోదీ ఫోన్, అండగా ఉంటామని భరోసా

భారతీయుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్లు

3లో



బుధవారం అమరావతిలో నార్మన్ ఫోస్టర్స్ అండ్ పార్టనర్స్‌తో కీలక జరుపుతున్న అసెంబ్లీ స్పీకరు అయ్యన్నపాత్రుడు, మంత్రులు పి.నారాయణ,నాదెండ్ల మనోహార్

## ప్రపంచస్థాయి రాజధానిగా

# అమరావతి

ఆ దిశగా నిర్మాణమే సిఎం చంద్రబాబు లక్ష్యం

అసెంబ్లీ భవన రూపకల్పనపై కీలక చర్చలు

స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన మంత్రులు నారాయణ, మనోహార్, నార్మన్ ఫోస్టర్స్ అండ్ పార్ట్‌నర్స్‌తో సమాలోచనలు

వివరాలు వెల్లడించిన మంత్రి నాదెండ్ల మనోహార్

**అమరావతి, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచంలోనే అద్భుతమైన రాజధానిగా అమరావతిని నిర్మించాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్ యమని రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహార్ తెలిపారు. ఈ లక్ష్యానికి అనుగుణంగా రాజధానిలోని శాసనసభ భవనాన్ని అత్యున్నత ప్రమాణాలతో, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మించేందుకు రూపకల్పనపై కీలక చర్చలు జరిపినట్లు వెల్లడించారు. అంతర్జాతీయ ఆర్కిటెక్చర్‌సంస్థ నార్మన్ ఫోస్టర్స్ అండ్ పార్టనర్స్ ప్రతినిధుల బృందంతో రాష్ట్ర సచివాలయంలో బుధవారం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి మీడియాతోమాట్లాడుతూ అమరావతిలో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న శాసనసభ భవనానికి సంబంధించి అంతర్జాతీయ స్థాయి ఆర్కిటెక్చర్ సంస్థ నార్మన్ ఫోస్టర్ అండ్ పార్టనర్స్ ప్రతినిధులతో జరిగిన చర్చల్లో పలు అంశాలపై సమగ్రంగా చర్చించినట్లు తెలిపారు. శాసనసభ భవనం పైన ప్రత్యేక టవర్‌ను ఏర్పాటు చేసి, అక్కడి నుంచి అమరావతి రాజధాని మొత్తాన్ని వీక్షి ంచేలా >>2

## ఆధ్యాత్మిక పిఠాపురానికి అభివృద్ధి వెలుగులు

డి.సిఎం పవన్ కల్యాణ్ ప్రత్యేక చొరవ

రూ.30.66 కోట్లు నిధులు కేటాయింపు

24 దేవాలయాల పునరుద్ధరణకు రూ.17.06 కోట్లు

టిటిడి కల్యాణ మండపానికి రూ.2 కోట్లు

3లో



పిఠాపురంలో ఆలయాలను అభివృద్ధి చేస్తున్న దృశ్యం



ఇంటరాక్టివ్ సెషన్‌లో శాశ్వత్ గోయెంకా అడిగిన ప్రశ్నలకు బదులిస్తున్నమంత్రి లోకేష్

## పెట్టుబడులకు

# '3-ఎస్' మంత్రం

స్పీడ్... సర్వీస్... స్టెబిలిటీ

- వేగంగా వ్యాపార అనుమతులు, పెట్టుబడిదారులకు నిరంతర సేవలు
- పాలసీ స్థిరత్వంతో పెట్టుబడిదారుల్లో నమ్మకం పెంచుతున్నాం
- పెట్టుబడుల పురోగతిపై ఇన్వెస్టర్లతో నేరుగా సంప్రదింపులు
- ప్రతి శనివారం పెట్టుబడిదారులకు వ్యక్తిగతంగా మెసేజ్ చేస్తున్నా
- చంద్రబాబు బ్రాండ్... ఆయన ట్రాక్ రికార్డే ఎపికి బలం
- రేపటితరం గర్వపడేలా అమరావతి చరిత్ర సృష్టించబోతోంది
- ప్రపంచమంతా చెప్పుకునేలా ఒక మోడల్‌ను ఎపిలో సృష్టించాలనేది మా లక్ష్యం
- ఫార్చ్యూన్ ఇండియా '40 అండర్ 40' కార్యక్రమంలో మంత్రి లోకేష్

**విజయవాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** భారతదేశంలో అత్యంత ప్రతిభావంతులైన యువనాయకులు, చేంజ్ మేకర్లు, బిజినెస్ మైండ్స్‌కు ఫార్చ్యూన్ ఇండియా '40 అండర్ 40' పేరిట ముంబైలో అవార్డులను ప్రదానంచేసింది. ఈ కార్యక్రమానికి కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి చిరాగ్ పాశ్వాన్, రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు అవార్డులను ప్రదానం చేశారు. దేశంలో డైరీ వాల్యూయాడెడ్ ఉత్పత్తుల్లో ప్రత్యేకత సాధించిన హెరిటేజ్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ నారా బ్రాహ్మణికి కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఇంటరాక్టివ్ సెషన్‌లో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఆర్‌పిఎస్‌జి గ్రూప్ వైస్ చైర్మన్ శాశ్వత్ గోయెంకా అడిగినప్రశ్నలకు మంత్రి లోకేష్ సమాధానాలిచ్చారు. దేశంలోని మిగతా రాష్ట్రాలకు భిన్నంగా ఆంధ్రప్రదేశ్ వేగంగా పెట్టుబడుల ఆకర్షణకు రెండు ప్రధాన కారణాలను మంత్రి లోకేష్ తెలిపారు. స్పీడ్, సర్వీస్, స్టెబిలిటీ తమ విజయ రహస్యమని తెలిపారు. 'వ్యాపారం అయినా, రాజకీయాలు అయినా మనం నిర్వహించే సంస్థలకు కేవలం సంరక్షకులం మాత్రమేఅని నేననమ్ముతాను. అదే విధానాన్ని రాజకీయాల్లో కూడా అవలంబిస్తున్నాం. ఒక మంత్రిగా నేను ఇక్కడికి వచ్చింది కేవలం మానవ వనరుల అభివృద్ధి, విద్యా శాఖకు సంరక్షకుడిగా మాత్రమే. నాకు అప్పగించిన >>2



నేపాల్‌లో సంభవించిన వరదల దృశ్యం

## జనవరి 1 నుంచి 'సంజీవన్ని

>> న్నట్టు అధికారులు వివరించారు. చిత్తూరులో నమోదైన ఫలితాల ప్రకారం, హైపర్‌టెన్షన్ కేసుల్లో 56 శాతం కేసులు నియంత్రణలోకి వచ్చినట్టు తేలిందన్నారు. డయాబెటిస్ కేసుల్లో 16శాతం కేసుల తీవ్రత తగ్గిందన్నారు. అలాగే, ప్రైమరీ హెల్త్‌కేర్ సేవల వినియోగంలోనూ గణనీయమైన పెరుగుదల నమోదైనట్టు వెల్లడించారు. సంజీవని సేవలపై పౌరుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు నిర్వహించిన సర్వేలో 91శాతం మంది సంజీవని సేవల అనంతరం తమ ఆరోగ్యంపై అవగాహన పెరిగిందని చెప్పారు. స్క్రీనింగ్ నుంచి చికిత్స, ఫాలోఅప్ వరకు ఎఐ ఆధారిత ఆరోగ్య వ్యవస్థను తీర్చిదిద్దుతున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. సమీక్షలో మంత్రి సత్యకుమార్ యాదవ్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి వీరపాండియన్, సంయుక్త కార్యదర్శి రోణంకి గోపాలకృష్ణ, టాటా ఎండి సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.


## నీళ్లకోసం జలజగడం

>> నింపే అవకాశం ఉంది. నాగార్జునసాగర్‌లో నీటి నిల్వ తక్కువగా ఉంది. సెప్టెంబర్ 4న కెఆర్ఎంబి సమావేశమై నీటి వాటాలు నిర్ణయించే అవకాశం ఉంది. తెలంగాణ 50శాతం చొప్పున ఉన్ననీటిని పంచుకోవాలని వాదిస్తోంది. ఆంధ్రప్రదేశ్ మాత్రం అక్టోబర్ వరకు తమకు 47 టిఎంసిలు కావాలని కోరింది. అంతేకాదు 50:50 చొప్పున పంచుకోమని 64:36 చొప్పున నీటి వాటా ఉండాలని అంటున్నది. దీనితో ఏ నిర్ణయం తీసుకోకుండా సెప్టెంబర్ 4కు వాయిదా వేశారు. శ్రీశైలం నాగార్జునసాగర్ నీటిని తాగునీటికి మాత్రమే వాడాలని నిర్ణయించినా కుడకాల్వకు ఆంధ్రప్రదేశ్ అధికారులు నీటిని విడుదల చేయడంతో ఆందోళన చెలరేగింది.

## కోనసీమ మత్స్యకారుల ఆచూకీ లభ్యతపై సిఎం చంద్రబాబు హర్షం

**విజయవాడ ఆగస్టు 26,ప్రభాతవార్తప్రతినిధి:** కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లి ఆచూకీ కోల్పోయిన ఏడుగురు మత్స్యకారులు పశ్చిమ బెంగాల్ తీరంలో సురక్షితంగా బయటపడ్డారు. పడవతో పాటు ఆచూకీ కోల్పోయిన ఏడుగురిలో అంతా సురక్షితంగా ఉండడంపై సిఎం చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. మత్స్యకారుల ఆచూకీ తెలుసుకునేందుకు నిరంతరం శ్రమించిన గాలింపు బృందాలకు, అధికార యంత్రాంగానికి ఆయన ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. ఈ నెల 3వ తేదీన ఓడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నుంచి ఏడుగురు మత్స్యకారులతో సముద్రంలోకి వెళ్లిన బోటు సాకేంతిక లోపంతో పనిచేయక, గాలులకు వేరే ప్రాంతానికి కొట్టుకుపోయింది. నిర్ణీత గడువు దాటినా తిరిగి రాలేదనే విషయం తెలిసిన వెంటనే సిఎం చంద్రబాబు... దీన్ని అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. స్వయంగా మంత్రులను పంపి గాలింపును పర్యవేక్షించారు. గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం ఏమాత్రం ఆలస్యం చేయకుండా అన్ని మార్గాల ద్వారా గాలింపు చర్యలు చేపట్టాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. ఘటనపై సిఎం మూడు సార్లు సమీక్షించి రెస్క్యూ ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకున్నారు. ఏమాత్రం నిరాశ చెందకుండా సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాలని సూచించారు. సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు నేవీ, కోస్ట్ గార్డ్, సెంట్రల్ మెరైన్ విభాగాలతో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం నిరంతరం సంప్రదింపులు జరిపింది. కోనసీమ తీరం నుంచి పశ్చిమ బెంగాల్ తీరం వైపు వెళ్లి ఉండొచ్చనే అంచనాతో పశ్చిమ బెంగాల్ కోస్ట్ గార్డ్ విభాగాలను, అక్కడ స్థానికంగా ఉన్న శంకర్‌పూర్ ఫిషింగ్ హార్బర్ మత్స్యకారులను అప్రమత్తంచేశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ విభాగాల సహకారాన్ని కూడా తీసుకున్నారు. అన్ని ప్రయత్నాలు ఫలించి శంకర్‌పూర్ సమీపంలో బోటును, అందులోని ఏడుగురు మత్స్యకారులను రక్షించగలిగారు. అలాగే మత్స్యకారుల ఆచూకీ లభ్యమైన వెంటనే ఆ వివరాలను వారి కుటుంబ సభ్యులకు తెలిపారు. సురక్షితంగా ఒడ్డుకు చేరిన మత్స్యకారులను స్వస్థలాలకు తీసుకువచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను సిఎం ఆదేశించారు.

## తెలంగాణలో కొత్త పూలమొక్క 'అమ్మానియా తెలంగానెన్సిస్



**హైదరాబాద్, అగస్టు 26, ప్రభాతవార్త:** తెలంగాణలో ఒక కొత్త పుష్పించే మొక్క జాతిని కనుగొన్నారు. పరిశోధకులు దీనికి రాష్ట్ర పేరును కలుపుతూ 'అమ్మానియా తెలంగానెన్సిస్ అని నామకరణం చేశారు. రంగారెడ్డి జిల్లాలోని జలాశయాలు, తడి ప్రాంతాలతో పాటు, నాగర్‌కర్నూల్ జిల్లాలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో ఈ మంచినీటి మొక్కను గుర్తించారు. లైత్రేసియే కుటుంబానికి చెందినదిగా ఈ జాతి గుర్తించారు. హైదరాబాద్‌లోని బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా దక్కన్ రీజినల్ సెంటర్‌కు చెందిన అరికృష్ణన్ పార్థిబన్, లదన్ రసింగం, హైదరాబాద్ విశ్వ విద్యాలయానికి చెందిన సిద్ధార్థన్ సర్వేశ్వరన్, ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన దేవర సంధ్యా దీపిక దీనిపై అధ్యయనం చేశారు. క్షేత్ర సర్వేలు, సంబంధిత జాతులు, హెర్బేరియం నమూనాలతో పోలికలను సరిచూసిన తరువాత ఈ ఆవిష్కరణ జరిగింది. ఈ సేకరణలు, తెలిసిన ఏ అమ్మానియా జాతితోనూ సరిపోలడం లేదని ఆ అధ్యయనంలో తేలింది. టైప్ నమూనాను 2025 జనవరి 4న అమ్రాబాద్‌లోని వత్వార్లపల్లె సమీపంలో సేకరించగా, ఇతర నమూనాలు రంగారెడ్డి జిల్లాలోని నర్సింగి, గచ్చిబౌలి నుండి లభించాయి.

అమ్మానియా ప్రజాతి తడి, జల ఆవాసాలతో సంబంధం ఉన్న గుల్మ జాతి మొక్కలను కలిగి ఉంటుంది. తెలంగాణ నమూనాలు అమ్మానియా కార్డాటా, అమ్మానియా ప్రోస్ట్రాటాలను పోలి ఉన్నాయి, కానీ కాడలతో కూడిన పుష్పగుచ్ఛాలు, ముదురు గులాబీ రంగు రేకులు, విలక్షణమైన ఆకులు, రక్షక పత్రాలు, అసాధారణమైన విత్తన కవచ నమూనా వంటి విలక్షణమైన లక్షణాలను కలిగి ఉన్నాయి. ఈ మొక్క కాలానుగుణంగా ప్రవహించే వాగుల వెంబడి, నీటి వనరుల అంచులలో, తడి ఇసుక నేలల్లో, అమ్మానియా మల్టిఫ్లోరా, రోటాలా జాతుల వంటి చిత్తడి నేల మొక్కలతో పాటు పెరుగుతుంది. ఇది నవంబర్, ఫిబ్రవరి నెలల మధ్య పూలు పూసి, ఫలాలను ఇస్తుందని పరిశోధకులు తెలిపారు.

# మత్స్యకారులు క్షేమం!

>> నెల 3న ఓడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నుంచి ఏడుగురు మత్స్యకారులు బోటులో సముద్ర వేటకు వెళ్లారని మంత్రి తెలిపారు. నిర్ణీత సమయంలో బోటు తిరిగి రాకపోవడంతో సమాచారం అందిన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా స్పందించి, మత్స్యకారుల ఆచూకీ కోసం ఎలాంటి ఆలస్యం చేయకుండా అన్ని విధాలుగా గాలింపు చర్యలు చేపట్టాలని ఆదేశించారని చెప్పారు. మత్స్యకారుల భద్రత విషయంలో ముఖ్యమంత్రి చూపిన ప్రత్యేక చొరవ, శ్రద్ధ అభినందనీయమని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు పరిస్థితిని తెలుసుకుంటూ, కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని, నేవీ, కోస్ట్‌గార్డ్ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరపాలని ఆదేశించారని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తాను కూడా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ కేంద్ర అధికారులు, నేవీ, కోస్ట్‌గార్డ్ ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడినట్లు మంత్రి వెల్లడించారు.

మత్స్యకారుల ఆచూకీ కోసం సముద్రం, గగనతలం నుంచి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టడంతో పాటు, బోటు ఎలా తప్పిపోయింది, ఏ మార్గంలో ప్రయాణించి ఉండవచ్చు, ప్రస్తుతం ఏ ప్రాంతంలో ఉండే అవకాశం ఉందన్న అంశాలపై అన్ని కోణాల్లో పరిశీలన జరిపామని మంత్రి తెలిపారు. బోటులో సాంకేతిక సమస్య తలెత్తి ఉండే అవకాశం సహా ప్రతి అంశాన్ని నేవీ, కోస్ట్‌గార్డ్ అధికారులతో సమన్వయంతో పరిశీలించామని చెప్పారు. గాలి దిశ, వేగం, సముద్ర ప్రవాహాలు, బోటు డ్రిఫ్ట్ అయ్యే అవకాశం వంటి అంశాలను కూడా శాస్త్రీయంగా విశ్లేషించి, బోటు పశ్చిమ బెంగాల్ తీరం వైపు వెళ్లి ఉండవచ్చన్న అంచనాతో ఆ ప్రాంతంలోని కోస్ట్‌గార్డ్ యూనిట్లు, స్థానిక మత్స్యకారులను అప్రమత్తం చేశామని మంత్రి తెలిపారు. ఈ సమన్వయ కృషి ఫలితంగానే శంకర్‌పూర్ ఫిషింగ్ హార్బర్ సమీపంలో బోటును గుర్తించి, అందులోని ఏడుగురు మత్స్యకారులను సురక్షితంగా రక్షించగలిగామని చెప్పారు. బోటు యజమాని సోదరుడు భవానీ ప్రసాద్‌తో మాట్లాడి ఏడుగురు మత్స్యకారులు పశ్చిమ బెంగాల్‌లో క్షేమంగా ఉన్న విషయాన్ని నిర్ధారించుకున్నామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం వారంతా ఆరోగ్యంగా ఉన్నారని, వారి కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడించామని చెప్పారు. మత్స్యకారులను సురక్షితంగా స్వస్థలాలకు తీసుకువచ్చేందుకు మత్స్యశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారని తెలిపారు.

ఈ గాలింపు చర్యల్లో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ యంత్రాంగం, ఇండియన్ నేవీ, కోస్ట్‌గార్డ్, ఎపి ఆర్‌టిజిఎస్, మత్స్యశాఖ, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేశాయని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్, మత్స్యశాఖ కమిషనర్, జాయింట్ డైరెక్టర్, అల్లవరం ఎఫ్‌డిఒతో పాటు క్షేత్రస్థాయి సిబ్బంది చేసిన కృషిని మంత్రి అభినందించారు. "మత్స్యకారుల భద్రత విషయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చూపిన ప్రత్యేక శ్రద్ధకు ధన్యవాదాలు. మత్స్యకారుల ఆచూకీ కోసం మొదటి నుంచి చివరి వరకు ప్రభుత్వం అందుబాటులో ఉన్న అన్ని వనరులను వినియోగించింది. ఏడుగురు మత్స్యకారులు సురక్షితంగా ఉన్నారనే శుభవార్త రావడం ఎంతో సంతోషంగా ఉంద్ది అని మంత్రి అన్నారు. "మత్స్యకారుల భద్రత, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. మత్స్యకారులకు, వారి కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. వారి సమస్యల పరిష్కారానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం్ది అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

ఇకడాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు తీరం నుంచి ఏడుగురు మత్స్యకారులు ఈ నెల 3న సముద్రంలో వేటకు వెళ్లారు. వేటకు వెళ్లిన మత్స్యకారులు గంట తర్వాత నుంచి స్థానికులకు అందుబాటులోకి రాలేదు. వేట ముగించుకుని 10 రోజుల్లో రావాల్సిన వారు తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు మెరైన్ పోలీసులు, మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. గల్లంతైన మత్స్యకారుల కోసం దాదాపు 10 రోజులు గాలింపు చర్యలు చేపట్టారు. ఏడుగురు మత్స్యకారులు బెంగాల్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. మత్స్యకారులంతా సురక్షి తంగా ఉన్నారని వెల్లడించారు. బోటులో సాంకేతిక సమస్య ఏర్పడడంతో బెంగాల్ తీరానికి చేరినట్లు పేర్కొన్నారు.

## మరో ప్రమాదంలో సురక్షితంగా బయటపడ్డ మత్స్యకారులు

**సఖినేటిపల్లి, ఆగస్టు 26 ప్రభాతవార్త:** కాకినాడకు చెందిన ఏడుగురు మత్స్యకారులు వారం రోజుల తరువాత ప్రమాదం నుంచి బయట పడి అంతర్వేది పల్లెపాలెం హార్బర్‌కు చేరుకున్న ఘటన ఇది. ఈ ఘటనకు సంబందించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. వారం రోజుల క్రితం కాకినాడలో చేపల వేటకు ఏడుగురు మత్స్యకారులతో, ఇండియా ఎపి ఇ2 యం.యం 78 నెంబర్ గల బోటు బయలుదేరింది. చేపల వేట అనంతరం అంతర్వేది హార్బర్‌లో చేపల అమ్మే ప్రయత్నంలో గట్టుకు రావడానికి ప్రయత్నించగా సముద్రంలో ఆటుపోటులకు ఇసుక దిబ్బలు ఎక్కువగా ఉండటంతో బోటు ఇసుకకు తగిలి ఇరుక్కొని పోయింది. దాంతో చేసింది లేక లంగరు వేసి అక్కడే ఉండిపోయారు. మరుసటి రోజు మళ్లీ ఆటు పోటులకు బోటు తేలింది. కానీ పంఖా ఇరిగటం వల్ల ఆరోజు కూడా లంగారు సాయంతో అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. మంగళవారం ఒక బోటు వేటకు వెళ్లే సమయంలో నిలిచిపోయిన బోటును చూసి ఆగి వాళ్లతో మాట్లాడి వేటాడు సమయం కావటంతో అక్కడే ఉండమని చెప్పి బోటులో ఉన్నవాళ్లు వేటకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఆగిపోయిన బోటును తమ బోటుకు కట్టుకొని వచ్చే సమయంలో మళ్లీ బోటు ఇసుకలో చిక్కుకుంది. పడవకు రంధ్రం పడింది. వెంటనే మెరైన్ స్టేషన్‌కు సమాచారం అందించారు. రాత్రి 7 గంటల సమయంలో విషయం తెలుసుకున్న మెరైన్ పోలీస్ సిబ్బంది మరో బోటుతో అక్కడికి చేరుకున్నారు. ఆ బోటు సాయంతో రంధ్రం పడిన బోటును అంతర్వేది హార్బర్‌కు తీసుకు తరలించారు. సిఐ నవీన్ నరసింహ మూర్తి ఆదేశాలతో మాత్యకారులను వేములదివి ఒడ్డుకు తరలించి నర్సాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు అనంతరం వారి గృహాలకు తరలించారు. ఇలా కాకినాడ హార్బర్ నుండి వేటకు వెళ్లిన మత్యకారులు సంగాని సూర్యచంద్ర, మేసు కామేశ్వరరావు, వాసుపల్లి శ్రీనివాసు, దున్నా రాజు, పెదసింగు జగ్గారావు, పెమ్మడి స్వామి, కర్రి శ్రీనులు ప్రమాదం నుండి బయట పడి వారం రోజులకు తమ ఇళ్లకు చేరటంతో కథ సుఖాంతమైంది.

## అమరావతి శాసనసభ భవనానికి ప్రపంచస్థాయి రూపకల్పన నార్మన్ ఫోస్టర్స్ అండ్ పార్టనర్స్‌తో కీలక చర్చలు

**అమరావతి, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర రాజధాని అమరావతిలో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న గవర్నమెంట్ కాంప్లెక్స్‌లోని శాసనసభ భవనాన్ని ప్రపంచస్థాయి ప్రమాణాలతో, ఆధునిక వాస్తుశిల్పం- తెలుగు సంస్కృతి సమ్మేళనంగా, రాష్ట్ర ప్రజాస్వామ్య వైభవానికి ప్రతీకగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా శాసనసభ భవన డిజైన్, నిర్మాణ ప్రణాళిక, ఇంటీరియర్ డిజైన్, ఆధునిక సౌకర్యాలు, సాంకేతిక మౌలిక వసతులు, భద్రతా ప్రమాణాలు, సుస్థిర నిర్మాణ విధానాలు, భవిష్యత్ అవసరాలు తదితర అంశాలపై ప్రముఖ అంతర్జాతీయ ఆర్కిటెక్చర్ సంస్థ నార్మన్ ఫోస్టర్స్ అండ్ పార్టనర్స్ ప్రతినిధుల బృందంతో రాష్ట్ర సచివాలయంలో బుధవారం ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర, ఫోస్టర్స్ అండ్ పార్టనర్స్, సంస్థ ప్రతినిధులతో పాటు సిఆర్‌డిఎ అడిషనల్ కమిషనర్ అభిషేక్ కుమార్, సిఆర్‌డిఎ చీఫ్ ఇంజనీర్ ఏ.వి. రావు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శాసనసభ భవనం ఆంధ్రప్రదేశ్ చరిత్ర, సంస్కృతి, కళా వారసత్వం, ప్రజాస్వామ్య స్ఫూర్తి, ఆధునిక అభివృద్ధి ఆకాంక్షలను ప్రతిబింబించేలా రూపకల్పన చేయడంపై విస్తృతంగా చర్చించారు. ఆధునిక వాస్తుశిల్ప సౌందర్యంతో పాటు, భవనం వినియోగించే ప్రతి వర్గానికి సౌకర్యవంతంగా, సమర్థవంతంగా ఉండేలా నిర్మాణ ప్రణాళిక రూపొందించాలని అభిప్రాయపడ్డారు. శాసనసభ సముదాయంలో ముఖ్యమంత్రి ఛాంబర్, స్పీకర్ ఛాంబర్, డిప్యూటీ స్పీకర్ ఛాంబర్, శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్‌కార్యాలయం, బిజినెస్ అడ్వైజరీ కమిటీసమావేశ మందిరం, మంత్రులు, శాసనసభ్యుల కార్యాలయాలు, వివిధ శాసనసభ కమిటీల సమావేశ మందిరాలు తదితర విభాగాలను సమగ్రంగా ఏర్పాటు చేసే అంశాలపై చర్చించారు. అదేవిధంగా ప్రధాన సభా మందిరం, కమిటీ హాళ్లు, కాన్ఫరెన్స్ రూమ్స్, శాసనసభ్యుల లాబీలు, ప్రోటోకాల్ ప్రాంతాలు, మీడియా సెంటర్, ప్రెస్ కాన్ఫరెన్స్ హాల్, మీడియా వర్క్‌స్టేషన్లు, మీడియా బ్రీఫింగ్ సదుపాయాలు, సందర్శకుల గ్యాలరీలు, పబ్లిక్ లాంజ్‌లు, విజిటర్స్ రిసెప్షన్ ప్రాంతాలు వంటి కీలక సౌకర్యాలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించడంపై ప్రతినిధులతో అభిప్రాయాలు పంచుకున్నారు. శాసనసభ కార్యకలాపాలను ఆధునిక పద్ధతుల్లో నిర్వహించేందుకు ఆడియో-విజువల్ వ్యవస్థలు, డిజిటల్ ఓటింగ్, ఎలక్ట్రానిక్ డిస్‌ప్లేలు, ఆధునిక కమ్యూనికేషన్ నెట్‌వర్క్, లైవ్ టెలికాస్ట్, బ్రాడ్‌కాస్టింగ్ సదుపాయాలు, డిజిటల్ శాసన వ్యవస్థలు వంటి సాంకేతిక మౌలిక వసతులను సమగ్రంగా ఏర్పాటు చేయడంపై దృష్టి సారించారు.

ప్రజాప్రతినిధులు, మంత్రులు, అధికారులు, మీడియా ప్రతినిధులు, సందర్శకుల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ప్రవేశ మార్గాలు, ప్రోటోకాల్ మూవ్‌మెంట్, యాక్సెస్ కంట్రోల్, భద్రతా జోన్లు, పార్కింగ్, డ్రాప్-ఆఫ్, పికప్ ప్రాంతాలు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, ఫైర్ అండ్ లైఫ్ సేఫ్టీ వ్యవస్థలు వంటి అంశాలను డిజైన్‌లో సమర్థవంతంగా సమన్వయం చేయాలని చర్చించారు. అంతర్గత రూపకల్పనలో సభా మందిరం, ముఖ్యమంత్రి, స్పీకర్ ఛాంబర్లు, మంత్రులు-శాసనసభ్యుల కార్యాలయాలు, బిఎసి సమావేశ మందిరం, ఇతర కమిటీ హాళ్లు, మీడియా సెంటర్ తదితర విభాగాలకు తగిన గౌరవం, సౌకర్యం, కార్యాచరణ సామర్థ్యం కల్పించడంతో పాటు, తెలుగు సంస్కృతి, కళలు, శిల్పకళ, చారిత్రక వారసత్వాన్ని ఆధునిక వాస్తుశిల్పంతో మేళవించేలా ఇంటీరియర్ డిజైన్ రూపొందించడంపై ప్రత్యేకంగా చర్చించారు. అన్ని వర్గాల ప్రజలకు సులభమైన వినియోగాన్ని కల్పించేలా యూనివర్సల్ యాక్సెస్‌బులిటీ ప్రమాణాలు, ర్యాంపులు, లిఫ్టులు, ఆధునిక శానిటేషన్ సదుపాయాలు, సులభమైన అంతర్గత రాకపోకల మార్గాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అదే సమయంలో సహజ కాంతి-గాలి ప్రసరణ, నీటి సంరక్షణ, వర్షపు నీటి నిర్వహణ, పర్యావరణహిత నిర్మాణ విధానాలు, గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలు వంటి సుస్థిరత అంశాలను కూడా డిజైన్‌లో అంతర్భాగం చేయాలని చర్చించారు.

భద్రతకు సంబంధించి సిసిటివి నిఘా, యాక్సెస్ కంట్రోల్, ఇంటిగ్రేటెడ్ సెక్యూరిటీ మేనేజ్‌మెంట్, కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థలు, అత్యవసర పరిస్థితుల నిర్వహణ, ఫైర్ సేఫ్టీ తదితర ఆధునిక వ్యవస్థలను సమగ్రంగా ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని సమావేశంలో వివరించారు. శాసనసభ భవనం కేవలం పరిపాలనా నిర్మాణంగా కాకుండా రాష్ట్ర ప్రజాస్వామ్య స్ఫూర్తికి, తెలుగు సంస్కృతి-వారసత్వానికి, ఆధునిక ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ఆకాంక్షలకు చిరస్థాయి ప్రతీకగా నిలిచేలా నిర్మాణ ప్రణాళికను ముందుకు తీసుకెళ్లాలని సమావేశంలో దృష్టి సారించారు. ప్రజాస్వామ్యానికి ప్రతీకగా.. తెలుగు సంస్కృతికి అద్దంగా.. ఆధునిక ఆంధ్రప్రదేశ్ ప్రగతికి చిరునామాగా.. అమరావతి శాసనసభ భవనం రూపుదిద్దుకునేలా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని సమావేశంలో పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.

### వారం - వర్జ్యం

27-08-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం, మఖకార్తె
తి.చతుర్దశి ఉ.9.07
న.ధనిష్ఠ రా.2.13
వ. లేదు
దు1. ఉ.10.03-ఉ.10.53
దు2. మ.3.04-మ.3.54
రాహు. మ.1.30-మ.3.00 శుభ లేదు

### వార్తాఫలం

**మేషం:** కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు. ఇంటర్వ్యూలకు హాజరవుతారు. కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

**వృషభం :** మీకు ఇష్టం లేని పనిని ఇతరుల ఒత్తిడి మేరకు గత్యంతరం లేక చేయవలసి వస్తుంది. ఆస్తి వివాదాలు తీరుతాయి.

**మిథునం :** ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపారాలలో అభివృద్ధిని సాధిస్తారు. ఉద్యోగులకు స్థాన చలనం ఉంటుంది.

**కర్కాటకం :** మంచి ఫలితాలను సాధించాలంటే, మంచి పరిచయాలు కూడా అవసరమేనని భావిస్తారు. ఆభరణాలు కొనుగోలు.

**సింహం :** మీ పరోక్షంలో జరుగుతున్న అన్యాయాలు వెలుగు చూస్తాయి. ఆరోగ్యం జాగ్రత్త. కొత్త ఋణం తీసుకుంటారు.

**కన్య :** స్త్రీల, వృద్ధుల సహకారంతో కొంత ఊరట చెందుతారు. కోర్ట్ కేస్‌ల నుండి క్షేమంగా బయటపడతారు.

**తుల :** కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా కాలాన్ని గడపగలుగుతారు. నూతన అవకాశాలు లభిస్తాయి. వ్యాపారంలో లాభం.

**వృశ్చికం :** మంచి చెడులను విశ్లేషించుకొని అడుగులను జాగ్రత్తగా ముందుకు వేస్తారు. ఆస్తులు పరిష్కారమై లబ్ధి పొందుతారు.

**ధనుస్సు :** వృత్తిఉద్యోగాల పరంగా ఒడిదుడుకులేవీ ఏర్పడవు. ఉద్యోగులకు పదోన్నతులు లభిస్తాయి. క్రొత్త బ్రాంచీల ఏర్పాటు.

**మకరం :** కళలు, రాజకీయ, రంగాలలోని వాడి సన్మానయోగం. భూముల క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు.

**కుంభం :** వివాహాది శుభకార్యాలు సానుకూల పడతాయి. జీవితాశయం నెరవేరుతుంది. కుటుంబ సభ్యుల నుండి సహాయం.

**మీనం :** వృత్తి వ్యాపారాలు అనుకూలంగా వుంటాయి. పేయింటింగ్, ఆర్ట్, డిజైనింగ్‌లో మంచి పేరు ప్రఖ్యాతి సాధిస్తారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్




ఫార్చ్యూన్‌ఇండియా 40 అండర్ 40 అవార్డును అందుకుంటున్న నారా బ్రాహ్మణి

## పెట్టుబడులకు '3-ఎస్ష్ మంత్రం

>> బాధ్యతలను మరింత మెరుగైన స్థితికి తీసుకెళ్లాలన్నదే నా ఆలోచన. గతంలో వ్యాపారంలోనూ ఇదే విధానాన్ని అనుసరించాను. ఇప్పుడు అధికారిక బాధ్యతలోనూ ఇదే విధానంతో ముందుకు వెళ్తున్నాను. మనందరం, ముఖ్యంగా రాజకీయ నాయకులు సంస్థలను నిర్మించే వ్యక్తులుగా ఉండాలి అని నేను బలంగా నమ్ముతున్నాను. ఎపి అభివృద్ధికి, పెట్టుబడుల ఆకర్షణకు రెండు ప్రధాన కారణాలు ఉన్నాయి. మొదటిది మేము అనుసరిస్తున్న '3-ఎస్ష్‌ల విధానం.. స్పీడ్, సర్వీస్, స్టెబిలిటీ అనే విధానాలు. మొదటిది వేగం, మేము ఎంత వేగంగా పని చేస్తున్నామో ఇక్కడ ఉన్న అనేక పరిశ్రమల ప్రతినిధులు స్వయంగా చూశారు. రెండోది సర్వీస్, చాలా మంది పెట్టుబడిదారులకు వారి పెట్టుబడుల ప్రస్తుతస్థితిపై నేను స్వయంగా ఎప్పటికప్పుడు ఫీడ్‌బ్యాక్ ఇస్తుంటాను. దాదాపు ప్రతి శనివారం రాత్రి వారికి వ్యక్తిగతంగా మెసేజ్ పంపుతాను. పెట్టుబడిదారులు కోరుకునేది ఇదే అని నేను నమ్ముతున్నాను. మూడోది పాలసీ స్థిరత్వం అంటే విధానాల్లో స్థిరత్వం. ప్రభుత్వాలు వస్తాయి, పోతాయి. కానీ పెట్టుబడిదారులు కోరుకునేది స్థిరమైన పాలసీ ఫ్రేమ్‌వర్క్. మా నాయకత్వం గతంలో తీసుకొచ్చిన విధానాలు రాజకీయ మార్పులను తట్టుకుని నిలబడ్డాయి. ప్రభుత్వాలు మారవచ్చు, కానీ మా విధానాలు మాత్రం కొనసాగుతాయి.

రెండో కారణం సిఎం చంద్రబాబు నాయుడు. సిబిఎన్ అంటే ఒక బ్రాండ్. ఆయనకు అద్భుతమైన ట్రాక్ రికార్డు ఉంది. పెట్టుబడుల కోసం అవసరమైన తలుపులు తెరవగలిగే ముఖ్యమంత్రి ఉండటం వల్ల మా పని సగం సులభమవుతుంది. మిగిలిన సగం నేను సమావేశ మందిరంలోకి వెళ్లినపుడు ఒప్పందాన్ని ఖరారు చేస్తాను. మేమిద్దరం కలిసి ఈవిధంగా పనిచేస్తున్నాం. ఈ భాగస్వామ్యమే ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా నిలబెట్టింది. సిఎం చంద్రబాబు మంత్రివర్గంలో తాను పనిచేస్తున్నానంటే ఆయన దగ్గర నేను నేర్చుకోవాల్సి ఉంది. తండ్రిగా ఆయన చూసి చాలా నేర్చుకున్నాను. మంత్రిగా ఆయన మాకు సిఎం, ఆయనది దూరదృష్టి, ఆ దిశలో ఆయన మా అభిప్రాయాలు చెబుతామన్నారు. అన్నింటిని ఆయన వింటారు. ఆచరణకు అవకాశం కల్పిస్తారు. ప్రతిరోజూ తీసుకునే నిర్ణయాల విషయంలో మనం మన తల్లిదండ్రులతో విభేదించే సందర్భాలు ఉంటాయి. అయితే నా అభిప్రాయం కుటుంబ వ్యాపారాల్లో ఉన్న యువత తమ కంఫర్ట్ జోన్ నుంచి బయటకు రావాలి. కొత్త రంగాల్లో, కొత్త వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టాలి. పరిశోధనపై పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఇది చాలా కీలకం. ఇక్కడే విద్య ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. వివిధ ఖండాల్లో ఉన్న సంస్థలు, పరిశోధనా సంస్థల మధ్య అనుసంధానం కల్పించి, పరిశోధన, కొత్త రంగాల్లో మరింత దృష్టి పెట్టవచ్చు. అది అంతరిక్ష రంగం కావచ్చు, క్వాంటమ్ టెక్నాలజీ కావచ్చు, మెటీరియల్ సైన్సెస్ కావచ్చు భారతదేశం చేయగలిగేది ఎంతో ఉంది. మనమంతా కలిసి దీన్ని సాధించగలం. ఇక రాష్ట్రం తరఫున నేను కోరేది ఒక్కటే ఈ మార్పులో మీరు కూడా భాగస్వాములు కండి. మనం వివిధ దేశాలు, వివిధ నగరాల గురించి, అక్కడ జరుగుతున్న మార్పుల గురించి మాట్లాడుతుంటాం. నేను మీకు అందిస్తున్న వేదిక ఆంధ్రప్రదేశ్. మేము పూర్తిగా పరిపూర్ణంగా ఉన్నామని చెప్పడం లేదు. కానీ మేము చేసే ప్రతి తప్పునుంచి నేర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. రాష్ట్రాన్ని మరింత మెరుగ్గా ఎలా తీర్చిదిద్దాలి? అనే విషయంలో మీ అభిప్రాయాలను స్వీకరించడానికి, మీతో కలిసి పనిచేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను. రేపటి భారతదేశం, మన తర్వాత తరం గర్వపడేలా ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి అనే నగరం మరోసారి చరిత్ర సృష్టిస్తోంది. ప్రపంచమంతా చెప్పుకునేలా ఒక మోడల్‌ను ఆంధ్రప్రదేశ్‌లో సృష్టించాలనేది మా లక్ష్యం. ఈరోజు ఇక్కడ ఉన్న 40 ఏళ్ల లోపు యువత నుంచి నేను కోరేది కూడా ఇద్దే్ అని నారా లోకేష్ వివరించారు.

# తెల్లారిన బతుకులు

>> మృతదేహాలను కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బస్సు అతివేగంగా కంటైనర్‌ను ఢీకొనడంతో కంటైనర్‌లోని ఐరన్ పిల్లర్లు రోడ్డుపై చెల్లాచెదురుగా పడటంతో పాటు కొన్ని పిల్లర్లు బస్సులోకి చొచ్చుకుపోయాయి. దీంతో బస్సులోని ప్రయాణికులు తీవ్రంగా గాయపడగా ఆరుగురు మృతి చెందారు. ఘటనా స్థలంలో మృతదేహాలు చెల్లాచెదురుగా పడిపోవడంతో భయానక వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును పోలీసులు, స్థానికులను అడిగి తెలుసుకున్నారు. జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో పట్టణ, రూరల్ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. బస్సులో మొత్తం 42 మంది ప్రయాణికులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుల్లో కృష్ణా జిల్లా వంగటూరు మండలం తెలప్రోలు గ్రామానికి చెందిన యాసారపు చిన్ని (32), విజయవాడ కానూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని బొల్లిపోగు మేరీ జోష్ణ (29), పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణానికి చెందిన సురావరపు శకిన (24), కృష్ణా జిల్లా పమిడిముక్కల మండలం పడమటి లంకపల్లి గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి చెన్నకేశవుల నాగేంద్రబాబు (31), విజయవాడ జయప్రకాష్ నగర్‌కు చెందిన పిడికిటి లక్షి ్మ (30), విజయవాడ సింగ్ నగర్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి కొండూరు భావన వర్ష (25) ఉన్నారు. కంటైనర్ డ్రైవర్, బస్సు డ్రైవర్ల ఆచూకీ తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

## కోదాడ బస్సు ప్రమాదంపై సిఎం చంద్రబాబు విచారం

**విజయవాడ,ఆగస్టు26,ప్రభాతవార్తప్రతినిధి:** కోదాడ సమీపంలో జరిగిన బస్సు ప్రమాదం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మరణించిన వారి కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సహాయక చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని ఆయన సూచించారు.

**ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి**

సూర్యాపేట జిల్లాలోని కోదాడ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతిచెందిన ఈ ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతిచెందడం బాధాకరమని తెలిపారు. ఈ ఘటనకు గల కారణాలను అధికారుల ద్వారా పవన్ తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో మరో 11 మంది తీవ్రంగా గాయపడగా, నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఈ ఘటనపై తెలంగాణ రాష్ట్ర అధికారులతో ఎపి యంత్రాంగం సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు పవన్ కల్యాణ్ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలి: మంత్రి లోకేష్**

సూర్యాపేట జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతిచెందడంపై మంత్రి నారా లోకేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కోదాడ దగ్గర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందడం తనను తీవ్రంగా కలిచివేసిందని తెలిపారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన వారికి నివాళులు అర్పిస్తున్నానని అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నానని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

**గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలి: మంత్రి మండిపల్లి**

సూర్యాపేట జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతిచెందడంపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల భద్రతా ప్రమాణాలు, డ్రైవర్ల అప్రమత్తత విషయంలో రాజీ పడకూడదని తెలిపారు. రోడ్డు భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించేలా అధికారులు మరింత కఠినంగా పర్యవేక్షించాలని అన్నారు. ప్రయాణికుల భద్రతే అత్యంత ప్రాధాన్యంగా అన్ని బస్సుల యాజమాన్యం, డ్రైవర్లు వ్యవహరించాలని ఆయన సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సూచించారు.

## ప్రపంచస్థాయి రాజధానిగా అమరావతి

>> కల్పన చేస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో నియోజకవర్గాల డీలిమిటేషన్ వల్ల ఏర్పడే మార్పులను దృష్టిలో ఉంచుకుని, దీర్ఘకాలిక అవసరాలకు అనుగుణంగా భవన డిజైన్లను రూపొందిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని 265 శాసనసభ స్థానాలు, 110 శాసనమండలి స్థానాలకు అనుగుణంగా శాసనసభభవనాన్ని డిజైన్ చేస్తున్నట్లు మంత్రి వివరించారు. ప్రజలు శాసనసభను సందర్శించినప్పుడు రాష్ట్ర ప్రజాస్వామ్య వ్యవస్థ, శాసన ప్రక్రియపై అవగాహన కలిగేలా, వారికి మంచి అనుభూతిని అందించే విధంగా ప్రత్యేకంగా ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. గవర్నర్ ప్రసంగించే సందర్భాల్లో శాసనసభ, శాసనమండలి ఉభయ సభల సభ్యులందరూ ఒకే చోట కూర్చునేలా సెంట్రల్ హాల్ ఏర్పాటు చేసేవిధంగా డిజైన్ రూపొందిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. శాసనసభ ప్రాంగణం పూర్తిగా ఆధునిక సౌకర్యాలతోపాటు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కలిగి ఉండాలని సిఎం సూచించారని తెలిపారు. అండర్‌గ్రౌండ్ పార్కింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేసి, పైభాగంలో పచ్చదనంతో కూడిన గార్డెన్ తరహా ప్రాంగణంగా అభివృద్ధి చేయాలన్నది సిఎం ఆలోచనగా మంత్రి వెల్లడించారు.

27-8pg3exHMNWJQE:27-8pg3exHMNWJQE.qxd 8/26/2026 11:25 PM Page 1





## ఆధ్యాత్మిక పిఠాపురానికి అభివృద్ధి వెలుగులు

**విజయవాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** "చరిత్ర ఉన్న చోట పరిరక్షణ ఉండాలి.. సంస్కృతి ఉన్న చోట అది మరింత శోభిల్లాలి" అనేది ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృఢ సంకల్పం. లక్షలాది భక్తులకు మెరుగైన వసతులు కల్పించేలా అభివృద్ధి పనులు, ఆధ్యాత్మికత కొలువైన క్షేత్రంలో అభివృద్ధి ఉండాలి అన్నదే ఆయన లక్ష్యం. ఈ మేరకు డి.సిఎం కార్యాలయం కీలక ప్రకటన విడుదల చేసింది. పిఠాపురం నియోజకవర్గ చారిత్రక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని కాపాడుతూ, ఆ వైభవాన్ని భవిష్యత్ తరాలకు మరింత ఘనంగా అందించాలనే ఆయన కార్యాచరణ ఇప్పుడు క్షేత్రస్థాయిలో రూపుదాలుస్తోందని తెలిపింది.. పవన్ కల్యాణ్ స్వయంగా ప్రత్యేక చొరవ తీసుకొని, నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధి, భజన మందిరాల నిర్మాణం, కళ్యాణ మండపాల ఏర్పాటు కోసం ఏకంగా రూ.30.66 కోట్ల నిధులను మంజూరు చేయించారు. ఆయన నిరంతర పర్యవేక్షణలో ఈ అభివృద్ధి పనులు ప్రస్తుతం నియోజకవర్గవ్యాప్తంగా శరవేగంగా జరుగుతున్నాయి.

### భక్తుల రద్దీకి తగ్గట్టు ఆలయాల ఆధునీకరణ

పిఠాపురం నియోజకవర్గంలోని 24 ప్రముఖ దేవాలయాల అభివృద్ధి కోసం రూ.17.06 కోట్ల నిధులను కేటాయించారు. ఈ నిధులతో ఆలయాల నిర్మాణం, పునరుద్ధరణ, మరమ్మతులతో పాటు భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కల్పన పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. గొల్లప్రోలు సీతారామస్వామి ఆలయంలో ప్రాకార మండపం నిర్మాణం తుది దశకు చేరింది. కొత్తపల్లిలోని జగన్నాథ, సత్యనారాయణ స్వామి ఆలయాల్లో ధ్వజస్తంభాల ప్రతిష్ఠాపన పనులు పూర్తయ్యాయి. పిఠాపురం కొత్తపల్లి వీధిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకుల క్వార్టర్ల స్లాబ్ పనులు పూర్తయ్యాయి. శ్రీ కుంతీ మాధవస్వామి ఆలయంలో కాలక్షేప మండపం, రామకృష్ణాపూర్ సూర్యనారాయణ స్వామి ఆలయంలో రాజగోపురం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. శ్రీకుక్కుటేశ్వర స్వామి ఆలయానికి రూ.5 కోట్లు, శ్రీ పాద శ్రీవల్లభ దేవస్థానానికి రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు మొదలు కానున్నాయి. పునరుద్ధరణ జరుగుతున్న ఆలయాల్లో శతాబ్దాల ఘన చరిత్ర కలిగిన పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. ముఖ్యంగా పిఠాపురంలోని పంచ మాధవ క్షేత్రాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందిన 10వ శతాబ్దం నాటి శ్రీ కుంతీమాధవ స్వామి ఆలయంతోపాటు, పిఠాపురం మహారాజుల కాలం నాటి అనేక పురాతన దేవాలయాలు ఈ ప్రాజెక్టు ద్వారా సరికొత్త రూపును సంతరించుకుంటున్నాయి. పిఠాపురం నియోజకవర్గంలోని పుణ్యక్షేత్రాలకు ఏటా సుమారు 13.76 లక్షల నుంచి 18.07 లక్షల మంది భక్తులు వస్తుంటారు. సాధారణ రోజుల్లోనే కాకుండా పండుగలు, ప్రత్యేక పూజలు, కల్యాణోత్సవాల సమయంలో భక్తుల రద్దీ మరింత పెరుగుతుంది. ఆయా పర్వదినాల్లో రోజుకు 20 వేల నుంచి ఏకంగా 50 వేల మంది వరకు భక్తులు తరలివస్తుంటారు. ఈ భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయాల ఆధునీకరణ పనులు చేపడుతున్నారు.

### అత్యాధునిక వసతులతో టిటిడి కల్యాణ మండపం

పవన్ కల్యాణ్ ప్రత్యేక చొరవతో గతంలో పాడా ఆధ్వర్యంలో పిఠాపురం పట్టణంలోని టిటిడి కల్యాణ మండపాన్ని అన్ని ఆధునిక వసతులతో పునర్నిర్మించారు. అలాగే, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ మాడ వీధుల విస్తరణ పనులను విజయవంతంగా పూర్తి చేశారు. ఇదే స్ఫూర్తితో ప్రస్తుతం యు.కొత్తపల్లి మండలంలోని తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపం నిర్మాణానికి రూ.2 కోట్లను ప్రత్యేకంగా కేటాయించారు. వివాహాలు, ధార్మిక కార్యక్రమాలు, ఇతర సామాజిక అవసరాలకు అనువుగా అత్యాధునిక వసతులతో ఈ కల్యాణ మండపాన్ని నిర్మించనున్నారు.

### భజన మందిరాలతో పల్లెల్లో ఆధ్యాత్మిక శోభ



కాకినాడ జిల్లావ్యాప్తంగా ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత పెంపొందించడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించే లక్ష్యంతో 419 భజన మందిరాలను పునర్నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పిఠాపురం నియోజకవర్గంలో తొలి దశలో 48 భజన మందిరాల నిర్మాణానికి రూ.11.60 కోట్ల నిధులు మంజూ రయ్యాయి. ఈ భజన మందిరాలు కేవలం భక్తి కార్యక్రమాలకే పరిమితం కాకుండా భజనలు, ఆధ్యాత్మిక సమావేశాలు, స్థానిక సాంస్కృతిక వేడుకలు, గ్రామస్థాయి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయనున్నారు. మొత్తంగా రూ.30.66 కోట్లతో చేపడుతున్న ఈ అభివృద్ధి కార్యక్రమాలు పిఠాపురం ఆధ్యాత్మిక వారసత్వ పరిరక్షణతోపాటు ఆలయాల ఆధునీకరణ, భక్తులకు మెరుగైన సౌకర్యాలు, గ్రామీణ సామాజిక వేదికల బలోపేతానికి దోహదపడనున్నాయి.

# వర్షాభావ పరిస్థితుల్లోనూ ఖరీఫ్ సాగుకు ప్రత్యేక చర్యలు

- ఎల్‌నినో ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక
- 20.35 లక్షల హెక్టార్లలో ఖరీఫ్ సాగు, పప్పుధాన్యాల సాగులో 23.6శాతం వృద్ధి
- పంటల బీమా పరిధి 108శాతం పెరుగుదల
- రైతుల కోసం ఇంతటి ముందస్తు ప్రణాళిక జగన్ పాలనలో ఎక్కడుంది?: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ ఖరీఫ్ సాగుకు ఎక్కడా విఘాతం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో అన్ని చర్యలు చేపట్టిందని వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుంటే, వాస్తవాలను పక్కనపెట్టి రాజకీయ విమర్శలు చేయడం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తగదని అన్నారు. రైతుల గురించి మాట్లాడే ముందు జగన్ తన ఐదేళ్ల పాలనను ఒకసారి గుర్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. 2026 జూన్ మొదటి వారం నుంచి ఆగస్టు 25వరకు రాష్ట్రంలో 192.8మి.మీ. వర్షపాతం నమోదైందని, ఇదే కాలానికి సాధారణ వర్షపాతం 393.7మి.మీ. కాగా, సాధారణంతో పోలిస్తే 51శాతం లోటు నమోదైందని మంత్రి తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లోనూ పప్పుధాన్యాల సాగులో 23.6శాతం వృద్ధి నమోదు కావడం ప్రభుత్వం చేపట్టిన ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికకు నిదర్శనమని మంత్రి అన్నారు. గత ఏడాది ఆగస్టు 25 నాటికి పప్పుధాన్యాల సాగు 2.16 లక్షల హెక్టార్లు కాగా, ఈ ఏడాది అదే తేదీ నాటికి 2.66 లక్షల హెక్టార్లకు పెరిగిందని తెలిపారు. పంటల వారీగా కంది 1.92 లక్షల హెక్టార్ల నుంచి 2.30 లక్షల హెక్టార్లకు, మినుము / బ్లాక్‌గ్రామ్ 0.17 లక్షల హెక్టార్ల నుంచి 0.30 లక్షల హెక్టార్లకు, పెసలు 0.041 లక్షల హెక్టార్ల నుంచి 0.061 లక్షల హెక్టార్లకు, సోయాబీన్ 0.048 లక్షల హెక్టార్ల నుంచి 0.100 లక్షల హెక్టార్లకు పెరిగినట్లు మంత్రి వివరించారు.



ప్రస్తుతం ప్రధాన పంటల సాగు విస్తీర్ణం వరి 10.37 లక్షల హెక్టార్లు, కంది 2.30 లక్షల హెక్టార్లు, వేరుశనగ 1.37 లక్షల హెక్టార్లు, మొక్కజొన్న 1.00 లక్షల హెక్టార్లు, మినుము 0.30 లక్షల హెక్టార్లు, పెసలు 0.061 లక్షల హెక్టార్లుగా ఉందని తెలిపారు. పత్తి సాగు కూడా గత ఏడాది 25.08.2025 నాటికి 3.96 లక్షల హెక్టార్లు ఉండగా, ఈ ఏడాది 3.97 లక్షల హెక్టార్లకు చేరిందని, స్వల్ప పెరుగుదల నమోదైందని మంత్రి చెప్పారు. సాధారణ సీజన్ లక్ష్యం 5.15 లక్షల హెక్టార్లు అని తెలిపారు. నెల్లూరు, తిరుపతి, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో సాధారణ సాగు విస్తీర్ణంతో పోలిస్తే అధిక స్థాయిలో నమోదైందన్నారు.


**ఫిబ్రవరి నుంచే ఎల్‌నినోపై అప్రమత్తం:** ఎల్‌నినో గురించి కేంద్రం అలర్ట్ చేసినప్పటి నుంచే, అంటే ఫిబ్రవరి 2026 నుంచి, రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ, వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలను పరిగణనలోకి తీసుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై చర్చించిందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ముఖ్యంగా రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం ప్రాంతాల్లో ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించే విధంగా ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక రూపొందించామని చెప్పారు. నీటిని ఎక్కువగా వినియోగించే పంటలకు బదులుగా తక్కువ నీటితో పండే పంటలను ప్రోత్సహించే విధంగా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ఖరీఫ్ 2026కు సంబంధించి జిల్లాల వారీగా కరువు నివారణ ప్రణాళికలు రూపొందించామని మంత్రి చెప్పారు.

**పేరుకే ఉచిత పంటల బీమా.. కానీ రైతులకు చేసింది అంతా మోసం:** "జగన్ హయాంలో ఐదేళ్లలో ఒక్క రబీ సీజన్‌లో కూడా ఒక్క రైతుకు ఒక్క పైసా పంటల బీమా పరిహారం ఇవ్వలేదు. ఖరీఫ్‌లో కూడా ఐదేళ్లలో కేవలం రెండేళ్లు మాత్రమే ప్రీమియం చెల్లించి, మూడు సంవత్సరాలు ప్రభుత్వం తన వాటా ప్రీమియం కూడా చెల్లించలేదు. రైతులకు ఉచిత పంటల బీమా అని ప్రచారం చేసుకోవడం తప్ప, ఆచరణలో రైతులకు బీమా భరోసా కల్పించలేదు. ఇదేనా రైతుల పట్ల మీకున్న చిత్తశుద్ధి జగన్ ?. రైతులపై పంటల బీమా ప్రీమియం చెల్లించాలంటూ తమ ప్రభుత్వం ఎలాంటి ఒత్తిడి తీసుకురావడం లేదు" అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రైతులపై భారం మోపడం తమ ప్రభుత్వ విధానం కాదని, అత్యల్ప ప్రీమియంతో స్వచ్ఛందంగా పంటల బీమాలో చేరేలా రైతులకు విస్తృత అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. జగన్ నీ హయాంలో రైతుల పంటలకు బీమా భరోసా ఏమైంది? అని మంత్రి ప్రశ్నించారు. రైతుల నుంచి ప్రీమియం వసూలు చేయడమే తప్ప, ప్రభుత్వం తన వాటా ప్రీమియాన్ని సక్రమంగా చెల్లించని పరిస్థితి మీ పాలనలో ఎందుకు ఏర్పడిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుపై భారం వేయడం మా విధానం కాదు... రైతుకు భరోసా ఇవ్వడం మా విధానం. రైతుల పంటకు బీమా రక్షణ, రైతు కుటుంబానికి భరోసా కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం

# రేపు సంపూర్ణ చంద్రగ్రహణం

## భారత్ సహా ఆసియా దేశాల్లో కనిపించదు..

## అదే రోజు రక్షాబంధన్ వేడుక



చంద్ర గ్రహణంపై నాసా విడుదల చేసిన ఫోటో


**హైదరాబాద్, ఆగస్టు 26 ప్రభాతవార్త:** ఈ నెల 28వ తేదీన ఆకాశంలో మరో ఖగోళ అద్భుతం ఆవిష్కృతం కానుంది. హైందవ సాంప్రదాయంలో ఎంతో ముఖ్యమైన రక్షా బంధన్, శ్రావణ శుక్రవారం సంపూర్ణ చంద్ర గ్రహణం ఏర్ప డనున్నది. అయితే ఉదయం వేళ చంద్ర గ్రహ ణం ఏర్ప డనుండడంతో భారత్ సహా ఆసియా దేశాల్లో ఇది కనిపించదు. ఉత్తర, దక్షిణ, మధ్య అమెరికాలో పూర్తిగానూ యూరప్, ఆఫ్రికాలో దేశాల్లో పాక్షికంగానూ ఈ గ్రహణం కనువిందు చేయనుంది. ప్రపంచ వ్యాప్తంగా 44 శాతం మంది ప్రజలు ఈ గ్రహణాన్ని వీక్షించే అవకాశం వుందని అంతరిక్ష పరిశోధన శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ ఏడాది రెండవ సంపూర్ణ చంద్ర గ్రహణం శుక్రవారం ఏర్పడనుంది. భారత కాలమానం ప్రకారం ఉదయం ఆరుగంటల 53 నిమిషాలకు గ్రహణం మొదలై మధ్యాహ్నం 12.32 గంటలకు ముగుస్తుంది. పాక్షికంగా కనిపించడం ఉదయం 8.04గం టలకు మొదలవుతుంది. ఉదయం 9.43 గంటలకు పూర్తిగా కనిపిస్తుంది. ఉదయం వేళ అయినందున భారత్ సహా ఆసియా దేశాల్లో ఈ గ్రహణం కనిపించదు. ఈ గ్రహణం ఉత్తర, దక్షిణ, మధ్య అమెరికాలో పూర్తిగా కనిపించనుంది. న్యూయార్క్‌తో పాటు అట్లాంటా, మియామీ, చికాగో, డల్లాస్, హూ స్టన్, లాస్‌ఎంజిల్స్, సీట్టల్ నగరాలలో పూర్తిగా కనిపించనుండడంతో గ్రహణాన్ని అన్ని కోణాల్లో వీక్షించేందుకు శాస్త్రవేత్తలు ఇప్పటికే అక్కడకు చేరుకున్నారు. ఇదే సమయంలో యూరప్‌లోని స్పెయిన్, పోర్చుగల్ సహా ఆఫ్రికా దేశాలలో చంద్ర గ్రహణం పాక్షికంగా కనిపించనుంది. భార త్‌లో చంద్రగ్రహణం కనిపించనందున ఇక్కడ సూతక్ కాలం వుండదని ఆగమన పం డితులు చెబుతున్నారు. ఈ గ్రహణం కుంభ రాశిలో శతబిషా, ధనిష్టా నక్షత్రాల పరిధిలో ఏర్పతుం దని, ఈ నక్షత్రాల వారు ఆలయాల్లో పూజలు చేయించడం మం చిదని పండితులు చెబుతున్నారు. సూతక్ కాలం భారత్‌లో లేనం దున శ్రావణ శుక్రవారం పూజలు చేయవచ్చని, రక్షాబంధన్ పండగ జరుపుకోవచ్చని వారు తెలి పారు. గ్రహణం రోజున మనకు ఎలాంటి భద్రకా లంవుండబోదని పండితులు తెలిపారు. ఈ ఏడాది మార్చి మూడవ తేదీన సంభవించిన సంపూర్ణ చంద్ర గ్రహణం భారత్‌లో ముగింపు సమ యం లో పాక్షికంగా కనిపించడం తెలిసిందే. దీని తరు వాత వచ్చే ఏడాది ఫిబ్రవరి 20వ తేదీన సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడనుండగా ఇది కూడా భారత్‌లో కనిపించబోదు.

## అమెరికాలో రోడ్డు ప్రమాదం.. ముగ్గురు తెలంగాణ యువకుల మృతి

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** అమెరికా లోని ఫ్లోరిడాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తెలంగాణ యువకులు దుర్మరణం చె ందారు. భారత కాలమానం ప్రకారం మంగళ వారం అర్ధరాత్రి దాటిన తరువాత (అమెరికాలో ఉదయం పది గంటల సమయం) ఈ ప్రమాదం జరిగింది. మృతుల్లో ఒకరిని నిజామాబాద్ జిల్లా నవీపేటకు చెందిన రాహుల్ (30)గా గుర్తించగా మిగతా ఇద్దరిని ఇంకా గుర్తించలేదు. వివరా లు ఇలావున్నాయి. ఫ్లోరిడాలోని ట్రెవార్ట్ కౌంటిలో ఇంటర్‌స్టేట్ 95 (ఐ..95) జాతీయ రహదారిపై ముగ్గురు యువకులు తాము పనిచేస్తున్న ప్రాం తం నుంచి కారులో మరోచోటికి వెళుతుండగా పామ్ టీ ప్రాంతంలో 172 మైలురాయి వద్ద వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే గల చెట్టు ను ఢీకొంది. ఈ ఘటనలో కారుకు మంటలు అంటుకోగా అందులో చిక్కుకున్న ముగ్గురిలో ఇద్దరు ఘటనా స్థలంలోనే మరణించగా మూడవ వ్యక్తి ఆసుపత్రిలో చనిపోయాడు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో స్థానికులు బాధితులను ఆసు పత్రికి తరలించేందుకు పోలీసులకు సహాయం అం దించారు. మృతుల్లో ఒకరైన రాహుల్ నిజా మాబాద్ జిల్లా నవీపేట మండలం నారాయణ పూర్ (నాడాపూర్) గ్రామానికి చెందినవాడు. హరిబాబు, నాగమణి దంపతుల కుమారుడైన రాహుల్ మూడు నెలల క్రితమే ఉన్నత చదు వులకోసం అమెరికాకు వెళ్లాడు. బుధవారం తెల్ల వారుజామున తనకు ప్రమాదం గురించి ఫోన్ వచ్చిందని రాహుల్ తండ్రి హరిబాబు మీడి యాకు తెలిపారు. కాగా మిగతా ఇద్దరిని గుర్తిం చేందుకు అమెరికాలోని తెలుగు సాంస్కృతిక సంస్థ తానా సభ్యులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో పాటు ముగ్గురి మృతదేహాలను భారత్‌కు పంపేందుకు వారు దౌత్య అధికారులతో సంప్రదింపులుజరుపుతున్నారు.కాగా ఈఘటన రాష్ట్రం లోని ఆయా ప్రాంతాలలో విషాదం నింపింది.

## మంగళగిరిలో అధునాతన మోడల్ రైతు బజార్

- రూ.18.కోట్లతో 5.90 ఎకరాల్లో నిర్మాణం
- నేడు మంత్రి లోకేష్ చేతుల మీదుగా శంకుస్థాపన



**విజయవాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** పారిశ్రామిక పురోగతికి, మౌలిక వసతుల కల్పనకు ఈ ప్రాంతం కేరాఫ్ అడ్రస్‌గా మంగళగిరి మారుతోంది. ప్రజాదరణతో పాటు పరిపాలనా దక్షత తోడవడంతో మంగళగిరి నియోజకవర్గం సంక్షేమం, అభివృద్ధిలో దూసుకుపోతోంది. ఇప్పటికే మంగళగిరి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళగిరి ప్రజలు, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మంగళగిరి పట్టణంలోని నిడమర్రు రైల్వే గేట్ వద్ద మోడల్ రైతు బజార్ నిర్మాణానికి మంత్రి నారా లోకేష్ శ్రీకారం చుట్టారు. ఆధునిక హంగులతో చేపట్టే రిటైల్ అండ్ హోల్ సేల్ వెజిటబుల్ మార్కెట్ నిర్మాణ పనులకు గురువారం మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేయనున్నారు.

రూ.18 కోట్లతో 5.90 ఎకరాల్లో నిర్మాణం



మంగళగిరిలో ఏర్పాటుచేయనున్న మోడల్ రైతు బజార్‌ను 5.90 ఎకరాల విస్తీర్ణంలో రూ.18 కోట్ల అరబిందో ఫార్మా ట్రస్ట్ సిఎస్ఆర్ నిధులతో నిర్మించనున్నారు. ఆధునిక సౌకర్యాలతో పరిశుభ్రంగా, వినియోగదారులకు అనుకూలంగా, పర్యావరణహితంగా ఉండేలా ఈ రిటైల్, హోల్ సేల్ కూరగాయల మార్కెట్‌ను నిర్మించనున్నారు. మొత్తం నిర్మాణ విస్తీర్ణం 71,925 చదరపు అడుగులుగా ఉండనుంది. రిటైల్ మార్కెట్‌లో కూరగాయల విక్రయాల కోసం 102 స్టాళ్లు, పండ్లు, పూల విక్రయాల కోసం 54 ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటుచేయనున్నారు. ఇతర రకాల వస్తువుల కోసం మొత్తం 60షాపులు ఏర్పాటు చేస్తారు. అదేవిధంగా హోల్‌సేల్ మార్కెట్‌లో అన్ లోడింగ్ ప్లాట్ ఫామ్స్ 18, కూరగాయల షాపులు 23 ఉండనున్నాయి. 61.4 చ.మీల విస్తీర్ణంలో కోల్డ్ స్టోరేజీ, వెజిటబుల్ వాష్ ఏరియాస్, 144.6 చ.మీ విస్తీర్ణంలో అడ్మిన్, మెయింటెనెన్స్ ఏరియాస్, 190 చదరపు మీటర్ల విస్తీర్ణంలో క్యాంటీన్, ప్రజల కోసం 130 చ.మీల విస్తీర్ణంలో మరుగుదొడ్లు నిర్మించనున్నారు. సరుకులు తరలించే వాహనాలు, టూ వీలర్స్, ఫోర్ వీలర్స్ కోసం పార్కింగ్ సౌకర్యం ఏర్పాటుచేయనున్నారు. వాటర్ సంప్, ఓవర్ హెడ్ ట్యాంక్, సెప్టిక్ ట్యాంక్, ట్రాన్స్‌ఫార్మర్, జనరేటర్, గార్బేజ్ కలెక్షన్, ఆర్గానిక్ కన్వర్టర్, టెర్రస్ సోలార్ ఎనర్జీ ప్యానల్స్ వంటి సదుపాయాల కోసం ప్రత్యేక స్థలం కేటాయించారు.



# వరద కల్లోలం

# నేపాల్ అతలాకుతలం



- పొంగిపొర్లిన భోటెకోశి నది
- కొట్టుకుపోయిన పలు గ్రామాలు
- 400 మందికి పైగా మానస సరోవర్ యాత్రికుల గల్లంతు
- 133 మంది భారతీయుల కోసం అన్వేషణ
- ఆకస్మిక వరదల ముందు భూకంపం కూడా
- మృతులు 95మందిపైనే..
- నేపాల్ ప్రధానికి నరేంద్ర మోడీ ఫోన్
- అండగా ఉంటామని భరోసా

**కాఠ్మండు, ఆగస్టు 26:** టిబెట్ సరిహద్దుల్లో ఉన్న నేపాల్‌లోని రాసువా జిల్లాను మెరుపు వరదలు ముంచెత్తాయి. మానస సరోవర్ యాత్ర, గోసైంకుండ యాత్రలకు కీలకంగా రాసువా జిల్లా ఉంది. రాసువా జిల్లా మీదుగానే ఈ యాత్రలకు విదేశీయులు వెళ్తుంటారు. మెరుపు వరదలు వచ్చే ముందు టిమురే, స్యాబ్రుబేసి ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో విదేశీ టూరిస్టులు ఉన్నారు. మానస సరోవర్ యాత్రకు వెళ్తున్న 400 మందికి పైగా యాత్రికులు గల్లంతైనట్లు తెలుస్తోంది. వీరిలో 133 మంది భారతీయులు ఉన్నట్లు తెలుస్తోంది. అధికారులు వెల్లడించిన వివరాలప్రకారం ఇప్పటివరకూ 95 మంది మృతిచెందినట్లు తేలింది. వరద ధాటికి భోటేకోశి నది పరివాహక ప్రాంతాలు, నది ఒడ్డున ఉన్న గ్రామాలు తుడిచి పెట్టుకుపోయాయి. తిమురే బజార్, సరిహద్దు కస్టమ్స్ ప్రాంతం తీవ్రంగా దెబ్బతింది. వాహనాలు, సరకుల రవాణా వాహనాలు వరదల్లో కొట్టుకుపోయాయి. గతేడాది వరదల తర్వాత పునర్నిర్మించిన రసువాగఢి ఫ్రెండ్‌షిప్ బ్రిడ్జ్ కూడా ఈ వరదల్లో తుడిచిపెట్టుకుపోయింది. మూడు నేపాల్ పోలీస్ కార్యాలయాలు దెబ్బతిన్నాయి. టిబెట్ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న తొమ్మిది మంది ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ సిబ్బంది గల్లంతయ్యారు. వరదల కారణంగా 11 జల విద్యుత్ కేంద్రాలు నాశనమయ్యాయి. సుమారు 430 మెగావాట్ల విద్యుత్ సరఫరా ప్రభావితఎనేపాల్‌లో భోటేకోశి నది పెను విధ్వంసాన్ని సృష్టించింది. టిబెట్ సరిహద్దుల్లో ఉన్న నేపాల్ జిల్లాల్లో ఒక్కసారిగా నది ఉప్పొంగటంతో అనేక గ్రామాలు, వంతెనలు కొట్టుకుపోయాయి. మరోవైపు, ఈ నది ప్రవాహం దిగువన ఉన్న భారత్ లోని బీహార్, యూపీల్లోకి వచ్చే ప్రమదం ఉండటంతో ఆయా రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. కోసి, గండర్ నదుల ప్రవాహం పెరిగే అవకాశం ఉంది. నేపాల్ జలప్రళయానికి ముందు భూకంపం సంభవించినట్లు తెలుస్తోంది. జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ ప్రకారం, ఈ ఘటనకు సుమారు ఏడు నిమిషాల ముందు 4.4తీవ్రతతో భూకంపం సంభవించింది. ఫ్లాష్ ఫ్లడ్స్‌కు 7నిమిషాల ముందు భూకంప వచ్చినట్లు తెలుస్తోంది. భూప్రకంపనలతో చైనాలోని టిబెట్ ప్రాంతంలోని హిమాలయాల్లో ఉన్న సుప్రాగ్లేషియల్ సరస్సు బద్ధలవ్వడంతోనే ఒక్కసారిగా లెహెండే ఖోలా నదిలో ఒక్కసారిగా నీటి ఉధృతి పెరిగినట్లు తెలుస్తోంది. ఈ నదికి దిగువనే ఉన్న భోటేకోశి నదిలోకి నీరు పోటెత్తడంతో వరద విరుచుకుపడింది. ఉత్తరగయ గ్రామీణ మునిసిపాలిటీ ఉపాధ్యక్షురాలు చమేలీ గురుంగ్ తెలిపిన వివరాల ప్రకారం.. స్యాఫ్రుబెసి, బెత్రావతి, మైలుంగ్, సల్లెతార్, శాంతిబజార్, పైరేబెసి, ఖాల్తీ బస్తీ, సోలే, త్రిశూలి, బట్టార్ వంటి దాదాపు డజనుకు పైగా గ్రామాలు ఈ హఠాత్ వరద దాటికి గురయ్యాయి. నేపాల్‌లో భోటేకోశి నది పెను విధ్వంసాన్ని సృష్టించింది. ఒక్కసారిగా వచ్చిన మెరుపు వరద నేపాల్‌లోనే గ్రామాలకు గ్రామాలనే కబళించింది. వందలాది మంది గల్లంతయ్యారు. భారత్‌లో కూడా వరద ప్రభావం కనిపించే అవకాశం ఉంది. నేపాల్ ఆర్మీ చీఫ్ వెల్లడించిన సమాచారం ప్రకారం ఈ ఫ్లాష్ ఫ్లడ్స్ వల్ల సుమారు 4,000 మందికి పైగా ప్రజలు తీవ్రంగా ప్రభావితులయ్యారు. పరిస్థితి అత్యంత గంభీరంగా మారడంతో నేపాల్ రెడ్ క్రాస్ తన ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌లను వెంటనే అప్రమత్తం చేసి, సహాయక చర్యల్లోకి దించింది. ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రెడ్ క్రాస్ కూడా పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది. మరోవైపు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, నదీపరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలకు దూరంగావెళ్లి ప్రభుత్వఆదేశాలను పాటించాలని సూచించారు.

### నేపాల్ ప్రధాని బాలెన్ షా అత్యవసర సమావేశం

నేపాల్ ప్రధానమంత్రి బాలేంద్ర షా పరిస్థితిని సమీక్షించేందుకు నేషనల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అథారిటీతో అత్యవసర సమావేశం నిర్వహించారు. వైద్య బృందాలు, స్కౌట్స్, రెడ్ క్రాస్‌తో సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలు ప్రారంభించినట్లు చెప్పారు. నేపాల్ పోలీసులు ప్రజలను నదీ పరివాహక ప్రాంతాల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని హెచ్చరించారు. భోటెకోషి నదిలో టిబెట్ వైపు నుంచి భారీగా వరద నీరు ప్రవేశించడంతో త్రిశూలి నది పరివాహక ప్రాంతంలోని నువాకోట్, ధాదింగ్, చిత్వన్, గోర్ఖా తదితర జిల్లాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

### నేపాల్ ప్రధానికి ప్రధాని మోడీ ఫోన్

నేపాల్ వరద విధ్వంసంపై ఆ దేశ ప్రధాని బాలెన్ షాకు, భారత ప్రధాని నరేంద్రమోడీ ఫోన్ చేశారు. నేపాల్‌లో వరదల కారణంగా జరిగిన ప్రాణనష్టం పట్ల సంతాపం తెలిపారు. నేపాల్‌కు సాధ్యమైనంత మానవతా సహాయం, సహాయక మద్దతు అందిస్తామని మోడీ హామీ ఇచ్చారు. భారత్ ఖాట్మండులో నిరంతరం సంప్రదింపులు జరుపుతోంది.

### యుపి, బీహార్ రాష్ట్రాలకు రెడ్ అలర్ట్...

నేపాల్ వరదలు భారతదేశంలో భయాన్ని పుట్టిస్తున్నాయి. ముఖ్యంగా బీహార్ రాష్ట్రానికి పెను ప్రమాదం పొంచిఉంది. నేపాల్ వరదలకు కారణమైన భోటేకోశి నది టిబెట్‌లో పుట్టి నేపాల్ మీదుగా భారత్‌లోకి ప్రవేశిస్తుంది. బీహార్‌లో దీనిని కోసి నదిగా పిలుస్తారు. కోసి నదిని బీహార్ దుఃఖదాయినిగా పిలుస్తారు. ఈ నది కారణంగా బీహార్ ప్రాంతంలో తరుచుగా వరదలు రావడం, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడటం వల్ల దీనికి ఈ పేరు వచ్చింది. నేపాల్ వరదల నేపథ్యంలో బీహార్, ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. నదీ పరివాహక ప్రాంతాల్లో నీటి మట్టాలు భారీగా పెరిగే అవకాశం ఉండటంతో అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. నేపాల్ నుంచి భారత మైదాన ప్రాంతాల్లోకి ప్రవేశించే నదుల్లో గండక్(నారాయణి), కోసి నదుల ఉన్నాయి. బీహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చైదరి మాట్లాడుతూ పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నట్లు తెలిపారు. సీఎస్, డీజీపీలతో సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. అవసరమైతే ప్రభావిత ప్రాంతాలకు తానే వెళ్తానని చెప్పారు. నదీ ప్రవాహక ప్రాంతాల్లో నివసించే వారు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మరోవైపు ఉత్తరప్రదేశ్‌లోని మహారాజగంజ్, కుషీనగర్ జిల్లాలను అప్రమత్తం చేసినట్లు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. గండక్, నారాయణి నదులకు వరద పెరిగే అవకాశం ఉంది.

నేపాల్‌లో వరదల వల్ల జరిగిన విధ్వంసం ఆందోళనకరంగా ఉందని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అన్నారు. గండక్, నారాయణి నదులలో నీటిమట్టాలు పెరిగే అవకాశం ఉన్నందున, మహారాజ్‌గంజ్, కుషినగర్‌లోని స్థానిక యంత్రాంగాలను అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అధికారులను ముందుగానే అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని యోగి ఆదిత్యనాథ్ కోరారు.

27-8pg4:27-8pg4.qxd 8/26/2026 10:43 PM Page 1




వార్త

మౌనం మనసుకు, శరీరానికి విశ్రాంతినిస్తుంది, విశ్రాంతిని మించిన ఔషధం లేదు.

న- బార్బడోస్

# ప్రాణాలతో చెలగాటమేనా?

విశ్వామిత్ర సృష్టిలో తాము కూడా చేరిపోవాలని నకిలీ డాక్టర్లు ఉవ్విళ్లూరుతున్నారు. కానీ కర్మవశాన వారిలో కొందరు దొరికిపోయారు. హైదరాబాద్ సిటీలో తాజాగా 12 మంది నకిలీ డాక్టర్లు అరెస్టవడం జనం కలవరపడే విషయం. కేవలం నర్సుగానో, కాంపౌండరుగానో ఉన్న పూర్వ అనుభవంతో డాక్టర్‌గా ప్రాక్టీసు మొదలెట్టే ఆర్ఎంపిల గూర్చి తెలుగు రాష్ట్రాలకు బాగా తెలిసిందే. వాళ్లే ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో డాక్టర్లుగా చలామణి అయిపోతున్నారు. అసలు సిసలు డాక్టరు కోర్సులు కోట్లాది రూపాయలు పెట్టి చదివినవారెవరూ గ్రామీణ ప్రాంతాలకు ప్రాక్టీసు చేయరు. బహు అరుదు. గ్రామీణ ప్రాంతాల్లో తీసుకోదగిన ఫీజులూ తక్కువే. ఆధునిక వైద్య పరిజ్ఞానంతో రూపొందించబడిన వైద్య చికిత్సా పద్ధతులు, పెద్దపెద్ద ఖరీదైన విదేశీ ఎం.ఎఆర్.ఐ డయాగ్నస్టిక్ విధాన పరికరాలను తెచ్చి పెట్టుకోవాలని ఏ డాక్టరూ సాహసించరు. అందుకే ఏ వృక్షమూ ఎదగని చోట ఆముద వృక్షమే మహావృక్షమన్న చందాన గ్రామీణ ప్రాంతాల అత్యవసర వైద్యానికి అందుబాటులో ఉండేది ఆర్ఎంపి డాక్టర్లే అన్న నిజం అందరికీ తెలిసిందే. అయితే వారు చేసిన వైద్యం వికటించిన సందర్భాలు లేకపోలేదు. కొన్నిసార్లు అనవసర వైద్య చికిత్సల్లో చేయిపెట్టి తర్వాత క్రిమినల్ కేసులు, ఇతరత్రా సంబంధిత చిక్కుల్లో ఇరుక్కుపోవడం చూస్తూనే ఉన్నాం. రానురాను ఈ కాంపౌండర్ డాక్టర్ల ధోరణిలో పట్టు తప్పిపోవడం గమనిస్తేనే ఉన్నాం. హైదరాబాద్ నగరంలో ఎంతో విచిత్రంగా 'అర్హతలేని నకిలీ డాక్టర్ల' వ్యవస్థ ఒకటి చాన్నాళ్లుగా వేళ్లూనుకుపోయి ఉంది. తాజాగా కొంతమంది నకిలీ డాక్టర్లను సిటీ పోలీసులు పట్టుకుని వారి గుట్టువిప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో కాంపౌండరుగా ఉన్న అనుభవంతో ఆడపాదడపా అత్యవసర చికిత్సకు అందుబాటులోకి రావడమనే యోచనకు భిన్నంగా కొంత మంది అసలుసిసలు ఎంబిబిఎస్ డాక్టర్ల వలె నకిలీ డిగ్రీలతో క్లినిక్‌లు నడపడం ఒక ఎత్తయితే, సిటీలో తెల్లకోటు వేషాలతో నిరంతరం పేషంట్‌ల సేవలో తరిస్తున్న వారూ లేకపోలేదు. అన్నీ మంచిగా జరిగినంత సేపు అంతాబాగే, చేసే చికిత్స బెడిసికొట్టిందంటే వారు చేస్తున్న ప్రాక్టీసును స్వాగతించేవారు ఉండరు. హైదరాబాద్ సిటీలో ఈ వారంలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ దాడుల్లో 12 మంది నకిలీలను పట్టుకున్నారు. పేషంట్లను నమ్మించి వైద్యసేవలు అందించడమే వారి సేవాదృక్పథం. కొందరైతే భారీ ఎత్తున క్లినిక్‌లు నిర్వహిస్తున్నట్లు వారే రోగులకు సెలైన్‌లు ఎక్కించడం, ఇంజెక్షన్లు, మందులు ఇస్తూ అసలు సిసలు డాక్టర్ల వలె రోగులతో కలిసిపోవడం వల్లనే వాళ్లు 'నకిలీ'లనే డాక్టర్లెవరూ అనుమానించే పరిస్థితి రావడం లేదనీ తెలుస్తోంది. పోలీసు రికార్డులు పరిశీలిస్తే 'నకిలీ వైద్యుల నిజస్వరూపం బట్టబయలవుతుంది. 2019లో హైదరాబాద్‌కు వచ్చి అంబర్‌పేటలో క్లినిక్ ప్రారంభించిన రాజుగంగారాం అనే వ్యక్తి 2024లో పట్టు బడ్డాడు. యోగా, నేచురోపతి, ఎమెర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ 'డిప్లొమో కోర్సులు చేసినట్లుగా కొన్ని సర్టిఫికెట్‌లున్నప్పటికీ చట్టబద్ధమైన వైద్య డిగ్రీ లేదు. ఈవ్యక్తి ఇలాంటి కేసుల్లో ఇంతకు ముందే రెండుసార్లు అరెస్టయినా, పదే పదే ఆ వృత్తినే చేస్తున్నాడు. ఇలా ఎందుకు జరుగుతోంది అని ఆలోచిస్తే పోలీసుల నిరంతర తనిఖీ లేకపోవడమే. సర్వహంగులూ ఉన్న క్లినిక్‌లలో తమ మేధస్సు అనుభవంతో వైద్యసేవలు అందిస్తున్న మకిలి వ్యవస్థ మరొకటి ఈ వైద్య వ్యవస్థలో ఒకటిగా మనగలుగుతోంది. గచ్చిబౌలిలోని హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్, ప్లాస్టిక్ కేంద్రంలో రిసెప్షనిస్ట్‌గా పనిచేసిన అస్లాం షఫీ సయ్యద్ విషయం మరో భయంకర సత్యాన్ని బయటపెడుతుంది. తనే ఓ ప్రసిద్ధి చెందిన 'స్కిన్ డాక్టర్'గా ప్రకటించుకుని ఇంటి వద్దనే 'లైపోమా' చికిత్స మొదలెట్టేసాడు. ఇది మరీ ప్రమాదకరం. రోగికి చికిత్స అందివ్వగల ఏ వైద్య అర్హత అతనికి లేదు. పది మంది తిరిగేచోట వారిని నమ్మిస్తున్న 'క్లినిక్'ను నడుపుతూ ఎవరికీ ఏ అనుమానం రాకుండా జాగ్రత్త పడుతున్నారంటే తప్పు అతనిది కాదు. నిరంతర నిఘా వ్యవస్థ నిర్లక్ష్యానికి ఇదొక నిదర్శనం. తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్‌న రికార్డులు పరిశీలిస్తే మరికొన్ని 'క్వాక్' క్లినిక్‌ల బండారం బయటపడ్తోంది. 2025 మే 21న రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో 'క్వాక్' క్లినిక్‌ల మీద దాడి చేసి లైసెన్స్ లేకుం డా విక్రయిస్తున్న మందుల నిల్వలను కూడా పట్టు కున్నారు. అంతకన్నాముందు 2024జనవరి నుంచి 'క్వాక్' క్లినిక్‌లను పట్టుకుని కేసులు నమోదు చేశారు. అయినా ఈ తరహా 'క్లినిక్'ల నిర్వహణ యాజమాన్యం ఏమాత్రం తగ్గలేదు. ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న అంశాల విషయంలో కూడా ప్రభుత్వ నిఘా, తనిఖీ చర్యల్లో డొల్లతనం చెప్పుకోవాల్సిందే. ఒక నకిలీ డాక్టర్ తనకున్న అనుభవం చాలక వైద్యచికిత్సల్లో చేయిపెడితే మనిషి చూపుపోవచ్చు. అవయవాలు నిరుపయోగం కావచ్చు. పనిచేయకపోవచ్చు. ఏమాత్రం వ్యవస్థ పట్ల భయం లేకుండా రోగి వైద్యంలో ఏదైనా తేడా జరిగి పట్టుబడితే శంకరగిరి మాన్యాలు తప్ప వని గానీ, శ్రీకృష్ణ జన్మస్థానా న్ని చూడాల్సి వస్తుందని తప్పవని ఎందుకు భయం వేయదో అర్థంకాదు. వారికి చట్టం అంటే భయం లేదని అనుకోవాలా? తమనెవరూ పట్టుకోలేరని భ్రమలో ఉంటారా? అందుకే ఇలాంటి క్లినిక్‌లపై నిరంతర నిఘా ఉంచటం అవసరం. ఈ నకిలీ డాక్టర్లు తమకున్న చిన్న పాటి అనుభవంతో క్లినిక్‌లు తెరవడమే కాకుండా తాము చేసే చిన్నాచితక వైద్యంలో పరిస్థితులు చేయిదాటిపోతే ఆయా పేషంట్లను ఏదో చెప్పి కార్పొరేట్ ఆసుపత్రులకు పంపేస్తున్నారు. ఆ మాత్రపు ఆర్థిక స్తోమత లేకనో, దగ్గర్లో ఉన్న ఆర్ఎంపిలనో 'క్వాక్' క్లినిక్‌లనో ఆశ్రయించే సాధారణ రోగులకు ప్రాణం మీదకు వస్తే కార్పొరేట్ ఆసుపత్రులు కూడా తమకున్న పరిధిలో కాపాడలేకపోవచ్చు. మరి వారి ప్రాణాలు గాలిలో


స్పష్టత లేకుండా దారితప్పి మాట్లాడటం కంటే మౌనం పాటించడం ఉత్తమం.

రమణమహర్షి


ఈ లోకానికి కొత్తవాళ్లంగా వస్తాం, అతిథుల్లా ఉంటాం, స్నేహితుల్లా వెళ్లిపోతాం.

రవీంద్రనాథ్ ఠాగూర్

## ప్రజావాక్కు

### ఆరోగ్యమే మహా భాగ్యం

"అత్యాశతో సంపాదనే జీవితమని భావించిన కొందరు హైరానా పడి సర్వ రోగాలతో సతమౌతుంటారు. కాని అక్రమ సంపాదనకు ఎగబడటం మానరు. ఒక్కొక్కరి మానసిక స్థితి ఒక్కొక్కలా ఉంటుంది. ఆరోగ్యముంటేనే జీవితానికి అందం.అందుకే ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు పెద్దలు. ఆరోగ్యం లేని సంపదలెన్నున్నా నిరుపయోగమే."అజీర్ణే భోజనం విషం' ఆరోగ్యంగా ఉండాలంటే సమతుల్య ఆహారం తీసుకోవాలి,క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి, తగినంతనీరు త్రాగాలి, ప్రశాంతమైన నిద్రను పొందాలి. ఇవి శరీరానికి శక్తినిచ్చి, రోగాల నుండి కాపాడతాయి.ఆరోగ్యకరమైన అలవాట్లను పాటిస్తూ సమతుల ఆహారంలో భాగంగా తాజా కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు తృణధాన్యాలు తీసుకొని జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి. రోజుకు తగినన్ని నీళ్ల త్రాగడం ద్వారా శరీరం హైడ్రేటిక్‌గా ఉంచుకోవచ్చు. ప్రతిదినం నడక లేక ఇష్టమైన పనులతో శారీరక శ్రమ,వ్యాయామం అవసరం. 7నుంచి 8గంటల గాఢమైననిద్ర ఉండేలా చూసుకోవాలి. ధ్యానంతో మనసును ఏకాగ్రతలోకి తెచ్చుకోవచ్చు.

- డా.దన్నాన అప్పలనాయుడు, విజయనగరం

### పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పర్యావరణ పరిరక్షణ ప్రజల సమిష్టి బాధ్యతని ప్రజలు, పౌరులు కలిసిఆకుపచ్చ గ్రామాలుగాపట్టణాలలో మొక్కలు నాటడం, ఇంటింటికి తిరిగి బట్టల సంచులు పంపిణీ చేయడం వంటి పనులు చేయాలి.దీంతో భావితరాలకు మంచి వాతావరణం అందించటంతోపాటు ప్రస్తుత వాతావరణం కాలుష్యం నివారణతో పాటు,వర్షాలు పడి పాడి పంటలతో సమాజాభివృద్ధికి తోడ్పడుతుంది.ప్రతి మనిషి సుమారు 7నుంచి 8మొక్కలునాటితే వారికి జీవితాంతం సరిపోయే ప్రాణవాయువు లభిస్తుంది.

- సింగు లక్ష్మీనారాయణ, కరీంనగర్

### గ్రామ సభలు నిర్వహించాలి

గ్రామంలోని సమస్యల దృష్ట్యా ప్రతి గ్రామంలో రెండు నెలలకొకసారి గ్రామ సభ ఏర్పాటు చేయాలి. ఏదేని కారణాల దృశ్య వాయిదాపడినా తిరిగి వారంలోగా నిర్వహించాలి. గ్రామసమస్యలను ప్రజలతో చర్చించి సమస్యలను అధిగమించే విధంగా కృషి చేయాలి. ఎవరైనా గ్రామ పంచా యతీ కార్యదర్శి గారు ప్రజల మౌనాన్ని ఆసరాగా చేసుకోవద్దు. ఎక్కడైనా జరిగితే ఫిర్యాదు చేయండి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### నైపుణ్య విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో యువత, విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధికి ప్రాధాన్యం ఇవ్వడం సమయోచితమైనదే. కృత్రిమ మేధ, ఆటోమేషన్ వేగంగా విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగాల స్వరూపం కూడా వేగంగా మారుతోంది. ఈమార్పులకు అనుగుణంగా యువతను తీర్చిదిద్దడం ఇప్పుడు విద్యా వ్యవస్థ ముందున్న ప్రధాన బాధ్యత. సాంకేతికత అభివృద్ధి చెందుతున్న వేగానికి, కార్మికుల నైపుణ్యాలు కూడా సమానంగా అభివృద్ధి చెందేలా చర్యలు అవసరం. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు నవీకరించాలి. విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలు, శిక్షణ సంస్థలు కలిసి కోర్సుల రూపకల్పనలో భాగస్వాములుకావాలి.పుస్తక పరిజ్ఞానంతోపాటు ప్రాయోగిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్ సామర్థ్యం,సమస్య పరిష్కార నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం యువతకు అందాలి. అప్రెంటిస్‌షిప్‌లు,ఉద్యోగ ప్రదేశంలో శిక్షణకు మరింత ప్రాధాన్యం ఇవ్వడంతో ఉపాధికి మారేదశను సులభతరమవుతుంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### భక్తి,భుక్తి

ప్రసాదం చేతిలోపడగానే మహాప్రసాదం స్వామి అంటూ కళ్లకద్దుకుని నోట్లో వేసుకోవడం ఆనవాయితీ. మనదగ్గర ఉన్నన్నిదేవాలయాలు ఇతర దేశాలలో లేవంటే అతివయోక్తి కాదు. నిత్యం భక్తిపారవశ్యంలో మునిగి తేలుతున్న వారు కోకొల్లలు. దేవునిసన్నిధిలో సంప్రదాయానికి పెద్దపీట.రద్దీకి మారు పేరుగా ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిరుమల నిత్యాన్నదానం భక్తులకు వరప్రసాదం అంటే సందేహం లేదు. ఇప్పటికీ శుచి, రుచికి మరోపేరుగా తిరుపతి లడ్డు కొనసాగుతుండడం ఆ వెంకటేశ్వరస్వామి మహిమగా చెప్పుకుంటారు. స్వామివారి దర్శనం తోపాటులడ్డుకోసమై తోపులాట జరిగినసందర్భాలనేకం.

- ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

### నిధులను విడుదల చేయాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫీజ్ రీయంబర్స్‌మెంట్ బకాయి నిధులను సకాలంలో విడుదల చేయక పోవడం వల్ల ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం ఫీజ్‌లు చెల్లించాలని విద్యార్థులపై వత్తిడి చెయడం వల్ల ఫీజ్‌లు చెల్లించే ఆర్థిక స్తోమత లేని విద్యార్థులు మధ్యలోనే చదువు మానేసే ప్రమాదం ఉంది. రాష్ట్ర ముఖ్యమంత్రి మీనమేషాలు లెక్కించకుండా ఫీజ్ బకాయి నిధులను విడుదల చేసి నిరుపేదలు ఉన్నత విద్య నభ్యసించేలా సహకరించాలి.

- బి. కృష్ణ, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# అభివృద్ధి పరుగులో భద్రతకు బ్రేక్!

*20 నుంచి 30ఏళ్లకు పైబడిన పాత భవనాలు, నాలాలు చెరువుల సమీపంలోని నిర్మాణాలు, వరద ప్రభావిత ప్రాంతాల్లోని భవనాలు, అనుమతికి మించి అంతస్తులు నిర్మించిన భవనాలు, చిన్న ప్లాట్లపై భారీ నిర్మాణాలు, హాస్టళ్లు, పాఠశాలలు, ఆస్పత్రులు, అపార్ట్‌మెంట్లు, లోతైన సెల్లార్ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాలు ప్రత్యేక భద్రతా ఆడిట్‌కు లోబడి ఉండాలి. ప్రతి భవనానికి నిర్దిష్ట కాలవ్యవధిలో స్ట్రక్చరల్ సేఫ్టీ ఆడిట్ తప్పనిసరి చేయాలి. ఫైర్ సేఫ్టీ తనిఖీలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా వాస్తవ పరిస్థితులను పరిశీలించేలా ఉండాలి. హైదరాబాద్ ప్రపంచస్థాయి నగరంగా ఎదగాలి, భారీ పెట్టుబడులు రావాలి, ఆకాశహర్మ్యాలు నిర్మించాలి, కొత్త టౌన్‌షిప్‌లు రావాలి. కానీ ఈ అభివృద్ధికి పునాది ప్రజల ప్రాణ భద్రత కావాలి. భవనం ఎంత ఎత్తుగా ఉందన్నది గొప్ప విషయం కాదు. అది ఎంత సురక్షితంగా ఉందన్నదే గొప్ప విషయం. అభివృద్ధి పరుగులో భద్రత వెనుకబడకూడదు. ఇకనైనా గుణపాఠాలు నేర్చుకుని ప్రమాదం తర్వాత చర్యల నుంచి ప్రమాదం రాకముందే నివారణ వైపు హైదరాబాద్ అడుగులు వేయాలి. అదే నిజమైన మహానగర అభివృద్ధి.*

శెట్టే అంజయ్య

హైదరాబాద్ దేశంలోనే అత్యంత వేగంగా విస్తరిస్తున్న మహానగరాల్లో ఒకటి. ఐటీ రంగం, రియల్ ఎస్టేట్, పరిశ్రమలు, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు నగరాన్ని నిరంతరం విస్తరింపజేస్తున్నాయి. జనాభా పెరుగుతోంది. కొత్త కాలనీలు పుట్టుకొస్తున్నాయి. అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, హైరైజ్ భవనాలు వరుసగా వెలుస్తున్నాయి. కానీ ఈ అభివృద్ధి వేగానికి తగినంతగా భవనభద్రతా వ్యవస్థలు కూడా బలోపేతం అవుతున్నాయా? అన్న ప్రశ్న మాత్రం ఇప్పుడు అత్యంత ఆందోళన కలిగిస్తోంది. గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో ఆగస్టు 22న నిర్మాణంలో ఉన్న ఏడంతస్తుల భవనం కూలి ఇద్దరు కార్మికులు ప్రాణాలు కోల్పోవడం కేవలం ఒక నిర్మాణ ప్రమాదంగా చూడలేం. ఇది హైదరాబాద్ నగర నిర్మాణ వ్యవస్థకు ఒక హెచ్చరిక. ఒక భవనం కూలింది. ఇద్దరు ప్రాణాలు పోయాయి. కానీ ఆ భవనం ఎలా నిర్మించబడింది? ఎన్ని అంతస్తులకు అనుమతిఉంది? వాస్తవంగా ఎన్ని అంతస్తులు నిర్మించారు? నిర్మాణ దశలోనే ఉల్లంఘనలు ఎందుకు గుర్తించబడలేదు? నాలాకు ఆనుకుని నిర్మాణం ఎలా సాగింది? వంటి ప్రశ్నలకు సమాధానాలు దొరకాల్సి ఉంది. అధికారుల వివరాల ప్రకారం సుమారు 50 చదరపు గజాల స్థలంలో రెండు అంతస్తులకు మాత్రమే అనుమతి తీసుకుని ఏడంతస్తుల నిర్మాణం చేపట్టినట్లు తెలుస్తోంది. రెండు అంతస్తుల నిర్మాణానికి సరిపోయే పునాది, పిల్లర్లపై అదనపు అంతస్తులు నిర్మించడం అంటే భవనం నిర్మాణ సామర్థ్యాన్నే ప్రమాదంలోకి నెట్టడం. అంతే కాదు నాలాలు, డ్రైనేజీ మార్గాలు, వరద ప్రవాహప్రాంతాల సమీపంలో నిర్మాణాలు చేపట్టడం భవిష్యత్తులో మరింత తీవ్రమైన ప్రమాదాలకు దారితీయవచ్చు. ఇక్కడ అసలు సమస్య ఒక బిల్డర్ తప్పిదంతో ముగిసిపోదు. అనుమతి ఇచ్చే వ్యవస్థ నుంచి నిర్మాణాన్ని పర్యవేక్షించే వ్యవస్థ వరకు మొత్తం గొలుసును పరిశీలించాల్సిన అవసరం ఉంది. హైద రాబాద్‌లో భవన నిర్మాణాలకు నిబంధనలు లేవని ఎవరూ చెప్పలేరు. భవనం ఎత్తు, స్థలం విస్తీర్ణం, భవన వినియో గం, నిర్మాణ రకం, రహదారి వెడల్పు, సెట్‌బ్యాక్‌లు, ఫైర్ సేఫ్టీ, స్ట్రక్చరల్ స్టెబిలిటీ వంటి అంశాలపై అనేక నిబంధన లున్నాయి. అవసరమైన చోట సాయిల్ టెస్ట్, స్ట్రక్చరల్ డిజైన్, ఫైర్ సేఫ్టీ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు వంటి ప్రక్రియలు కూడా ఉన్నాయి. అయితే సమస్య నిబంధనలు లేకపోవడంలో కాదు. నిబంధనలు అమలు అవుతున్నాయా? అన్నదే అసలు ప్రశ్న. ఒక భవనానికి రెండు అంతస్తులకు అనుమతి ఇచ్చి, నిర్మాణం ఏడంతస్తులకు చేరుకునే వరకు సంబంధిత అధికారులు గుర్తించకపోతే అది కేవలం యజమాని లేదా బిల్డర్ వైఫల్యమేనా? నిర్మాణ దశలో తనిఖీలు జరగలేదా? జరిగితే ఉల్లంఘనలు ఎందుకు ఆపలేకపోయారు? నోటీసులు ఇచ్చి ఉంటే వాటితర్వాత కూడా నిర్మాణం ఎలా కొనసాగింది? ఈ ప్రశ్నలకు సమాధానాలు ప్రజలకు తెలియాలి.అంజయ్యనగర్ ఘటన తర్వాత పక్కనే ఉన్న భవనాల భద్రతపై అధికారులు దృష్టి సారించడం స్వాగతించాల్సిన పరిణామమే. ప్రమాదకరంగా ఉన్న మరో భవనాన్ని కూల్చేందుకు చర్యలు చేపట్టడం కూడా అవసరమే. కానీ ఒక ప్రశ్న మాత్రం వెంటాడుతోంది. భవనం కూలిన తర్వాత చుట్టుపక్కల భవనాలను పరిశీలించడంకంటే,ముందుగానే ప్రమాదకర భవనాలనుగుర్తించే వ్యవస్థ ఉండాలి. ఒక నగర పాలక సంస్థ బాధ్యత కేవలం అనుమతులు ఇవ్వడం, పన్నులు వసూలు చేయడం, రోడ్లు వేయడం మాత్రమే కాదు. నగరంలో నివసించే ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించడం కూడా అంతే ముఖ్యమైన బాధ్య



త. హైదరాబాద్ జనాభా గతదశాబ్దంలో గణనీయంగా పెరిగింది. నగర పరిధిలో లక్షలాది అపార్ట్‌మెంట్ యూనిట్లు ఉన్నాయి. ఇంకా భారీ సంఖ్యలో కొత్త యూనిట్లు నిర్మాణంలో ఉన్నాయి. హైరైజ్ భవనాల సంఖ్య కూడా నిరంతరం పెరుగుతోంది. ఇది నగర ఆర్థిక అభివృద్ధికి సంకేతం కావచ్చు. కానీ భవనాల సంఖ్య పెరిగే కొద్దీ వాటి భద్రతా తనిఖీల సంఖ్య, నాణ్యత, సాంకేతిక సామర్థ్యం కూడా అదే స్థాయిలో పెరగాలి. ఒక ప్రాంతంలో వందలాది భవనాలు ఉన్నప్పుడు అక్కడి రహదారుల వెడల్పు సరిపోతుందా? అగ్నిమాపక వాహనాలు చేరుకోగలవా? నీటి సరఫరా సరిపోతుందా? డ్రైనేజీ వ్యవస్థపై ఒత్తిడి ఎంత? పార్కింగ్ పరిస్థితి ఏంటి? భవనం అత్యవసర పరిస్థితుల్లో ఖాళీ చేయించేందుకు మార్గాలున్నాయా? వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాలి. నగర అభివృద్ధిని కేవలం చదరపు అడుగుల నిర్మాణంతో కొలవడం ప్రమాదకరం.2025లోజిహెచ్ఎంసి నిర్వహించిన సర్వేలో 428 శిథిలావస్థలో ఉన్న భవనాలు గుర్తించబడటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. వాటిలో 297 భవనాలను ప్రమాదకరంగా గుర్తించి ఖాళీ చేయించే చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. 2026 నాటికి ఆ భవనాల్లో ఎన్ని కూల్చివేశారు? ఎన్ని మరమ్మతుచేశారు? ఇంకా ఎన్ని ప్రమాదకరంగానే ఉన్నాయి? ఈ వివరాలను ప్రజల ముందుంచాలి. ఒకసారి సర్వే చేసి జాబితాతయారు చేయడం సరిపోదు. ప్రతి ప్రమాదకర భవనానికి ప్రత్యేక ట్రాకింగ్ వ్యవస్థ ఉండాలి. హైదరాబాద్‌లో ప్రతి భవనానికి ఒక డిజిటల్ భద్రతా రికార్డు ఏర్పాటు చేయాల్సినసమయం వచ్చింది. ఆ రికార్డులో భవనం వయసు, అనుమతించిన అంతస్తులు, వాస్తవంగా ఉన్న అంతస్తులు, నిర్మాణ స్థిరత్వ ధ్రువీకరణ, ఫైర్ సేఫ్టీ అనుమతి, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్, నిర్మాణ స్థలానికి సమీపంలోని నాలా లేదా వరద ప్రాంత వివరాలు, గతంలో ఇచ్చిన నోటీసులు, తనిఖీల వివరాలు ఉండాలి. ప్రతి భవనానికి పచ్చ, పసుపు, ఎరుపు అనే మూడు స్థాయిల భద్రతా రేటింగ్ ఇవ్వవచ్చు. పచ్చ కేటగిరీలో ఉన్న భవనాలకు భద్రతా ధ్రువీకరణ ఇవ్వాలి. పసుపు కేటగిరీలో ఉన్న భవనాలకు నిర్దిష్ట గడువు ఇచ్చి లోపాలు సరిచేయించాలి. ఎరుపు కేటగిరీలో ఉన్న భవనాలను తక్షణం ఖాళీ చేయించి, అవసరమైతే కూల్చివేయాలి. భవనం కూలిన ప్రతిసారీ యజమాని లేదా బిల్డర్‌ను అరెస్టు చేయడం ద్వారా సమస్య పరిష్కారం కాదు.తప్పు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పనిసరి. కానీ అదే సమయంలో వ్యవస్థలో ఎక్కడ వైఫల్యం జరిగిందో కూడా గుర్తించాలి. అనుమతి ఎవరు ఇచ్చారు? నిర్మాణాన్ని ఎవరు పర్యవేక్షించారు? ఉల్లంఘనలు జరిగినప్పుడు ఎవరు గుర్తించారు? గుర్తించిన తర్వాత ఏ చర్యలు తీసుకున్నారు? స్ట్రక్చరల్ ఇంజినీర్ ఇచ్చిన ధ్రువీకరణను ఎలా పరిశీలించారు? స్థానిక స్థాయిలో అధికారుల తనిఖీలు ఎంతవరకు జరిగాయి? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాలి. బాధ్యతను ఒకరి మీదకు నెట్టేసి వ్యవస్థను కాపాడుకోవడం వల్ల భవిష్యత్తులో ప్రమా దాలు ఆగవు. హైదరాబాద్‌కు ఇప్పుడు కావాల్సింది ప్రమాదం తర్వాత స్పందించే పాలన కాదు. ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి నివారించే పాలన. 20నుంచి 30ఏళ్లకు పైబడిన పాత భవనాలు, నాలాలు చెరువుల సమీపంలోని నిర్మాణా లు, వరద ప్రభావిత ప్రాంతాల్లోని భవనాలు, అనుమతికి మించి అంతస్తులు నిర్మించిన భవనాలు, చిన్న ప్లాట్లపై భారీ నిర్మాణాలు, హాస్టళ్లు, పాఠశాలలు,ఆస్పత్రులు, అపార్ట్‌మెంట్లు, లోతైన సెల్లార్ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాలు ప్రత్యేక భద్రతా ఆడిట్‌కు లోబడి ఉండాలి.ప్రతి భవనానికి నిర్దిష్ట కాల వ్యవధిలో స్ట్రక్చరల్ సేఫ్టీ ఆడిట్ తప్పనిసరి చేయాలి. ఫైర్ సేఫ్టీ తనిఖీలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా వాస్తవ పరిస్థితులను పరిశీలించేలా ఉండాలి.హైదరాబాద్ ప్రపంచస్థాయి నగరంగా ఎదగాలి. భారీ పెట్టుబడులు రావాలి. ఆకాశహర్మ్యాలు నిర్మించాలి. కొత్త టౌన్‌షిప్‌లు రావాలి. కానీ ఈ అభివృద్ధికి పునాది ప్రజల ప్రాణ భద్రత కావాలి. భవనం ఎంత ఎత్తుగా ఉందన్నది గొప్ప విషయం కాదు. అది ఎంత సురక్షితంగా ఉందన్నదే గొప్ప విషయం.

అభివృద్ధి పరుగులో భద్రత వెనుకబడకూడదు. ఇకనైనా

# బిసిల లెక్కింపులో ఇంకా వివక్ష తగునా?


కాలగిరి శ్రీనివాస్ రెడ్డి

భారత రాజ్యాంగం సామాజిక న్యాయాన్ని దేశ పాలనా వ్యవస్థకు మూల సూత్రంగా ప్రకటించింది. కానీ ఆ సామాజిక న్యాయానికి ప్రాణాధారమైన గణాంకాలవిషయంలోనే దేశం ఇప్పటికీ చారిత్రక లోటుతో ముందుకు సాగుతోంది. దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న ఇతర వెనుకబడిన తరగతుల (బిసి/ఒబిసి) సంఖ్య ఎంత అన్న ప్రశ్నకు స్వతంత్ర భారతదేశం ఇప్పటికీ ఖచ్చితమైన సమాధానం చెప్పలేని పరిస్థితి దురదృష్టకరం. 1931 తర్వాత తొలిసారిగా 2027 జనగణనలో కుల గణన చేపడుతున్నామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం స్వాగతించదగ్గ పరిణామమే అయినప్పటికీ, అదే జనగణన ప్రశ్నావళిలో ఎస్సీ,ఎస్టీలకు ప్రత్యేక కోడ్‌లు కేటాయించి, బీసీలకు మాత్రం ప్రత్యేక కాలమ్ ఇవ్వకుండా 'ఓపెన్ కాలమ్'కే పరిమితం చేయడం తీవ్రమైన ఆందోళనలకు తావిస్తోంది. ఇది కేవలంసాంకేతిక లోపమా? లేక సామాజిక న్యాయాన్ని మరోసారి అసంపూర్ణంగా మార్చే పరిపాలనా వైఫల్యమా?అనే ప్రశ్నలు సహజంగానే తలెత్తుతున్నాయి. దేశవ్యాప్తంగా బిసి సంఘాలు, సామాజిక విశ్లేషకులు వ్యక్తం చేస్తున్న నిరసనల వెనుక ఉన్న ఆవేదన కూడా ఇదే. దేశంలో సంపూర్ణ కులగణన చివరిసారిగా జరిగింది 1931లోనే. ఆ తర్వాత వచ్చిన ఏ ప్రభుత్వమూ దేశవ్యాప్తంగా బీసీల సంఖ్యను శాస్త్రీయంగా లెక్కించలేదు. ప్రతి సందర్భంలోనూ అంచనాలపైనే పాలన సాగుతోంది. మండల్ కమిషన్ (1980) జనాభా గణన 1931 డేటాను మూలంగా చేసుకుని ఒబిసిల జనాభా దాదాపు 52శాతం ఉంటుందని అంచనా వేసింది.దీని ఆధారంగానే 27శాతం రిజర్వేషన్లు అమల్లోకి వచ్చాయి. ఎన్ఎస్ఎస్ఓ వివిధ సర్వేలు బీసీ జనాభా 36శాతంనుంచి 46శాతం మధ్య ఉంటుందని పేర్కొన్నాయి. బీహార్ ప్రభుత్వం 2023లో నిర్వహించిన కులసర్వే మాత్రం దేశానికి కొత్త వాస్తవాన్ని చూపించింది. అక్కడ ఒబిసి + ఇబిసి కలిపి 63.13శాతం (ఇబిసి 36.01శాతం,ఒబిసి 27.12 శాతం) ఉన్నారని, ఎస్సీలు 19.65శాతం, ఎస్టీలు 1.68 శాతం, జనరల్ వర్గాలు 15.52శాతం ఉన్నారని తేలింది. తెలంగాణలో నిర్వహించిన సమగ్ర కులగణనలో బిసిల జనాభా దాదాపు 56.33శాతంగా నమోదైంది. కేంద్ర ఒబిసి జాబితాలోనే దాదాపు 2,650 కులాలు ఉండగా, రాష్ట్రాల జాబితాల్లో మరింత ఎక్కువ సంఖ్యలో కులాలు ఉన్నాయి. ఈ గణాంకాలన్నీ అంచనాలు వాస్తవాలకు ప్రత్యామ్నాయం కావని, శాస్త్రీయ గణనద్వారానే నిజమైన సామాజిక నిర్మాణం బయటపడుతుందని స్పష్టం చేస్తున్నాయి. 2026లో మొదటి దశగా గృహ వివరాల సేకరణ, 2026 సెప్టెంబర్ నుంచి 2027 ఫిబ్రవరి వరకు రెండో దశ జనాభా లెక్కింపు నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ప్రశ్నావళిలోని 10వ ప్రశ్న (ఎస్సీ,ఎస్టీ కులాల)లో ఎస్సీ,ఎస్టీలకు డ్రాప్‌డౌన్ ఆప్షన్ ఇచ్చి, మిగిలిన వారందరికీ కులం పేరును స్వేచ్ఛగా నమోదు చేసే అవకాశం కల్పించింది. నమోదు చేసిన కులాల పేర్లను అత్యాధునిక డిజిటల్ టూల్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో రాష్ట్రాల ఒబిసి జాబితాలతో మ్యాపింగ్ చేసి,బిసిల సంఖ్యను గుర్తిస్తామని ప్రభుత్వం చెబుతోంది. కానీ 2011 సామాజిక,ఆర్థిక కులగణనలో దాదాపు 46లక్షల కులాలు, ఉపకులాలు, ఇంటిపేర్లు నమోదై తీవ్ర గందరగోళం ఏర్పడటంతో ఆ డేటాను వినియోగించలేకపోయారు. స్పష్టమైన కాలమ్ లేకుండా మళ్లీ అదేవిధంగా స్వేచ్ఛా నమోదు జరిగితే, లక్షలాది భిన్నమైన నమోదులు రావడం సహజం. అలాంటి సమాచారాన్ని తర్వాత వర్గీకరించడం కంటే, మొదటనుంచే స్పష్టమైన గుర్తింపుతో సమాచారాన్ని సేకరించడమే విశ్వసనీయమైన విధానం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(4), 16(4) విద్యా,ఉద్యోగాల్లో వెనుకబడినతరగతులకు ప్రత్యేక అవకాశాలను కల్పిస్తుండగా, ఆర్టికల్ 243(డి), 243(టి) స్థానికసంస్థల్లో రాజకీయ ప్రాతినిధ్యాన్ని నిర్ధారిస్తున్నాయి. అయితే ఈ రాజ్యాంగ హక్కులు సమర్థవంతంగా అమలు కావాలన్నా, నిధుల కేటాయిం పులు, సంక్షేమ పథకాల రూపకల్పన, బిసిసబ్‌ప్లాన్ల అమలు సరిగ్గా జరగాలన్నా విశ్వసనీయ గణాంకాలు తప్పనిసరి. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు జనగణన ఫారంలో ప్రత్యేక గుర్తింపు ఇవ్వకపోవడం భవిష్యత్ విధానాల విశ్వసనీయతను, సంక్షేమపథకాల పారదర్శకతను దెబ్బతీస్తుంది. జనగణన అనేది కేవలం జనాభా లెక్కింపు కార్యక్రమం కాదు.. అది దేశ భవిష్యత్ విధానాలకు,వనరుల సమానపంపిణీకి, సామాజిక న్యాయ అమలుకు పునాది. 2027 జనగణన రెండో దశ ప్రారంభమయ్యేలోపే కేంద్ర ప్రభుత్వం ఈ అంశాన్ని రాజ్యాంగబద్ధమైన బాధ్యతగా పరిగణించాలి. ●

# అణ్వాయుధాల ఆధిపత్యాన్ని నియంత్రించలేమా?

బొల్లిముంత సాంబశివరావు

ఆధునిక కాలంలో సామ్రాజ్యవాదం అంటే,కేవలం భౌగోళికంగా దేశాలను ఆక్రమించుకోవడమేకాదు, సైనిక, ఆర్థిక సాంకేతిక ఆధిపత్యాల ద్వారా ఇతరదేశాలను సామ్రాజ్యవాద దేశాలు తమగుప్పిట్లో ఉంచుకోవడం.ఈ ఆధునిక సామ్రాజ్యవాదానికి అణ్వాయుధాలు అతిపెద్ద ఆయుధాలుగా మారాయి.అమెరికా, రష్యా,చైనా, బ్రిటన్, ఫ్రాన్స్‌దేశాలు అధికారికంగా అణ్వాయుధాలు కలిగి ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా అణ్వాయుధాల తయారీ,నిల్వల్లో రష్యా, అమెరికా అత్యంత అగ్రస్థానంలో ఉన్నాయి. ప్రపంచంలో ఉన్నమొత్తం అణ్వాయుధాల్లో 90శాతం ఈరెండు దేశాలే కలిగి ఉన్నాయి. ప్రపంచంలోనే రష్యా అత్యధికంగా 5,500లకుపైగా అణ్వాయుధాలు కలిగి ఉంది. 5,044 అణ్వాయుధాలతో అమెరికా రెండవస్థానంలో ఉంది. చైనా 540పైగా అణ్వాయుధాలతో మూడవస్థానంలో ఉంది.ఆ తర్వాత బ్రిటన్, ఫ్రాన్స్‌లున్నాయి. అణ్వాయుధాలపై ఆధిపత్యం కలిగిన దేశాలు ముఖ్యంగా అమెరికా కొత్తగా ఏ దేశం అణుబాంబులుతయారు చేయకుండా అడ్డుకొంటున్నది. ఇది ప్రపంచ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. అణ్వాయుధాలతోపాటు ఇతర ఆధునిక ఆయుధాలు కలిగిన అమెరికాకు, ఆధునిక ఆయుధసంపత్తి లేని దేశాలు భయపడాల్సి వస్తున్నది. అసమానతలతో కూడిన ఐక్యరాజ్యసమితి చేసిన అణువ్యాప్తి నిరోధక ఒప్పందం ద్వారా కొత్తగా ఏ దేశం అణ్వాయుధాలను తయారు చేయకుండా నిరోధించడం, శాంతియుత అవసరాల కోసం మాత్రమే అణుశక్తిని వినియోగించేలా చేయడం ఈఒప్పందం లక్ష్యంగా ప్రకటించబడింది. ఇది 1970 మార్చి 5నుంచి అమల్లోకి వచ్చింది. ఈ ఒప్పందం ద్వారా ఐక్యరాజ్యసమితి అణ్వాయుధాలు, అపారసైనిక శక్తి, ఆర్థిక బలం కలిగిన సామ్రాజ్యవాద దేశాలకు ముఖ్యంగా అమెరికా కు వెనుకబడిన దేశాలు లొంగిఉండాలని చెప్పకనేచెబుతున్న ది. ఈ ఒప్పందాన్ని అనేక దేశాలు వ్యతిరేకించాయి. ఇతర దేశాలు అణ్వాయుధాలు తయారు చేయకుండా ఒప్పందం నిరోధిస్తున్నప్పుడు, ఏ దేశం దగ్గర అణ్వాయుధాలు ఉండ కూడదు. అమెరికాతోపాటు అణ్వాయుధాలున్న దేశాలన్నీ వాటిని నాశనంచేసే చర్యలు తీసుకోవాలి.కాని అణుఒప్పం దంలో అలాంటి అంశంలేదు. అలాంటప్పుడు ప్రపంచ ప్రజ లకు అణుయుద్ధ ప్రమాదం పొంచి ఉంటూనే ఉంటుంది. చైనాతోపాటు ప్రపంచదేశాల్లో ఉన్న అణ్వాయుధాలన్నింటిని నాశనం చేద్దాం మావోనాయకత్వాన చైనా ప్రకటించడాన్ని ప్రత్యేకంగా గమనించాల్సిన అంశం. 1945లో అమెరికా అణుబాంబు



తయారు చేసిన తొలిదేశంగా దాని ఆధిపత్యం కొనసాగింది. ఆతర్వాత బ్రిటన్ ,ఫ్రాన్స్,రష్యాలు 1949లో తయారు చేశాయి. అమెరికా యుద్ధోన్మాద చర్యలను ఎదు ర్కోవడానికి మాత్రమే స్టాలిన్ నాయకత్వాన సోవియట్ యూనియన్ అణుబాంబు తయారుచేసింది.అమెరికా అణ్వా యుధాల ఆధిపత్యానికి వ్యతిరేకంగా మావో నాయకత్వాన 1964లో చైనా అణుబాంబును తయారుచేసింది. ఆతర్వాత 1974లో భారత్, 1998లో పాక్ అణుబాంబులు తయారు చేశాయి. 2006లో ఉత్తరకొరియా అణుబాంబు తయారీలో విజయవంతమైంది. ఐక్యరాజ్యసమితి ఒప్పందం ప్రకారం అణ్వాయుధాల సంఖ్య కొంత తగ్గినప్పటికీ అమెరికా, రష్యాలు తమవద్ద ఉన్న ఆయుధాలను మరింత అధునాతనంగా, శక్తివంతంగా తయారు చేస్తున్నాయి.ఇందులో అమెరికా అగ్రభాగంలో ఉంది. అలా చేయడం ఐక్యరాజ్యసమితి తీర్మానానికి వ్యతిరేకం. అణు ఉత్పత్తి దేశాలు ముఖ్యంగా అమెరికా, రష్యా దేశాలు అణు పరీక్షలను స్వదేశాల్లో కాకుండా పసిఫిక్ సముద్రంలోని చిన్నదీవుల్లో లేదా తమ ఆధీనంలోని వలస ప్రాంతాల్లో నిర్వహిస్తున్నాయి. దీనివల్ల ఆయాప్రాంతాల్లో పర్యావరణం నాశనం కావడం, రేడియేషన్ వ్యాధులతో ప్రజలు బాధపడుతున్నారు. ముఖ్య అణ్వాయుధాల దేశాలు నేరుగా యుద్ధాలకు తలపడితే పరస్పరం వినాశనం జరుగుతుందని వాటికితెలుసు. అందుకే అలా తలపడటం లేదు. తమ సామ్రాజ్యవాద విస్తరణ కోసం ఆసియా,ఆఫ్రికా మధ్యప్రాచ్యంలోని చిన్నదేశాలను వేదిక చేసుకుని యుద్ధాలు జరుపుతున్నాయి. జపాన్లోని హిరోషిమా, నాగసాగిపై అణుబాంబుదాడి ద్వారా సోవియట్యూనియన్‌కు తన సైనిక శక్తిని చూపి భయపెట్టడానికేనని రాజకీయవేత్తలు చెప్పారు. కాని సోవియట్యూనియన్‌కే అమెరికా భయం కలిగించింది. ఇరాక్ వద్ద సామూహిక వినాశకర ఆయుధాలు ఉన్నాయనేఅబద్ధపు నెపంతో అమెరికా ఆదేశంపై దాడిచేసి సద్దాంహుస్సేన్ ప్రభుత్వాన్ని కూల్చి ఆయన్ను ఉరితీసింది. ప్రపంచవ్యాప్తంగా అమెరికాకు 800లకుపైగా సైనిక స్థావరాలున్నాయి. రష్యా సరిహద్దులకు సమీపంలోనూ,వ్యూహాత్మక సముద్ర మార్గాల్లోను ఈసైనిక స్థావరాలు ఏర్పాటు చేసింది. అణ్వాయుధాలను అగ్రరాజ్యాలను నియంత్రించడంలో ఐరాస వైఫల్యానికి ప్రధానకారణం వాటి రాజకీయ ఆధిపత్యం, భద్రతా మండలి ఏర్పాటులో ఉన్నలోపాలే కారణం.ప్రపంచ వ్యాప్తంగా అణ్వాయుధవ్యాప్తిని అరికట్టడానికి ఐక్యరాజ్య సమితిలో అనేక ఒప్పందాలు జరిగినా అవి ఆయుధ పోటీని ఆపడంలో వైఫల్యం చెందాయి. అణ్వాయుధ యుద్ధ ప్రమాదాల భయం లేకుండా ప్రపంచదేశాల ప్రజలు ఉండాలంటే,అణ్వాయుధాల తయారీకి వ్యతరేకంగానే కాకుండా, అవి ఉన్న అన్నిదేశాల్లో ప్రజలకు ప్రమాదం రాకుండా చాలా జాగ్రత్తగా నాశనం చేయాలి. అలా జరగాలంటే ప్రపంచ ప్రజలందరూ సామ్రాజ్య వాదానికి ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదా

27-8Pg5:27-8Pg5.qxd 8/26/2026 10:44 PM Page 1



# పిల్లల్ని కంటే రూ. 55 లక్షలు ప్రోత్సాహకం!



## జననాల రేటు పడిపోవడంతో రంగంలోకి దిగిన సింగపూర్ ప్రభుత్వం

### భారీ కుటుంబ ప్యాకేజీలు, రాయితీలతో యువతకు వల

**సింగపూర్‌సిటీ, ఆగస్టు 26:** ఆర్థిక అద్భుతాలకు, ఆధునిక జీవనశైలికి చిరునామాగా నిలిచే సింగపూర్, ఇప్పుడు ఓ తీవ్రమైన సామాజిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. దేశంలో జననాల రేటు రికార్డు స్థాయిలో పడిపోవడంతో, ప్రభుత్వం రంగంలోకి దిగింది. పిల్లల్ని కనేందుకు యువతను ప్రోత్సహించే లక్ష్యంతో మునుపెన్నడూ లేని విధంగా ఓ భారీ కుటుంబ మద్దతు ప్యాకేజీని ప్రకటించింది. సింగపూర్‌లో పుట్టిన ప్రతి బిడ్డకు 17 ఏళ్లు నిండే వరకు దాదాపు 70,000 సింగపూర్ డాలర్లు అంటే సుమారు రూ. 55 లక్షలు ప్రత్యక్ష ఆర్థిక సహాయం అందనుంది. సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ జాతీయ దినోత్సవ ర్యాలీలో ఈ ప్రకటన చేశారు. దేశంలో సంతానోత్పత్తి రేటు 0.87తో అత్యంత ప్రమాదకర స్థాయికి పడిపోయిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయంతీసుకుంది. ఎన్ని ప్రోత్సాహకాలు ఇచ్చినా యువత పిల్లల్ని కనేందుకు ముందుకు రాకపోవడంతో, ఈసారి మరింత సమగ్రమైన విధానాన్ని అనుసరించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ కొత్త ప్యాకేజీ కేవలం డబ్బుతో సరిపెట్టడం లేదు. కుటుంబాలపై భారం తగ్గించేలా అనేక అంశాలను ఇందులో చేర్చారు. పుట్టిన ప్రతి బిడ్డకు ప్రభుత్వం 10,000 సింగపూర్ డాలర్ల సుమారు రూ. 7.8 లక్షలు బేబీ గిఫ్ట్ అందిస్తుంది. అదనంగా, ఫస్ట్ స్టెప్ గ్రాంట్ కింద మరో 5,000 డాలర్లు సుమారు రూ. 4 లక్షలు ఇస్తారు. బిడ్డ పెరుగుతున్న కొద్దీ ఏటా చైల్డ్ క్రెడిట్స్ రూపంలో 2,000డాలర్లు సుమారు రూ.1.6 లక్షలు చొప్పున జమ చేస్తారు. వీటన్నింటితో పాటు, శిశు సంరక్షణ (చైల్డ్ కేర్) కేంద్రాల్లో సబ్సిడీలను పెంచనున్నారు. తల్లిదండ్రులకు ఇచ్చే సెలవులను కూడా విస్తరించనున్నారు. ప్రభుత్వం నిర్మించే ఇళ్ల కేటాయింపుల్లో పిల్లలు ఉన్న కుటుంబాలకు అదనపు ప్రాధాన్యం ఇస్తారు. ప్రతి బిడ్డకు లాటరీలో ఒక అదనపు అవకాశం లభిస్తుంది. ఈ ఆర్థిక సంవత్సరంలోనే కుటుంబ, సంతాన ప్రోత్సాహకాల కోసం ప్రభుత్వం సుమారు 7 బిలియన్ల సింగపూర్ డాలర్లు (సుమారురూ. 5.5 వేలకోట్లు) ఖర్చు చేయనుంది. మీరు పిల్లల్ని కనాలని నిర్ణయించుకుంటే, ప్రభుత్వం మీకు అండగా నిలుస్తుందని ప్రతి కుటుంబం తెలుసుకోవాలని ప్రధాని వాంగ్ భరోసా ఇచ్చారు. ఒకప్పుడు ఇద్దరు చాలు అంటూ తీవ్రంగా ప్రచారం చేసిన సింగపూర్ ప్రభుత్వమే ఇప్పుడు పిల్లల కోసం ప్రాధేయపడాల్సిన పరిస్థితి రావడం గమనార్హం.

1970లలో అధిక జనాభా దేశాభివృద్ధికి భారమని భావించిన ప్రభుత్వం, 1987 నాటికి తన విధానాన్ని మార్చుకుంది. అప్పటి నుంచి జననాల రేటును పెంచేందుకు ఆర్థిక ప్రోత్సాహకాలు, ప్రసూతి సెలవులు వంటి ఎన్నో ప్రయత్నాలు చేసింది. విశ్వవిద్యాలయ పట్టభద్రులకు మ్యాచ్ మేకింగ్ ఈవెంట్లు కూడా నిర్వహించింది. అయినా పరిస్థితి మారలేదు, సంతానోత్పత్తి రేటు పడిపోతూనే ఉంది. ప్రభుత్వం ఇంత భారీగా డబ్బు వెదజల్లడానికి సిద్ధమైనా, ఇది ఎంతవరకు ఫలిస్తుందనేది సందేహంగానే ఉంది. ఇటీవల వెలువడిన ఓ సర్వేలో, దాదాపు మూడింట ఒక వంతు మంది యువత ఏ ప్రభుత్వ విధానం కూడా తమను పిల్లల్ని కనేలా ప్రోత్సహించలేదని స్పష్టం చేశారు. ఖరీదైన జీవనం, పని ఒత్తిడి, పిల్లల పెంపకానికి అయ్యే అధిక ఖర్చులే తమను ఈ నిర్ణయానికి దూరం చేస్తున్నాయని వారు చెబుతున్నారు.

సింగపూర్ మేనేజ్‌మెంట్ యూనివర్సిటీకి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ యూజీన్ టాన్ ఈ చర్యలను "సింగపూర్‌కు లభించిన చివరి అవకాశం"గా అభివర్ణించారు. కేవలం ఆర్థిక ప్రోత్సాహకాలే కాకుండా, వివాహం, సంతానం పట్ల సమాజంలో ఉన్న దృక్పథాలు, మనస్తత్వాలు మారినప్పుడే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. మరోవైపు, దేశంలో వృద్ధుల జనాభా పెరిగిపోయి, పనిచేసే యువతరం తగ్గిపోతుండటంతో సింగపూర్ భవిష్యత్తుపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో, వలసదారులను ఆహ్వానించడం కూడా తప్పదని ప్రధాని వాంగ్ సూచించారు.



# కర్ణాటకలో ఇక వందేమాతరం రెండు చరణాలే

## సిఎం డికెశివకుమార్ వెల్లడి

**బెంగళూరు, ఆగస్టు 26:** కర్ణాటకలో ప్రభుత్వ కార్యక్రమాల్లో వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలపించబోమని ముఖ్యమంత్రి డికె శివకుమార్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ నిర్ణయం మేరకు తొలి రెండు చరణాలు మాత్రమే పాడతామని తెలిపారు. ఈ విషయంలో పార్టీ వైఖరికి తాను కట్టుబడి ఉన్నానని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మొత్తం ఆరు చరణాలు ఆలపించడంపై ప్రశ్నించగా తనకు తెలియకుండానే ఆ నిర్ణయం జరిగి ఉండొచ్చని శివకుమార్ అన్నారు. ఇకపై ప్రభుత్వ కార్యక్రమాల్లో మాత్రం గతంలో నిర్ణయించిన విధంగానే తొలి రెండు చరణాలు మాత్రమే పాడతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఇటీవల 1937లో తీసుకున్న నిర్ణయాన్ని మరోసారి సమర్థించింది. బహిరంగ, జాతీయ కార్యక్రమాల్లో వందేమాతరం తొలి రెండు చరణాలుమాత్రమే ఆలపించాలని అప్పట్లో నిర్ణయించినట్లుపేర్కొంది. మొత్తం చరణాలు పాడాలంటూ కొత్త వందేమాతరం బిల్లు రావడం నేపథ్యంలో ఈఅంశంపై కాంగ్రెస్, బిజెపి మధ్య రాజకీయ వివాదం కొనసాగుతోంది. కాంగ్రెస్ నిర్ణయాన్ని బిజెపి తప్పుబట్టింది. జాతీయ గేయాన్ని అవమానిస్తున్నారని విమర్శించింది. ఓటుబ్యాంకు రాజకీయాలకు కాంగ్రెస్ పాల్పడుతోందని ఆరోపించింది. ఈ విమర్శలపై శివకుమార్ స్పందించారు. భారత్ భిన్న భాషలు, సంస్కృతులు, ప్రాంతాలతో కూడిన దేశమని అన్నారు. ప్రతి వర్గాన్ని గౌరవించడమే కాంగ్రెస్ సిద్ధాంతమని చెప్పారు. బిజెపి ఓటుబ్యాంకు రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. వందేమాతరం తరువాతి చరణాల్లో దుర్గ, లక్ష్మి, సరస్వతి వంటి హిందూ దేవతల ప్రస్తావన ఉందని కాంగ్రెస్‌చెబుతోంది. ఇతర వర్గాలకు అవి అభ్యంతరకరంగా ఉండొచ్చన్న కారణంతో తొలి రెండు చరణాలకే పరిమితం కావాలని నిర్ణయించింది.

# లడఖ్‌లో డిఆర్‌డివో పారాచూట్ పరీక్ష విజయవంతం




**న్యూఢిల్లీ, ఆగస్టు 26:** రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ స్వదేశీ మిలిటరీ కంబాట్ పారాచూట్ సిస్టమ్‌కు సంబంధించిన అధిక ఎత్తు పరీక్షను బుధవారం విజయవంతంగా నిర్వహించింది. లడఖ్‌లోని లేహ్ జిల్లాలో న్యోమాముధ్ డ్రాప్ జోన్‌లో ఈ పరీక్ష చేపట్టారు. అత్యంత ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో ఈ ట్రయల్ నిర్వహించారు. సముద్ర మట్టానికి 22,000 అడుగుల ఎత్తు నుంచి టెస్ట్ జంప్ నిర్వహించగా, అక్కడ ఉష్ణోగ్రతలు మైనస్ 15 డిగ్రీల సెల్సియస్కు పడిపోయాయి. ఈ వ్యవస్థను డిఆర్‌డివోకు చెందిన ఏరియల్ డెలివరీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ రూపొందించి అభివృద్ధి చేసింది. సంస్థకు చెందిన ముగ్గురు టెస్ట్ జంపర్లు ఈ ప్రయోగంలో పాల్గొన్నారు. చీఫ్ టెస్ట్ జంపర్ వింగ్ కమాండర్ రాహుల్ ఝా, ఎండబ్ల్యువో ఆర్.జే. సింగ్, విఎంజె, ఎండబ్ల్యు వివేక్ తివారీ ఈ జంప్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ట్రయల్‌లో డిఆర్డీవో పాటు స్వదేశీ పారా కంప్యూటర్, ఆక్సిజన్ వ్యవస్థ, ప్రత్యేకంగా రూపొందించిన జంప్‌సూట్లను వినియోగించారు. 20వేల అడుగుల ఎత్తులో పారాచూట్‌ను తెరవగా, జంపర్లు 13,700 అడుగుల ఎత్తులో సురక్షితంగా ల్యాండ్ అయ్యారు. తీవ్ర పరిస్థితుల్లో వ్యవస్థ సామర్థ్యానికి అత్యంత ఎత్తైన ప్రాంతాల్లో ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ డిఆర్‌డివో సమర్థత, విశ్వసనీయత, వ్యూహాత్మక వినియోగ సామర్థ్యాన్ని ఈ విజయవంతమైన పరీక్ష నిరూపించిందని డిఆర్‌డివో తెలిపింది. ప్రత్యేకించి క్లిష్టమైన అధిక ఎత్తు ప్రాంతాల్లో కార్యకలాపాల కోసం భారతదేశం అభివృద్ధి చేస్తున్న స్వదేశీ రక్షణ సాంకేతిక పరిజ్ఞాన సామర్థ్యాన్ని ఈ పరీక్ష చాటిచెప్పింది. కీలక రక్షణ సాంకేతికతలు, అధిక ఎత్తు వైమానిక సరఫరా వ్యవస్థల్లో ఆత్మనిర్భరతను మరింత బలోపేతం చేసే దిశగా ఈ విజయవంతమైన ప్రయోగం కీలక ముందడుగుగా నిలుస్తుందని డిఆర్‌డివో పేర్కొంది.



# కర్ణాటకలో కలకలం

## భూతనాళ సరస్సులో ఆరు మృతదేహాలు

### సామూహిక ఆత్మహత్యగా పోలీసుల అనుమానం

### మృతులు విజయపుర జిల్లా వాసులుగా గుర్తింపు

**విజయపుర (కర్ణాటక), ఆగస్టు 26:** ఉత్తర కర్ణాటకలోని విజయపుర నగర శివార్లలోఉన్న భూతనాళ సరస్సులో ఆరు మృతదేహాలు తేలియాడడటం కలకలంసృష్టించింది. ఉదయం 8.45గంటల ప్రాంతంలో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, అగ్నిమాపక, అత్యవసర సేవల సిబ్బంది వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను సరస్సును వెలికితీశారు. మృతులను గుర్తింపు ప్రక్రియను ప్రారంభించగా, ప్రాథమిక దర్యాప్తులో సోమవారమే విజయపుర రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆరుగురు అదృశ్యంపై కేసు నమోదైనట్లు గుర్తించారు. శోభ భర్త బీమరాయ ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదైంది. దాని ఆధారంగా పోలీసులు వివరాలు రాబట్టారు. మృతులు విజయపుర జిల్లా టికోటా తాలూకా తోరవి గ్రామ వాసులుగా గుర్తించారు. శోభ జలగేరి, ఆమె పిల్లలు విద్య, సువర్ణ(14), గౌడేశ్(10), వికాస్(5), సానిక(7)గా గుర్తించారు. మిస్సింగ్ కేసు ఆధారంగా ఆగస్టు 24న శోభ తన భర్తతో గొడవపడినట్లు తేలింది. తాను ఇంటిని వదిలి వెళ్లిపోతానని, పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకుంటానని ఆమె అతనికి చెప్పినట్లు సమాచారం. గొడవ జరిగిన తర్వాత శోభ ఉదయం 6 గంటల ప్రాంతంలో ఇంటి నుండి బయలుదేరి, మొదట నలుగురు పిల్లలను తనతో తీసుకెళ్లిందని ఎస్పీ లక్ష్మణ్ నింబార్గి తెలిపారు. ఆ తర్వాత, వినికిడి లోపం ఉండి ఒక రెసిడెన్షియల్ స్కూల్‌లో చదువుతున్న తన మరో కుమారుడిని కూడా ఆమె తనతోతీసుకెళ్లింది. ఆ కుటుంబం ఎక్కడికి వెళ్లిందనే విషయాన్ని తెలుసుకోవడానికి పోలీసులు ప్రయత్నించారు, కానీ శోభ తన మొబైల్ ఫోన్‌ను ఇంట్లోనే వదిలి వెళ్లడంతో వారి ఆచూకీని కనుగొనలేకపోయారు. మరణాలకు దారితీసిన ఖచ్చితమైన పరిస్థితులు ఇంకా తెలియరాలేదు అయినప్పటికీ, పోలీసులు ప్రస్తుతం ఈ ఘటనను అనుమానాస్పద ఆత్మహత్యగా పరిగణిస్తున్నారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం పరీక్ష కోసం తరలించారు. కుటుంబ కలహాల కారణంగా ఈ మరణాలు సంభవించి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

# హెచ్‌ఐవి కట్టడికి ఇంజెక్షన్ వచ్చేస్తోంది

## 'లెనాకాపవీర్' ఉత్పత్తి విక్రయానికి రెడ్డీస్‌కు అనుమతులు

**హైదరాబాద్, ఆగస్టు 26:** హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ప్రముఖ ఫార్మా సంస్థ డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ హెచ్‌ఐవీ వ్యాప్తిని నివారించే లెనాకాపవిర్ జెనరిక్ ఇంజెక్షన్‌ను భారత్‌లో తయారు చేసి, విక్రయించేందుకు అనుమతి పొందింది. ఈ విషయంలో మూడోదశ క్లినికల్ ట్రయల్స్ నిర్వహించకుండానే ఉత్పత్తికి, మార్కెటింగ్‌కు కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ నిపుణుల కమిటీ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో ఇంజెక్షన్ ధర భారీగా తగ్గే అవకాశంఏర్పడింది. డాక్టర్ రెడ్డీస్‌తోపాటు ఎంక్యూర్ ఫార్మాస్యూటికల్స్‌కు కూడా నిపుణుల కమిటీ ఈ అనుమతిని మంజూరు చేసింది. అయితే, మార్కెట్లోకి విడుదల చేశాక నాలుగో దశ క్లినికల్ పరీక్షలు నిర్వహించి, ఆ డేటాను సమర్పించాలని కంపెనీలను ఆదేశించింది. ఈఇంజెక్షన్‌ను హెచ్‌ఐవీ ముప్పు అధికంగా ఉన్నవారు (కనీసం 35కిలోల బరువుఉండాలి) ఏడాదికి రెండుసార్లు తీసుకోవాల్సి ఉంటుంది. అంతర్జాతీయ ఫార్మా సంస్థ గిలీడ్ సైన్సెస్‌కు 'లెనాకాపవిర్' ఔషధంపై పేటెంట్‌ఉంది. అయితే, ఎలాంటి రాయల్టీ తీసుకోకుండా భారత్‌తో పాటు 120 అల్పాదాయ దేశాల్లో ఈ మందును తయారు చేసేందుకు గిలీడ్ పలు కంపెనీలకు లైసెన్సులు మంజూరు చేసింది. అమెరికా, ఈయూ దేశాల్లో దీని వార్షిక ఖర్చు రూ.27 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఉండగా, జెనరిక్ రాకతో భారత్‌లో ప్రస్తుతం ఉన్న ధర కంటే 50 నుంచి 70 శాతం వరకు తగ్గుతుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

**ఆరిజెన్‌కు భారీ కాంట్రాక్టు**

డాక్టర్ రెడ్డీస్ అనుబంధ సంస్థ అయిన ఆరిజెన్ ఫార్మా ఒక అంతర్జాతీయ కంపెనీ నుంచి భారీ కాంట్రాక్టును దక్కించుకుంది. ఈ ఒప్పందం కింద దీర్ఘకాలం పాటు స్టెరైల్ ఇంజెక్టబుల్స్, బయోలాజిక్స్ తయారు చేసి సరఫరా చేయనుంది. కాంట్రాక్టులోని షరతుల కారణంగా భాగస్వామ్య కంపెనీ పేరును వెల్లడించలేదు.

# ప్రపంచవ్యాప్తంగా అమెరికా వీసా అపాయింట్‌మెంట్ల వాయిదా




**వాషింగ్టన్,ఆగస్టు 26:** అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కొనసాగుతున్న వలస వ్యతిరేక చర్యల్లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా అమెరికా రాయబార కార్యాలయాలు, కాన్సులేట్లలో వీసా అపాయింట్‌మెంట్లను తాత్కాలికంగా నిలిపివేయడం ప్రారంభించారు. అమెరికా విదేశాంగ శాఖ తెలిపిన వివరాల ప్రకారం అన్ని విదేశీ దౌత్య కార్యాలయాల్లో చేపడుతున్న గ్లోబల్ శిక్షణ కార్యక్రమానికి అనుగుణంగా వీసా సేవల అపాయింట్‌మెంట్లలో మార్పులు చేస్తున్నారు. ఈ శిక్షణ కార్యక్రమం కారణంగా వీసా సేవల అపాయింట్‌మెంట్లను సర్దుబాటు చేస్తున్నట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈమార్పులు ఎంతకాలం కొనసాగుతాయన్న దానిపై స్పష్టమైన గడువును ప్రకటించలేదు. అమెరికా ప్రజా సంక్షేమ ప్రయోజనాలపై ఆధారపడే అవకాశం ఉందని భావించే దరఖాస్తుదారులను గుర్తించడంతో పాటు, వీసాఅభ్యర్థులను సమగ్రంగా, ఒకే విధమైన ప్రమాణాలతో పరిశీలించేందుకు కాన్సులర్ అధికారులకు శిక్షణ ఇవ్వడం ఈ కార్యక్రమం ఉద్దేశమని పేర్కొంది. ఇప్పటికే ఇంటర్వ్యూలకు అపాయింట్‌మెంట్లు పొందిన వలస వీసా దరఖాస్తుదారులకు అమెరికా రాయబార కార్యాలయాలు, కాన్సులేట్లు ఈమెయిళ్లు పంపినట్లు తెలిపింది. వారి అపాయింట్‌మెంట్లను రీషెడ్యూల్ చేస్తున్నామని, కొత్త తేదీని తర్వాత తెలియజేస్తామని అందులో పేర్కొన్నట్లు వెల్లడించింది. ట్రంప్ కఠిన వలస విధానంట్రంప్ ప్రభుత్వం అక్రమ వలసదారులపై భారీ స్థాయిలో దేశ బహిష్కరణ చర్యలను చేపడుతోంది. ఇందులో వీసాలు, గ్రీన్ కార్డుల రద్దు, వివిధ కారణాలతో వలస దరఖాస్తుల తిరస్కరణ వంటి చర్యలు ఉన్నాయి. రాజకీయ అభిప్రాయాలు, అమెరికా మిత్రదేశమైన ఇజ్రాయెల్ గాజాపై జరుపుతున్న దాడులకు వ్యతిరేకంగా నిర్వహించిన పాలస్తీనా అనుకూల నిరసనల్లో పాల్గొనడం వంటి అంశాలు కూడా కొన్ని సందర్భాల్లో కారణాలుగా మారుతున్నాయి. వేలాది మంది భారతీయ నిపుణులు వినియోగించే హెచ్1బీ వీసా కార్యక్రమంలో కీలక మార్పులు తీసుకురావడానికి ఉద్దేశించిన కొత్త ప్రతిపాదనపై ట్రంప్ ప్రభుత్వం ఈ వారం వైట్‌హౌస్ స్థాయిలో సమీక్ష ప్రారంభించింది. ఈ ప్రతిపాదనను ఆర్థికంగా కీలకమైనదిగా వర్గీకరించారు. అంటే ఏడాదికి కనీసం 100 మిలియన్ డాలర్ల ఆర్థిక ప్రభావాన్ని చూపే లేదా ఆర్థిక వ్యవస్థ, ఉద్యోగాలు, ఉత్పాదకత, పోటీ లేదా ప్రధాన ఆర్థిక రంగంపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉన్న ప్రతిపాదనగా దీనిని పరిగణిస్తున్నారు.

# అంతర్గత భద్రత పటిష్టతే వికసిత్ భారత్‌కు పునాదులు: హోం మంత్రి అమిత్‌షా



**న్యూఢిల్లీ, ఆగస్టు 26:** అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యానికి పటిష్ఠ అంతర్గత భద్రతే పునాది అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. చొరబాట్లు, ఉగ్రవాదం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, భవిష్యత్ భద్రతా సవాళ్లపై ఇప్పటి నుంచే ముందస్తు వ్యూహాలతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో జరిగిన ఇంటెలిజెన్స్ బ్యూరో జాతీయ భద్రతా సదస్సు ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. మరో 15 నుంచి 20 యేళ్లలో ఎదురయ్యే భద్రతా సవాళ్లను ఇప్పటి నుంచే గుర్తించాలని అమిత్ షా సూచించారు. అవి పెద్ద సంక్షోభాలుగా మారకముందే తిప్పికొట్టే వ్యూహాలు సిద్ధం చేయాలని చెప్పారు. దేశంలో మూడు ప్రధాన అంతర్గత భద్రతా హాట్‌స్పాట్ల నుంచి ఎదురైన ముప్పులను సమర్థంగా అధిగమించామని పేర్కొన్నారు. సరిహద్దు భద్రతపై కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టిందని షా తెలిపారు. ఎనిమిది నెలలుగా అన్ని భూ సరిహద్దు రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపామని చెప్పారు. నాలుగు అంచెల సరిహద్దు భద్రతా ప్రణాళికను రాష్ట్రాలకు అందించామని వెల్లడించారు. ఇది ధర్మశాల కాదు. ఈ దేశ పౌరులకు మాత్రమే ఇక్కడ నివసించే హక్కు ఉందని షా వ్యాఖ్యానించారు. అక్రమ చొరబాటుదారులు జాతీయ భద్రత, ఆర్థిక స్థిరత్వం, జనాభా సమతుల్యతకు ముప్పని హెచ్చరించారు. కొత్తగా తెచ్చిన మూడు క్రిమినల్ చట్టాలను వచ్చే ఏడాదిలో పూర్తిస్థాయిలో అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు షాచెప్పారు. క్రిమినల్ కేసులు సుప్రీంకోర్టు స్థాయి వరకు మూడేళ్లలో పరిష్కారమయ్యేలా వ్యవస్థను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. శిక్షల శాతాన్ని 25 శాతం పెంచడమూ లక్ష్యమేనన్నారు. పిఎఫ్ఐపై నిషేధం తర్వాత చేపట్టిన చర్యలను కేంద్రరాష్ట్ర సమన్వయానికి ఉదాహరణగా షా పేర్కొన్నారు. ఉగ్రవాద నెట్‌వర్క్‌లను పూర్తిగాధ్వంసంచేసేందుకు ప్రహార్ వ్యూహాన్ని రోజువారీ భద్రతా కార్యకలాపాల్లో అమలు చేయాలని సూచించారు. మాదకద్రవ్యాలపై డిటెక్ట్, డిస్‌రప్ట్, డిస్ట్రాయ్ విధానాన్ని అనుసరించాలని రాష్ట్రాలకుపిలుపునిచ్చారు. 2026-29 మాదకద్రవ్య నియంత్రణ విజన్ డాక్యుమెంట్‌ను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. సీసీటీఎన్ఎస్, ఐసీజేఎస్, నాట్‌గ్రిడ్, నాఫిస్ డేటాబేస్‌ల అనుసంధానంతో శక్తిమంతమైన నిఘా వ్యవస్థ ఏర్పడిందని షా తెలిపారు. కృత్రిమ మేధ, డేటా విశ్లేషణ, ప్రవర్తనా సరళి అధ్యయనం ద్వారా భవిష్యత్ ముప్పులను ముందే గుర్తించాలని సూచించారు.

# పుట్టింటికెళ్లడానికి భర్త అనుమతి అక్కర్లేదు

## ఇంటి పనులు చేయాలని బలవంతం చేయలేరు

### తల్లిదండ్రులను చూసుకోవాలని ఆదేశించలేరు: కర్ణాటక హైకోర్టు



**బెంగళూరు, ఆగస్టు 26:** వివాహం అనేది అవతలి వ్యక్తిని నియంత్రించడానికి ఇచ్చే లైసెన్స్ కాదని, భర్తతో సహా ఎవరూ కూడా ఇంటి పనులు చేయాలని లేదా తన తల్లిదండ్రులను చూసుకోవాలని భార్యను ఆదేశించలేరని కర్ణాటక హైకోర్టు స్పష్టం చేసింది. భరణం కోసం బిఎన్ఎస్ఎస్ 2023లోని సెక్షన్ 144(1) కింద దాఖలు చేసిన పిటిషన్‌ను పాక్షి కంగా అనుమతిస్తూ జారీ చేసిన ఉత్తర్వుకు వ్యతిరేకంగా, ఫ్యామిలీ కోర్ట్స్ యాక్ట్‌లోని సెక్షన్ 19(4) కింద దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు పరిశీలిస్తూ జస్టిస్ చిల్లకూరు సుమలత నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. "భారతీయ మహిళ తనకిష్టమైనప్పుడు పుట్టింటికి వెళ్లాలనే ప్రాథమిక కోరికను తీర్చుకోవడానికి, అత్తవారింట్లో ఉన్నవారి అనుమతి ఎందుకు తీసుకోవాల్సి వస్తుందో ఈ కోర్టుకు అర్థం కావడం లేదు. భర్తతో సహా ఎవరూ కూడా, భార్యతో సహా ఏ మహిళనైనా ఇంటి పనులు చేయమని లేదా తన తల్లిదండ్రులను చూసుకోమని ఆదేశించకూడదని లేదా డిమాండ్ చేయకూడదని ఈ కోర్టు భావిస్తోంది. ఇంటి పనులను స్త్రీ పురుషులు సమానంగా పంచుకోవాలి. తల్లిదండ్రులను చూసుకోవాల్సిన అవసరం వచ్చినప్పుడు, ఆ బాధ్యత ప్రధానంగా కుమారుడు లేదా కుమార్తెపై ఉంటుంది తప్ప, అల్లుడు లేదా కోడలిపై కాదు. అత్తమామలను చూసుకోవడం అనేది అల్లుడు లేదా కోడలు స్వచ్ఛందంగా చేయాల్సిన పనికావాలితప్ప, బలవంతంగా చేయించకూడదు" అని పేర్కొంది. "ఒక మహిళకు తన కెరీర్, ఆర్థిక విషయాలు మొదలైన వాటికి సంబంధించి నిర్ణయాలు తీసుకునే ప్రాథమిక, సంపూర్ణ హక్కు ఉంటుంది. తన కోరికలు, అంచనాలకు అనుగుణంగా జీవించేలా భర్త తన భార్యను బలవంతం చేయలేర్ు" అని స్పష్టం చేసింది. "వివాహం అనేది అవతలి వ్యక్తి వ్యక్తిత్వం, స్వేచ్ఛ, సంకల్పాలను నియంత్రించడానికి, శాసించడానికి, ఆధిపత్యం చెలాయించడానికి లేదా అణచివేయడానికి ఇచ్చే అనుమతిపత్రం కాదు" అని అది పేర్కొంది. "కేవలం లింగభేదం ఆధారంగా మహిళ స్వయంప్రతిపత్తిని హరించడానికి లేదా ఆమె స్వేచ్ఛను పరిమితం చేయడానికి చేసే ఏ ప్రయత్నమైనా సమానత్వ సూత్రాలకు విరుద్ధం. మానవ గౌరవం, సామాజిక న్యాయం అనే రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకం" అని ధర్మాసనం అభిప్రాయపడింది.

# సంక్షిప్త వార్తలు

## ఆస్పత్రిలో అగ్నిప్రమాదం: 15మంది శిశువులు మృతి



**ఇస్లామాబాద్, ఆగస్టు 26:** పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లోని బుధవారం ఉదయం ఒక ప్రభుత్వ ఆస్పత్రిలో ఎయిర్ కండిషనింగ్ వ్యవస్థలోని లోపం కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో కనీసం 15 మంది శిశువులు మరణించారు. పాకిస్తాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (పిమ్స్) ఆస్పత్రిలోని మాతాశిశు ఆరోగ్య వార్డు మూడవ అంతస్తులో ఉదయం ఉదయం 6:45 గంటల ప్రాంతంలో నర్సరీ లోపల ఎయిర్ కండిషనింగ్ యూనిట్ పేలడంతో మంటలు చెలరేగాయని సహాయక సిబ్బంది తెలిపారు. ఆ సమయంలో వార్డులో 16 మంది నవజాత శిశువులు ఉన్నారని, వారిలో ఒకరిని రక్షి ంచామని అధికారులు తెలిపారు.

## పంజాబ్‌లో నేడు ఉద్యోగులు, పెన్షనర్ల మహాబంద్

**అమృత్‌సర్, ఆగస్టు 26:** పంజాబ్‌లో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా కదం తొక్కనున్నారు. గురువారం రాష్ట్రవ్యాప్త మహాబంద్‌కు పిలుపునిచ్చారు. మొత్తం ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు కలిపి 4 లక్షల మంది ఈ బంద్‌లో పాల్గొననున్నారు. ఆప్ ప్రభుత్వం తమకు చెల్లించాల్సిన డిఎలు ఇంకా విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ వారు ఈ ఆందోళన చేపట్టనున్నారు. దీంతో గురువారం మొత్తం ప్రభుత్వ కార్యకలాపాలతోపాటు, ప్రైవేటు కార్యకలాపాలు కూడా స్తంభించే అవకాశాలున్నాయి.

## రాజీనామాకు సిద్ధమైన కర్ణాటక మంత్రి నాగేంద్ర

**బెంగళూరు, ఆగస్టు 26:** కర్ణాటక మంత్రి బి.నాగేంద్ర రాజీనామాకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. గిరిజన సంక్షేమ శాఖలో అక్రమాల ఆరోపణల కేసులో నిందితుడిగా ఉన్న ఆయనపై విపక్షాల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. మంత్రివర్గంలోకి తీసుకోవడంపై సొంత పార్టీలోనూ అసంతృప్తి వ్యక్తమవుతోంది. నాగేంద్ర మంగళవారం ముఖ్యమంత్రి డికె శివకుమార్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం. తన కొనసాగింపు పార్టీకి ఇబ్బందిగా మారుతోందని చెప్పినట్లు తెలుస్తోంది. బిజెపి తనను లక్ష్యంగా చేసుకుంటోందని, పార్టీ ప్రతిష్ఠ కోసం పదవి నుంచి తప్పుకొనేందుకు సిద్ధంగా ఉన్నానని ఆయన చెప్పినట్లు సమాచారం.

## జాత్యహంకార వ్యాఖ్యలపై ఉషావాన్స్ కౌంటర్

**న్యూయార్కు, ఆగస్టు 26:** అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భార్య ఉషా వాన్స్ జాతి వివక్ష వ్యాఖ్యలను ఎదుర్కొన్నారు. ఆమె భారతీయ మూలాలను ఉద్దేశిస్తూ మిచిగాన్ డెమొక్రాటిక్ సెనేట్ అభ్యర్థి అబ్దుల్ ఎల్‌సయిద్ చేసిన వ్యాఖ్యలు అమెరికా రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ విమర్శలపై ఉషా వాన్స్ ఎంతో హుందాగా, గట్టిగా స్పందించారు. ఇటీవల ఒక ర్యాలీలో జేడీ వాన్స్, అబ్దుల్ ఎల్ సయిద్పై విమర్శనాస్త్రాలు సంధించారు. షరియా చట్టంపై విమర్శలను శ్వేతజాత్యహంకారంతో ముడిపెడుతూ గతంలో ఎల్‌సయిద్ చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు.

## ఇమ్రాన్ ఆరోగ్యంపై కుమారుడి ఆందోళన

**ఇస్లామాబాద్, ఆగస్టు 26:** పాకిస్థాన్ మాజీ ప్రధాని, తెహ్రీక్‌ఏఇన్సాఫ్ అధినేత ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై ఆయన కుమారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. జైలులో ఏకాంత నిర్బంధంలో ఉన్న తమ తండ్రికి సరైన వైద్యం అందకపోతే ఆయన ప్రాణాలకే ప్రమాదం జరగవచ్చని హెచ్చరించారు. ఆన్‌లైన్‌లో నిర్వహించిన మీడియాసమావేశంలో ఇమ్రాన్‌కుమారులు ఖాసిం, సులేమాన్ ఈవ్యాఖ్యలు చేశారు. ఈ పరిస్థితుల్లో ఆయన జైలునుంచి ప్రాణాలతోబయటపడటం కష్టంగానే కనిపిస్తోందని ఖాసిం వ్యాఖ్యానించారు.

## ఫైరింజన్ నీళ్లతో ఎమ్మెల్యే కారు శుభ్రం

**సింగ్రౌలీ, ఆగస్టు 14:** మధ్యప్రదేశ్‌లోని సింగ్రౌలీకి చెందిన బిజెపి ఎమ్మెల్యే రామ్ నివాస్ షా కారును ఫైరింజన్ నీటితో శుభ్రం చేశారు. ఈ ఘటనకు చెందిన వీడియో వైరల్ అయింది. అగ్నిప్రమాద సమయంలో ఎమర్జెన్సీ కోసం వినియోగించే ఫైరింజన్ నీటితో కారును క్లీన్ చేయడం పట్ల విమర్శలు వెల్లువెత్తాయి. ప్రభుత్వ నివాసం ఆవరణలో టొయోటా ఇన్నోవా కారును క్లీన్ చేశారు. అయితే తనకు తెలియకుండానే కారును శుభ్రం చేసినట్లు ఎమ్మెల్యే చెప్పారు.

## 'మదర్ థెరిసా నిస్వార్థ సేవలను మననం చేసుకుందాం'

**విజయవాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** పేదలు, అనాథల సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప మానవతావాది, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మదర్ థెరిసా జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాళి అర్పించారు. ప్రేమారాహిత్యంతో బాధపడుతున్న వారిని మదర్ థెరిసా అక్కున్న చేర్చుకున్నారని తెలిపారు. ఆమె నిస్వార్థ సేవలను స్మరించుకుందాం అంటూ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు తెలియజేశారు. సాటిమనిషిలోని బాధను తొలగించడమే దైవత్వం. పేదరికం, ప్రేమరాహిత్యంతో బాధపడుతున్న నిస్సహాయులను అక్కున చేర్చుకుని ప్రేమను పంచి, సపర్యలు చేశారు 'మదర్ థెరిసా. ఈరోజు ఆ మహనీయురాలి జయంతి సందర్భంగా విశ్వవ్యాప్తమైన ఆమె నిస్వార్థ సేవలను, దివ్య చరితను మననం చేసుకుందాం' అంటూ ఎక్స్‌లో ముఖ్యమంత్రి పోస్ట్ చేశారు.

## సిపిఎం నేత మధు సతీమణి సుమతి మృతికి సిఎం సంతాపం

**విజయవాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** సిపిఎం సీనియర్ నేత మధు సతీమణి సుమతి మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఐద్వా నాయకురాలిగా మహిళా హక్కుల సాధన కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆమె నిరంతరం పోరాడారని కొనియాడారు. మరణానంతరం ఆమె భౌతికకాయాన్ని వైద్య పరిశోధనలకు అప్పగించడం అత్యంత ఆదర్శనీయమని ప్రశంసించారు. సుమతి కుటుంబ సభ్యులకు సిఎం తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## మానవతా సేవకు ప్రతీకగా రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో సౌమ్య

**విజయవాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** మానవ మహోపకారి, విశ్వ కారుణ్యమూర్తి, జగత్ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి జన్మదినాన్ని పురస్కరించుకుని నందిగామ పట్టణంలోని ప్రతిభ హైస్కూల్ వేదికగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సందర్శించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు, కూటమి నాయకులతో కలిసి రక్తదాన శిబిరాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే సౌమ్య, రక్తదాతలను అభినందించారు. అత్యవసర సమయంలో ఒకరి ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం ఎంతో విలువైన సేవ అని, సమాజంలో మానవతా విలువలను పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం బోధించిన ప్రేమ, దయ, సేవా భావాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలంతా పరస్పర సహకారం, సోదరభావంతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే సౌమ్య ఆకాంక్షించారు. రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను, మత పెద్దలను, కూటమి నాయకులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, యువత, రక్తదాతలు పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం

## అనూహ్యంగా పెరిగిన రద్దీ

### వెంకన్న సర్వదర్శనానికి 24గంటలు



**తిరుమల, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** వారాంతం ముందే తిరుమల భక్తులతో కిటకిటలాడుతోంది. బుధవారం సెలవు కావడంతో ఉదయానికి తిరుమలలో భక్తుల క్యూలైన్లు ఆలయం వెలుపల రెండు కిలోమీటర్లు దూరం చేరాయి. ఇష్టదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు చేరుకోవడంతో కొండపై రద్దీ పెరిగింది. ఉదయం 6గంటలకే తిరుమలలో వైకుంఠం-2 క్యూకాంప్లెక్స్ నిండిపోయాయి. శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, పాలు, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. బుధవారం సాయంత్రం వరకు 41వేల మంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా 25వేల మంది భక్తులు అర్ధరాత్రి వరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి.

## 28న మలయప్పస్వామి గరుడసేవ



**తిరుమల, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో శ్రీవారి ఉత్సవమూర్తి మలయప్పస్వామికి ఈనెల 28వ తేదీ శుక్రవారం రాత్రికి గరుడసేవ జరుగుతుంది. సాధారణంగా ప్రతినెలలో పౌర్ణమిన గరుడసేవ టిటిడి నిర్వహిస్తుంది. 28న శ్రావణపౌర్ణమి పర్వదినం సందర్భంగా పౌర్ణమి గరుడ సేవ అత్యంత వైభవంగా జరగనుంది. సర్వాంగ సుందరంగా ముస్తాబైన మలయప్పస్వామి గరుడ వాహనంపై కొలువుదీరి భక్తులను కటాక్షించనున్నారు. దివ్యాభరణాలు ధరించే మలయప్పస్వామి జగన్మోహన రూపంలో గరుడ వాహనంపై అధిష్ఠించి ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తారు.

## "స్వయంభూ" చిత్రం త్వరలోనే విడుదల



**తిరుమల, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి తన ఇష్టదైవమని, ఆ స్వామిని మనసారా కొలిచి వేడుకుంటే అంతా శుభాలు కలుగుతాయని సినీనటుడు నిఖిల్ సిద్ధార్థ్ తెలిపారు. తాను ఇప్పటికే మూడు చిత్రాల్లో నటిస్తున్నా త్వరలోనే "స్వయంభూ" చిత్రం విడుదల కానుందని నిఖిల్ చెప్పారు. చిత్రం విడుదల తేదీ ప్రకటించడానికి ముందు తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోందని అన్నారు. స్వామివారి ఆశీస్సులతోనే చిత్రాల్లో బిజీగా నటిస్తున్నానని విశ్వాసం వెలిబుచ్చారు. నిర్మాత ఠాగూర్ మధుతో కలసి బుదవారం ఉదయం తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకోవడం జరిగిందన్నారు. ఆ స్వామివారి దర్శనం తనకెంతో ఆనందం కలిగించిందని అన్నారు. తాను నటించబోయే రాబోయే కొత్త చిత్రాలు విజయవంతం కావాలని, స్వామివారి ఆశీస్సులు పొందడానికి శ్రీవారి దర్శనం చేసుకున్నట్లు వెల్లడించారు. క్యూ లైన్లలో నిఖిల్‌ను చూసిన అభిమానులు, భక్తులు ఆలయం వెలుపల ఆయనతో ఫోటోలు, సెల్ఫీలు దిగడానికి ఆసక్తి చూపించారు.

# సాగునీటి ప్రాజెక్టులపై చర్చకు సిద్ధమా జగన్‌రెడ్డి

- మంత్రి కొల్లు రవీంద్ర సవాల్
- ఎన్ని అబద్దాలు చెప్పినా వైసిపిని ప్రజలు నమ్మరని వ్యాఖ్య



**విజయవాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** రాయలసీమపై ఇప్పుడు కపట ప్రేమ చూపుతున్న జగన్ రెడ్డి, తన పాలనలో సాగునీటి ప్రాజెక్టులకు ఎంత ఖర్చు చేశారో చెప్పగలరా అని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర సవాల్ విసిరారు. 'గత ఐదేళ్లలో రాయలసీమ ప్రాజెక్టులపై జగన్ రెడ్డి రూ.2 వేల కోట్లు ఖర్చు చేస్తే, కూటమి ప్రభుత్వం రెండేళ్లలో ఏకంగా రూ.13,500 కోట్లు ఖర్చు చేసింది. పట్టిసీమ ప్రాజెక్టు దండగ, పంపుల్ని ఇనప సామాన్లకు అమ్ముకోవడం ఉత్తమం అని విమర్శించిన జగన్, ఇప్పుడు అదే ప్రాజెక్టు కృష్ణా డెల్టా ప్రాంతంలో తాగు, సాగునీటి అవసరాలకు అండగా నిలుస్తోందనే విషయం గుర్తుంచుకోవాలి. హంద్రీనీవా ప్రాజెక్టు కోసం వేల కోట్లు ఖర్చు చేస్తూ కర్నూలు, అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు సాగునీరు అందిస్తున్నాం. వెలిగొండ ప్రాజెక్టు కోసం ఇప్పటికే రూ.8 వేల కోట్లు ఖర్చు చేశాం. నిర్వాసితులకు పరిహారం అందించే చర్యలు చేపడుతున్నాం. పురుషోత్తపట్నం ద్వారా అనకాపల్లి వరకు నీటిని తీసుకెళ్లే కార్యక్రమాన్ని కూడా ప్రభుత్వం ప్రారంభిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 36 ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇచ్చి 2029 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోంది' అని వివరించారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు, రైతుల సంక్షేమం, బిసి రిజర్వేషన్లు, డ్రగ్స్, మద్యం, పెట్టుబడులు, ఉద్యోగాల అంశాలపై జగన్ చేస్తున్న విమర్శలు రాజకీయ ప్రయోజనాల కోసమే తప్ప ప్రజల కోసం ఏ మాత్రమూ కాదని ఆరోపించారు.

రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక సాగునీటి రంగాన్ని, వ్యవసాయాన్ని ప్రథమ ప్రాధాన్యంగా తీసుకుని పాలన సాగిస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. వైసిపి నేతల కల్తీ మద్యం నుండి, గంజాయి గూండాల నుండి, డ్రగ్స్ మాఫియాల నుండి కాపాడుకుంటున్నామన్నారు. జగన్ రెడ్డికి ప్రజల పట్ల చిత్తశుద్ధి, ప్రజాస్వామ్యం పట్ల బాధ్యత ఉంటే అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించాలన్నారు. అంతేగానీ ప్రెస్‌మీట్లు పెట్టి ఆరోపణలు చేయడం సరికాదని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం తగ్గినప్పటికీ ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటోంది. కరువు పరిస్థితులు, వర్షాభావం వంటి అంశాలపై అసెంబ్లీలో క్షుణ్ణంగా చర్చించాం. ఆ సమయంలో జగన్ రెడ్డి సహా వైసిపి ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకుండా ఎందుకు పారిపోయారని ప్రశ్నించారు. రాష్ట్రంలో మంచినీటి అవసరాలు తీర్చి వ్యవసాయాన్ని కాపాడుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతుల్ని ప్రోత్సహిస్తున్నాం. గత ప్రభుత్వం రైతులకు ఏం మేలు చేసిందో జగన్ రెడ్డి సమాధానం చెప్పాలని మంత్రి కొల్లు రవీంద్ర

# రైతాంగం సంక్షోభంలో కూరుకుపోతుంటే ప్రభుత్వం స్పందించడం లేదు

### వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్ మండిపాటు



**విజయవాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** వర్షాలు కురవక, పంటలు పండక రైతాంగం సంక్షోభంలో కూరుకుపోతుంటే, నీటి విడుదల విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఏమాత్రం మానవత్వం లేకుండా ప్రవర్తిస్తున్నారని వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి ఆరోపించారు. ప్రధానంగా రాయలసీమ ప్రాజెక్టుల పట్ల కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. శ్రీశైలం జలాశయంలో ఉన్న నీటిని కరవుతో అల్లాడుతున్న రైతులకు అందించాల్సింది పోయి తెలంగాణతో పోటీపడి విద్యుత్ ఉత్పత్తి కోసమే వినియోగించడం దారుణమన్నారు. అవకాశమున్నా పోతిరెడ్డిపాడు ద్వారా రాయలసీమకు నీటిని విడుదల చేయడానికి చంద్రబాబుకు మనసు ఒప్పలేదని విమర్శించారు. సెప్టెంబర్ 15 తర్వాత వర్షాలు తగ్గుముఖం పడతాయని వాతావరణ శాఖ చెబుతున్న నేపథ్యంలో, రానున్న రోజుల్లో రాయలసీమకు నీరు ఎలా ఇస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలని నిలదీశారు. తాడేపల్లిలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో జగన్ మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కరవు భయంకరమైన పరిస్థితులకు దారితీసిందని, మొత్తం 28 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైందని జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. రాయలసీమతో పాటు కోస్తా ప్రాంతంలోనూ తీవ్రమైన అభద్రతా వాతావరణం నెలకొన్నా చంద్రబాబు ప్రభుత్వం స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. జూన్ నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో కేవలం 52 శాతం వర్షపాతం మాత్రమే నమోదైందని, మొత్తం 688 మండలాలకు గానూ 625 మండలాల్లో తీవ్ర లోటు వర్షపాతం ఉందని వివరించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల జూన్, జులై నెలల్లో తక్కువ వర్షాలు పడతాయని తెలిసినప్పటికీ పంటలకు నీళ్లిస్తామని ప్రభుత్వం ఆర్భాటం చేసిందని, వారి మాటలను నమ్మి ఎకరాకు రూ.15 వేలకు పైగా పెట్టుబడి పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంపై వైసిపి అధినేత జగన్ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. డిఎస్సీ అక్రమాలపై సిబిఐ విచారణ జరిపించాలని తమ పార్టీ విసిరిన సవాలుకు చంద్రబాబు ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి సమాధానం లేదని ఆయన ఆరోపించారు.

# నవంబర్‌లో శ్రీవారి పుష్పయాగం

- ఒక్క టికెట్‌పై ఒకే రోజు రెండుసార్లు తిరుమలేశుని దర్శనం



**తిరుమల, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల వేంకటేశ్వరస్వామి క్షణకాలంపాటు దర్శించుకుంటేనే లక్షలాదిమంది భక్తులు ఆత్మసంతృప్తి చెందుతుంటారు. ఇంకా ఆ స్వామిని మళ్ళీమళ్ళీ చూడాలనిపించి భక్తుల మనసు ఉవ్విళ్ళూరుతుంది. నవంబర్‌లో శ్రీవారి ఉత్సవమూర్తులు శ్రీదేవిభూదేవి సమేత మలయప్పస్వామికి జరిగే పుష్పయాగం రోజు ఒక్క టికెట్ పొందితే ఒకే రోజు తమ ఇష్టదైవమ్ తిరుమలేశుని రెండుసార్లు దర్శించుకునే అద్భుత అవకాశాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం కల్పించింది. శ్రీవారి ఆలయంలో నవంబరు 16న పుష్పయాగం జరగనుంది. ఈ పుష్పయాగానికి సంబంధించిన ఆర్జితసేవా టికెట్లను టిటిడి ఈ నెలలోనే విడుదల చేయనుంది. ఈ టికెట్ రూ.700లు చెల్లించి ఇద్దరు గృహస్థ భక్తులకు బుక్ చేసుకునే అవకాశం ఉంది. పుష్పయాగం టికెట్ పొందినవారు నవంబర్ 16న ఉదయం ఆరు గంటలకు తిరుమలలోని సుపథం మార్గం ద్వారా ఆలయ ప్రాంగణంలో ఉన్న కళ్యాణ మండపంలో నిర్వహించే స్నపన తిరుమంజనం అభిషేకసేవలో పాల్గొనవచ్చు. ఆ తర్వాత తిరుమల శ్రీవారిని దర్శించుకునే అవకాశాన్ని కల్పిస్తారు. మళ్ళీ అదే రోజు రెండోసారి మధ్యాహ్నం 12.30 గంటలకు ఈ టికెట్ ఉన్న భక్తులు సుపథం మార్గం క్యూలైన్లలో ప్రవేశించి మలయప్ప స్వామికి నిర్వహించే పుష్పయాగ మహోత్సవంలో పాల్గొంటారు. ఆలయంలోపల మరోసారి శ్రీవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు.

## వర్షాల కోసం 30నుండి కారీరిష్టి పర్జన్య శాంతి యాగం



**తిరుమల, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎల్‌నినో ప్రభావంతో ఇప్పటికే తక్కువ వర్షపాతం నమోదైంది. ఉపద్రవాల నుండి ప్రజలను రక్షించడానికి, నీటిసమస్య అధిగమించడానికి దీంతో ధార్మిక సంస్థ టిటిడి కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో పంటలు పండి, సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలందరూ క్షేమంగా ఉండాలని కోరుతూ ఈ నెల 30వ తేదీ నుండి ఐదు రోజుల పాటు ధర్మగిరి వేదపాఠశాలలో వరుణయాగాన్ని నిర్వహించేలా నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా వర్షాలు పడి నీటి సమస్య లేకుండా ఉండాలని ఆకాంక్షిస్తూ ధర్మగిరి వేదవిజ్ఞానపీఠం ఆధ్వర్యంలో వరుణయాగాన్ని నిర్వహించాలని ముహుర్తాన్ని నిర్ణయించారు. ఇందులో భాగంగా వేదవిజ్ఞానపీఠంలో యాగకర్త, రుత్వికుల సమక్షంలో ఆగస్టు 30, 31, సెప్టెంబరు 1, 2, 3 తేదీల్లో వరుణయాగాన్ని నిర్వహించనున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడిని ప్రార్థిస్తూ తిరుమలలో ఆగస్టు 30 నుండి వరుణయాగం (కారీరి ఇస్తి, పర్జన్య శాంతి) నిర్వహించనున్నారు. తిరుమల ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో నిర్వహించనున్న వరుణయాగంతో దేశంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, ప్రజలు సుభిక్షంగా ఉండాలని వరుణ దేవుడిని ప్రార్థించనున్నారు. మేఘాలను ఆకర్షించి కుంభవృష్టి వర్షం కురిసేలా అనుగ్రహించాలని వేదమంత్రాలతో పూజిస్తారు.

## ఎపిని వైసిపి అన్యమత ప్రదేశ్‌గా మార్చారు

### బిజెపి నేత భానుప్రకాశ్ రెడ్డి



**తిరుపతి, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** గత వైసిపి పాలనలో హిందూ ఆలయాలు, విగ్రహాలపై దాడులు చేసి అన్యమత ప్రదేశ్‌గా మార్చారని టిటిడి బోర్డు సభ్యుడు జి. భానుప్రకాశ్ రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. సనాతన ధర్మాన్ని నాశనం చేసేందుకు ఎవరు యత్నించినా తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని హెచ్చరించారు. మాజీ ఎంపి విజయసాయిరెడ్డి వైసిపిలో ఉన్నపుడే సనాతన ధర్మం గురించి మాట్లాడి ఉంటే బాగుండేదని అభిప్రాయం వెలిబుచ్చారు. వైసిపి అధినేత జగన్‌పై టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత వైసిపి ప్రభుత్వ పాలనలో ధాన్యంతో అలరారే అన్నపూర్ణ వంటి ఆంధ్రప్రదేశ్‌ను అన్యమత ప్రదేశ్‌గా మార్చేశారంటూ దుయ్యబట్టారు. గత ప్రభుత్వ హయాంలో హిందూ దేవాలయాలు, దేవతామూర్తుల విగ్రహాలపై దాడులు జరిగాయని, విగ్రహాల చేతులను సైతం ఖండించిన ఘటనలు చోటుచేసుకున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సనాతన ధర్మానికి ఎలాంటి హాని కలగకుండా కాపాడేందుకు బిజెపి కంకణబద్ధమై ఉందన్నారు. విజయసాయిరెడ్డి ఆరోజే సనాతన ధర్మం గురించి మాట్లాడి ఉంటే బాగుండేదని వ్యాఖ్యానించారు. వైసిపి నుంచి బయటకు వచ్చాక మాట్లాడితే దాని విలువ తగ్గుతుందని అన్నారు. కాకినాడలో చోటుచేసుకున్న సౌజన్య 'లవ్ జిహాద్' ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిందని, దేశంలో వేలాది మంది యువతులు ఈ నెట్‌వర్క్‌కు బలైపోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ దుర్మార్గానికి ఒడిగట్టిన సాధిక్ లాంటి వ్యక్తుల వెనుక ఉన్న అసలు సూత్రధారులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకి విజ్ఞప్తి చేశారు.

## ఆలయ అర్చకులు సస్పెన్షన్

- ఉప కమీషనర్ గోగినేని లీలా కుమార్

**పొన్నూరు, ఆగస్టు 26,ప్రభాతవార్త:** పెదకాకాని శ్రీ గంగా భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవాలయానికి సంబంధించిన పలువురు అర్చకులను సస్పెండ్ చేస్తూ దేవాలయం ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. దేవాలయంలో శ్రీ భ్రమరాంబ అమ్మవారికి సంబంధించిన బంగారపు మంగళసూత్రాలు అదృశ్యమైన వ్యవహారంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కమిషనర్ తెలిపారు. మంగళసూత్రాలు అదృశ్యమైన వ్యవహారంలో బాధ్యాతారాహిత్యం, విధి నిర్వహణలో నిర్లక్ష్యం తదితర ప్రాథమిక కారణాలపై ఆ సమయంలో విధుల్లో ఉన్న ఐదుగురు అర్చకులపై శాఖాపరమైన చర్యల్లో భాగంగా తాత్కాలికంగా విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. సస్పెండ్ అయిన వారిలో ఉప ప్రధాన అర్చకుడు చదలవాడ జాలయ్య, అర్చకులు పొత్తూరి విజయప్రతాప్, కుందుర్తి విశ్వనాథ్, చదలవాడ రుద్ర గాయత్రి మణికంఠశాస్త్రి, కాంట్రాక్టు అర్చకుడు గర్నెపూడి గిరికుమార్‌లను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ తెలిపారు.

## జగనే వెన్నుపోటు రాజకీయాలకు ప్రతిరూపం

### మంత్రి సత్యకుమార్ యాదవ్



సత్యకుమార్ యాదవ్

**విజయవాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్ వెన్నుపోటు రాజకీయాలకు ప్రతిరూపమని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆరోపించారు. ఆయన వెన్నుపోటుపై వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బుధవారం అమరావతిలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఇతరులకు నీతులు చెప్పే ముందు రాజకీయ చరిత్ర చూసుకోవాలంటూ జగన్‌కు చురకలంటించారు. జూనియర్ డాక్టర్ల స్టైపెండ్ వ్యవహారంలో వైఎస్ జగన్ వైఖరిపై మంత్రి మండిపడ్డారు. బిసి రిజర్వేషన్లపై ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ వైసిపి అధినేతపై మంత్రి సత్యకుమార్ యాదవ్ నిప్పులు చెరిగారు. రిజర్వేషన్లు ప్రకటించడం కాదు.. చట్టబద్ధంగా నిలబెట్టడమే ముఖ్యమని అభిప్రాయపడ్డారు. జగన్ హయాంలో బిసి రిజర్వేషన్లు న్యాయపరమైన చిక్కుల్లో పడ్డాయని అన్నారు. కూటమి ప్రభుత్వం బిసిలకు చట్టబద్ధమైన సామాజిక న్యాయం చేస్తోందని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. బిసిలను ఓటు బ్యాంకుగా చూసింది జగన్ ప్రభుత్వమేనని మంత్రి సత్యకుమార్ యాదవ్ గుర్తు చేశారు. బిసిలను పాలనలో భాగస్వాములుగా చేస్తుంది కూటమి ప్రభుత్వమని వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల ఓటమిపై జగన్‌లో ఇప్పుడే ఆందోళన మొదలైందంటూ ఎద్దేవా చేశారు. ఓటమికి కారణాలు వెతికే పనిలో జగన్ ఉన్నారని మంత్రి పేర్కొన్నారు. కూటమి హయాంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిష్పక్షపాతంగా జరుగుతాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ప్రజల మద్దతు కూటమి ప్రభుత్వానికే ఉందని జగన్ ఆందోళనతో మరోసారి తేలిపోయిందని మంత్రి వివరించారు.

## లొంగిపోయిన హిడ్మా గన్‌మెన్

### మరో ఇద్దరు సహచరులూ... ధృవీకరించిన పోలీసులు




**చింతూరు, ఆగస్టు 26 ప్రభాతవార్త:** రంపచోడవరం ఓఎస్‌డి పంకజ్ కుమార్ మీనా ఎదుటి ముగ్గురు మావోయిస్టులు బుధవారం లొంగిపోయారు. ఈ సందర్భంగా చింతూరు ఎఎస్‌పి. కార్యాలయంలో మీడియా సమావేశంలో ఓఎస్‌డి పంకజ్ కుమార్ మాట్లాడుతూ మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలకు విసిగిపోయి మావోయిస్టు పార్టీ ప్లాటూన్ కమిటి సభ్యురాలు ముచ్చికి మంగి, పార్టీ సభ్యులు కణితి లక్ష్మయ్య, కణితి ఎంక లొంగిపోయినట్టు ప్రకటించారు. మావోయిస్టులకు పట్టు తగ్గటం, పోలీసుల గస్తీ, క్యాంప్స్ పెరగటం వల్ల స్వేచ్ఛాగా తిరగలేక లొంగిపోయినట్టు తెలిపారు. లొంగిపోయిన వారికీ సరేండర్, రిహాబిటేషన్ పాలసి ప్రకారం ప్రశాంత జీవితం గడపటానికి ప్రభుత్వం ద్వారా అర్హత ఉన్న అన్ని సౌకర్యాలు అందించబడుతాయని అన్నారు. ఇంకా ఎవరైన అడవుల్లో, దళల్లో తిరుగుతుంటే ప్రశాంత జీవితం కోసం లొంగిపోవాలని ఆయన పిలుపునిచ్చారు. మంగి హిడమాకు అంగరక్షకురాలిగా 2023 వరకు పనిచేసి, ఆరోగ్యం సహకరించక కుంట ఎల్ఓఎస్‌లో చేరిందని తెలిపారు. ఈ సమావేశంలో ఓఎస్‌డితో పాటు దీప, సిఆర్‌పిఎఫ్ బెటాలియన్, చింతూరు సిఐ సిహెచ్ గోపాలకృష్ణ, ఎస్ఐ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

## రహదారి లేక ఎన్నాళ్లీ కష్టాలు...!

**పార్వతీపురం మన్యం జిల్లా (కొమరాడ) ఆగస్టు 26 ప్రభాతవార్త:** స్వతంత్రం వచ్చి 8 దశాబ్దాల కాలం పూర్తయిన గిరిజన గ్రామాలలో సరైన రహదారి సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు గిరిశిఖర గ్రామాలలో ఈ ఒక్కరికి సుస్తి చేసినా డోలిపై కానీ భుజలపై గాని మోసుకుంటూ కిలోమీటర్ల కొలది నడుచుకుంటూ మైదాన ప్రాంతానికి వచ్చి వైద్యం పొందవలసిన దుస్థితి ఉంది. పార్వతీపురం మన్యం జిల్లాలో రోడ్డు మార్గలు లేక గిరిశిఖర గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్షం కురిస్తే చాలు వారి కష్టాలు మరింత రెట్టింపవుతున్నాయి. జబ్బుచేస్తే దవాఖానకు వెళ్లాలంటే కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. తాజాగా కొమరాడ మండలం చోళ్లపదం గ్రామ పంచాయతీ వనధార గ్రామంలో జ్వరంతో ఉన్న యశ్వంత్ అనే బాలుడిని భుజాన మోసుకుని 5 కిలోమీటర్లు నడిచి వెళ్లిన దృశ్యం ప్రతి ఒక్కరిని కదిలించింది. రోడ్డు మార్గం లేకపోవడంతో వాగులు వంకలు దాటుతూ 5 కిలోమీటర్లు నడిచి మైదాన ప్రాంతంలో ఉన్న కూనేరు రాంబద్రపురం హాస్పిటల్‌కు తీసుకువెళ్లి వైద్యం చేయించాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి నిర్మించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

## వ్రతం చేశారు బంగారం మురికి కాలువలో పడేశారు!

**విశాఖపట్నం ఆగస్టు 26 ప్రభాతవార్త:** పండగ పూట ఎంతో భక్తితో అమ్మవారికి అలంకరించిన బంగారు నగలను పొరపాటున పూలతో పాటు డ్రైనేజీ కాలువలో పడేసింది ఓ కుటుంబం. తీరా విషయం తెలుసుకుని లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించగా, వారు రంగంలోకి దిగి గంటలపాటు శ్రమించి ఆ నగలను వెలికితీసి అప్పగించారు. విశాఖపట్నంలోని గాజువాకలో జరిగిన ఈ ఆసక్తికర ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. గాజువాక శ్రీనగర్‌కు చెందిన ఉడుముల రమేశ్, దివ్య దంపతులు ఈ నెల 21న అత్యంత భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి సుమారు 8 తులాల బంగారు ఆభరణాలతో అలంకారం చేశారు. ఆనవాయతీ ప్రకారం మూడు రోజుల పాటు నగలను అమ్మవారి వద్దనే ఉంచారు. ఆదివారం (23వ తేదీ) పూజా సామాగ్రిని తొలగించే క్రమంలో రమేశ్.. అమ్మవారికి అలంకరించిన 3 తులాల హారం, కాసులను మాత్రమే తీసి భద్రపరిచారు. అయితే, పూలు, ఇతర పూజా సామగ్రిలో కలిసిపోయిన సుమారు 5 తులాల బరువున్న కంకణం, రెండు గొలుసులు, మూడు ఉంగరాలను ఆయన గమనించలేదు. నిర్మల్యం మొత్తాన్ని ఒక ఎర్రటి వస్త్రంలో చుట్టి, దుర్గా నగర్ సమీపంలోని స్టీల్ ప్లాంట్ రైల్వే బ్రిడ్జి కింద ఉన్న డ్రైనేజీ కాలువలో పడేశారు. ఇంటికి వెళ్ళిన తర్వాత నగలు కనిపించకపోవడంతో వారికి అనుమానం వచ్చింది. వెంటనే కాలువ వద్దకు పరుగులు తీసి వెతికినా ఫలితం లేకపోవడంతో, స్టీల్ ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తక్షణమే స్పందించిన సీఐ కేశవరావు, సిబ్బందిని రంగంలోకి దించారు. జేసీబీ సహాయంతో కాలువలో నీటి ప్రవాహాన్ని మళ్లించి, వేగాన్ని తగ్గించారు. అనంతరం కాలువలో చెల్లాచెదురుగా పడి ఉన్న నగలను సిబ్బంది ఒక్కొక్కటిగా వెలికితీశారు. ఆ ఆభరణాలను దంపతులకు సురక్షితంగా అప్పగించారు. పోయాయనుకున్న బంగారం తిరిగి చేతికి అందడంతో ఆ కుటుంబం ఆనందానికి అవధులు లేకుండా పోయింది. పోలీసులకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పండగలు, పూజల సమయంలో విలువైన వస్తువుల పట్ల ప్రజలు

## అంతా మంచి జరగాలని శ్రీవారి ఆశీస్సులందుకున్నాం



**తిరుమల, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగురాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో వుండాలని, రాష్ట్ర ప్రజలకు అంతా మంచి జరగాలని తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారిని ప్రార్థించినట్లు పలువురు ప్రముఖులు తెలిపారు. బుధవారం ఉదయం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని తమిళనాడు ప్రభుత్వ అదనపు కార్యదర్శి డాక్టర్ అముద, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటేశ్‌నాయక్, సినీనటుడు సమీర్ హాసన్, అపర్ణారావు కుటుంబసభ్యులతో కలసి వేర్వేరుగా స్వామివారిని దర్శించుకున్నారు. కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. శ్రీవారి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

27-8pg7exHMNWJQE:27-8pg7exHMNWJQE.qxd 8/26/2026 11:18 PM Page 1



# తిరుపతిలో కుప్పకూలిన నాలుగు అంతస్తుల భవనం

### ముగ్గురు కార్మికులకు గాయాలు



**తిరుపతి, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** నిర్మాణంలో ఉన్న పక్క భవనానికి ఆనుకుని ఉన్న పాత భవనం ఉన్నఫళంగా కూలిపోయింది. ఈ ప్రమాదంలో ప్రాణనష్టం తప్పింది. నాలుగంతస్థుల భవనానికి బీటలు వారడంతో ఆ ఇంట్లో ఉంటున్న సభ్యులు ఖాళీచేసిన కొన్ని గంటల్లోనే ఈ సంఘటన జరగడం విశేషం. ఈ సంఘటనతో ఏం జరిగిందనే కలకలం రేగింది. తిరుపతి- పచ్చికాపల్లం ప్రధాన మార్గంలో ఎంఆర్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు సమీపంలోని వాణీనగర్‌లో కలశం బిల్డింగ్ పక్కనే ఈ ప్రమాదం జరిగింది. భవనం కూలిపోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. నూతన భవనం నిర్మాణం కోసం పక్కనే గుంత తవ్వుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. గుంత తవ్వకాల్లో భాగంగా భవనం పునాదులు బలహీనపడటంతోనే కూలిపోయాయి. భవనం కూలిపోవడంతో భారీగా ఆస్తి నష్టం సంభవించింది. సమాచారం అందుకున్న రెస్క్యూ సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని శిథిలాలను తొలగించే పనులు చేపట్టారు. శిథిలాల కింద ఎవరూ లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. నూతన భవన నిర్మాణం కోసం గుంతలు తవ్వడం వల్ల పునాదులు బలహీనపడి, కూలిన భవనానికి బీటలు వారడంతోనే కూలిపోయిందని అధికారులు నిర్ధారణకు వచ్చారు.

## కాకినాడలో దారుణ హత్య

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రత్యేక ప్రతినిధి, ఆగస్టు 26 ప్రభాతవార్త:** కాకినాడ నగరం నడిబొడ్డున ఉన్న భానుగుడి సెంటర్‌లో బుధవారం తెల్లవారుజామున సుమారు 2 గంటల ప్రాంతంలో ఒక యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. మృతుడు కోడమాటి సతీష్ రెడ్డి (30)గా పోలీసులు గుర్తించారు. సతీష్ కాకినాడలో జిమ్ ట్రైనర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. భానుగుడి సెంటర్‌లోని చార్మినార్ టీ స్టాల్ సమీపంలో సతీష్ రెడ్డిపై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడినట్లు తెలిసింది. కత్తితో మెడ భాగంలో పొడిచి హత్య చేసినట్లు ప్రాథమిక సమాచారం. హత్యకు అక్రమ సంబంధం, ఆర్థిక లావాదేవీలు కారణమై ఉండవచ్చన్న కోణంలో కాకినాడ టూ టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పెరుగుతున్న పశ్చిమాసియా ఉద్రిక్తతలు

### ఇరాన్‌పై మరింత కఠినంగా అమెరికా ఆంక్షలు

**టెహ్రాన్, ఆగస్టు 26:** అమెరికా– ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత ముదురుతున్నాయి. ఇరాన్‌పై ఆర్థిక ఒత్తిడిని అమెరికా మరింత పెంచుతుండగా, గల్ఫ్ ప్రాంతం లోని ఇంధన సరఫరాలపై ప్రతీ కార చర్యలు తీసుకుంటామని ఇరాన్ హెచ్చరిస్తోంది. మరోవైపు, వ్యూహాత్మకమైన హోర్ముజ్ జలసంధిపై నియంత్రణ విషయంలో ఇరు దేశాల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రాంతంలో చోటుచేసుకుంటున్న కీలక ఇరాన్‌పై అమెరికా ఆంక్షలు మరింత కఠినం చేసింది. ఇరాన్ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన ఆదాయ మార్గాలను దెబ్బతీయడంతో పాటు, టెహ్రాన్‌ను అంతర్జాతీయంగా మరింత ఒంటరిచేసే లక్ష్యంతో అమెరికా విస్తృత స్థాయిలో కొత్త ఆంక్షలను అమలు చేస్తోంది. అమెరికా ఒత్తిడి, పెరుగుతున్న ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో ఇరాన్ కరెన్సీ విలువ మరోసారి రికార్డు కనిష్ఠానికి పడిపోయింది. దీంతో ఇప్పటికే సంక్షోభంలో ఉన్న ఇరాన్ ఆర్థిక పరిస్థితులు మరింత దిగజారుతున్నాయి. దీంతో ప్రపంచ వాణిజ్యం, ఇంధన సరఫరాలపై ఆందోళనలు పెరుగుతున్నాయి.ఇరాన్‌పై ఒత్తిడికి మిత్రదేశాలు కలిసిరావాలని అమెరికా పిలుపుఆంక్షలను మరింత కఠినతరం చేస్తున్న నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలు ఇరాన్‌తో ఆర్థిక, ఆర్థిక సంబంధాలను తెంచు కోవాలని ట్రంప్ ప్రభుత్వం కోరుతోంది. హార్ముజ్ జలసంధిలో కొనసాగుతున్న అంతరాయాల నేపథ్యంలో అమెరికా వ్యూహాత్మక పెట్రోలియం నిల్వల నుంచి మరోసారి భారీగా చమురు విడుదలైంది. దీంతో ఆ నిల్వలు 1982 తర్వాత ఎన్నడూ లేనంత కనిష్ఠ స్థాయికి చేరుకున్నాయి.

# పార్లమెంట్ పరిధిలో సమన్వయంతో పనిచేద్దాం

### టిడిపి శ్రేణులకు పనబాక లక్ష్మి హితవు



**తిరుపతి, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి పార్లమెంట్ పరిధిలో అన్ని నియోజకవర్గాల్లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవ్వాలని పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని, వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని తెలిపారు. బుధవారం తిరుపతి పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు చెందిన టిడిపి కేడర్ నాయకులతో పార్లమెంట్ కార్యాలయంలో పనబాక లక్ష్మి సమావేశమయ్యారు. పార్లమెంట్ స్థాయి కమిటీలో తిరుపతి పార్లమెంట్ పరిధిలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, సత్యవేడు నియోజకవర్గం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి, తిరుపతి ఇన్‌చార్జ్ జెబి శ్రీనివాస్, పార్లమెంట్ కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఆయా నియోజకవర్గాల్లో పార్టీ కార్యక్రమాల అమలు, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు తమ నియోజకవర్గాలకు సంబంధించిన అభిప్రాయాలు, సూచనలు, సలహాలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేరవేయాలని సమావేశంలో చర్చించారు. అలాగే రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ, నాయకులు- కార్యకర్తల మధ్య సమన్వయంతో ముందుకు సాగాలని నిర్ణయించారు. నాయకులు స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనిచేయాలని నిర్దేశించారు.

# ఉత్కంఠగా అమరావతి ఛాంపియన్ షిప్ పోటీలు



**తిరుపతి, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతిలో నాలుగురోజులు పాటు జరుగుతున్న అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీలు పలు జిల్లాల క్రీడాకారుల మధ్య ఉత్కంఠగా సాగుతోంది. ఈ పోటీలు బుధవారం మూడో రోజు అనేక అంశాలపై క్రీడాకారులు తమ ప్రతిభను కనబరిచారు. రాష్ట్రస్థాయి అమరావతి ఛాంపియన్‌షిప్ క్రీడా పోటీలు సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఇందులో కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్‌బాల్, హాకీ, బ్యాడ్మింటన్ జట్లు క్రీడాకారులు హోరాహోరీగా తలపడుతున్నారు. రాష్ట్రస్థాయి అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీలను తిలకించేందుకు తిరుపతి యువత, విద్యార్థులు భారీగా తరలివస్తున్నారు.సందర్శకులతో తిరుపతి క్రీడా మైదానాలు సందడిగా మారాయి. విజయమే లక్ష్యంగా ఉత్సాహంగా బరిలోకి దిగుతున్న క్రీడాకారులు. ఖో ఖో అండర్ 23క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో శ్రీకాకుళం మీద 3 పాయింట్స్‌తో విజయనగరం గెలుపొందింది. అండర్ 17 మహిళల విభాగంలో బాస్కెట్బాల్ కాకినాడ జట్టుపై పల్నాడు జిల్లా జట్టు హోరాహోరీగా తలపడగా పల్నాడు జట్టు విజయం సాధించి సెమీఫైనల్‌కు దూసుకెళ్ళింది. బాస్కెట్ బాల్ అండర్ 17 బాలికల విభాగంలో గుంటూరు, పశ్చిమగోదావరి జట్టుల క్వార్టర్స్‌లో పోటాపోటీగా తలపడుతూ, తమ ప్రతిభను చాటుకుంటున్నారు. ఖో ఖో అండర్ 23 క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో చిత్తూరు మీద 105 పాయింట్స్‌తో అనంతపురం గెలుపొందింది. అండర్ 23 పురుషుల హాకీ జట్టులో విశాఖపట్నం జట్టుపై అనకాపల్లి జిల్లా జట్టు విజయం సాధించింది. హాకీ అండర్ 23 పురుషుల విభాగంలో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా మూడవ క్వార్టర్స్ ఫైనల్‌లో హోరాహోరీగా తలపడుతూ, తమ ప్రతిభను చాటుకున్నారు. అండర్–17 మహిళల వాలీబాల్ క్వార్టర్ ఫైనల్స్‌లో సత్యసాయి- ఎన్టీఆర్ జిల్లాల జట్ల క్రీడాకారులను శాప్ చైర్మన్ రవి నాయుడు పరిచయం చేసుకున్నారు. అనంతరం మ్యాచ్‌ను ప్రారంభించి, ఇరు జట్ల క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. క్రీడాస్ఫూర్తితో ప్రతిభను ప్రదర్శించి విజయాన్ని సాధించాలని ఆకాంక్షి ంచారు. వాలీబాల్ అండర్ 17 గర్ల్స్ ఎన్టీఆర్ జిల్లా పై

# వృద్ధురాలి హత్య కేసు నిందితుల అరెస్ట్

- బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనంకేసు ఛేదనలో పోలీసు డాగ్, సిసి కెమెరాల పుటేజీలు కీలకం



**శ్రీకాకుళం, ఆగస్టు 26 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం అల్లాడపేట గ్రామానికి చెందిన చింతు చిన్నమ్మడు(70) హత్య కేసును శ్రీకాకుళం జిల్లా పోలీసులు ఛేదించారు. నిందితులను అరెస్టు చేసి, మృతురాలి వద్ద నుంచి అపహరించిన సుమారు రూ.38 లక్షల విలువైన 24 తులాల బంగారం, 6 తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం, మృతురాలు హైదరాబాద్‌లో నివసిస్తూ అప్పుడప్పుడు తన స్వగ్రామమైన అల్లాడపేటకు వచ్చి వెళ్తుండేది. ఈ క్రమంలో ఆగస్టు 11న గ్రామానికి వచ్చిన ఆమె, 17న గ్రామంలో జరిగిన కార్యక్రమానికి బంగారు ఆభరణాలు ధరించి హాజరై, అనంతరం ఆర్టీసీ బస్సులో నరసన్నపేటకు చేరుకుంది. అక్కడ సుమారు ఉదయం 11.30 గంటలకు కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం నిమిత్తం లాయర్ ధనలక్ష్మి ఇంటికి వెళ్లింది. అనంతరం ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో జలుమూరు పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో, మృతురాలు ధరించిన బంగారు ఆభరణాలను కాజేయాలనే ఉద్దేశంతో బెండి అచ్యుతరావు, కింతలి ధనలక్ష్మి, గణేష్ తదితరులు పథకం రూపొందించినట్లు పోలీసులు గుర్తించారు. పథకం ప్రకారం మృతురాలిపై దాడి చేసి హత్య చేసిన అనంతరం ఆమె వద్ద ఉన్న బంగారు, వెండి ఆభరణాలను అపహరించి, మృతదేహాన్ని గోనె సంచిలో ఉంచి తరలించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. మృతదేహాన్ని హిరమండలం మండలం పింద్రువాడ సమీపంలోని బ్రిడ్జి కింద తంపర కాలువలో పడవేసినట్లు గుర్తించారు. అనంతరం నిందితులు అపహరించిన సొత్తును తమ మధ్య పంచుకున్నట్లు దర్యాప్తులో తేలింది. దీంతో మిస్సింగ్ కేసును హత్య కేసుగా మార్చి, హత్యకు దోపిడీ ఉద్దేశం ఉన్నట్లు నిర్ధారించి మర్డర్ ఫర్ గైన్ కేసుగా దర్యాప్తు కొనసాగించారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తులో భాగంగా సిసి కెమెరాలు, సాంకేతిక ఆధారాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ దర్యాప్తు మరియు క్షేత్రస్థాయి సమాచారాన్ని సమన్వయం చేస్తూ పోలీసులు కేసును ఛేదించారు. సిడిఆర్ విశ్లేషణ, ట్రాకర్ డాగ్ సహాయం, కారు ట్రాకింగ్ హిస్టరీ, డ్రోన్, క్లూస్ టీమ్ విశ్లేషణ, స్థానిక సమాచారం సేకరణపై ఆధారాలను సమగ్రంగా విశ్లేషించి నిందితుల కదలికలు, పాత్రను నిర్ధారించి, బుధవారం ఉదయం సుమారు 9.00 గంటల సమయంలో తిలారు రైల్వే స్టేషన్ వద్ద నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.38 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలతో పాటు, నేరానికి ఉపయోగించిన తెల్లని కారు, బజాజ్ పల్సర్, రాయల్ ఎన్‌ఫీల్డ్ ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

# నేటి నుండి వ్యాసాశ్రమ శతాబ్దిఉత్సవాలు

- వాయిదా వేసుకోవాలని అధికారుల సూచన

**ఏర్పేడు, ఆగస్టు 26 ప్రభాతవార్త :** ఏర్పేడు మండల కేంద్రంలోని వ్యాసాశ్రమంలో నేటి నుండి వారం రోజుల పాటు జరిగే ఉత్సవాలకు పోలీస్ బందోబస్తు అందించాలంటూ ఆశ్రమ కోశాధికారి ఎ.అమర్‌నాథ్‌రెడ్డి జిల్లా ఎస్పిని అభ్యర్థించారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన దేవాదాయ శాఖ, రెవెన్యూ, పోలీస్ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశం తరువాత జిల్లా కలెక్టర్ జారీ చేసిన ఆదేశాల మేరకు ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఆశ్రమ నిర్వాహకులు శతాబ్దిఉత్సవాలను వాయిదా వేసుకోవాలని సూచించారు. ఆశ్రమ పాలకవర్గం పూర్వ విద్యార్థులు, భక్తుల మధ్య యాజమాన్య వివాదాలు పరిష్కారం కాలేదని, గతంలో జరిగిన ఘర్షణ వాతవావరణం పరస్పర ఆరోపణల నేపథ్యంలో శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం వున్నందున, ఆశ్రమం నిర్ణయించిన షెడ్యూల్‌లో బందోబస్తు నిర్వహించడం సాధ్యపడదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఆశ్రమ నిర్వాహకులు శతాబ్ది ఉత్సవాలను రీషెడ్యూల్ చేసుకోవాలని జిల్లా యంత్రాంగం సూచించింది. పోలీస్ బలగాల లభ్యత గురించి వివరణ ఇస్తూ టిటిడి దేవస్థానం పాలకోత్సవం, నవరాత్రి బ్రహ్మోత్సవాలు, వినాయక చవితి తదితర పండగల బందోబస్తు వున్న కారణంగా ఆశ్రమానికి తగినంత బందోబస్తు కేటాయించడం కష్టమని నిర్ణయిం చారు. ముందస్తు సమాచారం ఇవ్వక ఖరారు చేయడం వల్ల బందోబస్తు ఇవ్వలేమంటూ స్పష్టం చేశారు. కార్యక్రమాలు ఖరారు చేసే ముందు నిర్వాహకులు పూర్తి వివరాలు, భక్తుల సంఖ్య అంచనా అందించాల్సి వుంది. సాధ్యమైనంత వరకు ఆశ్రమం శాంతిభద్రతల దృష్ట్యా వాయిదా వేసుకోవాలని సూచించారు. అయితే ఇరువర్గాలు రెచ్చకొట్టే వ్యాఖ్యాలు ఆరోపణలు చేయరాదని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించి శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఈ మేరకు రేణిగుంట డిఎస్‌పి ఏర్పేడు ఎస్‌హెచ్‌ఓలకు కూడా జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

## టిటిడి షాపుల టెండర్లలో రసాభాస

**తిరుపతి,ఆగస్టు 26ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలో టిటిడి కేటాయించే దుకాణాల టెండర్లలో రసాభాస చోటుచేసుకుంది. ఆన్‌లైన్‌లో టెండర్లు పిలిచిన టిటిడి ఎస్టేట్ విభాగం ఈ టెండర్లను బుదవారం తెరచి నిబంధనల మేరకు కేటాయించేందుకు చర్యలు తీసుకుంది. తిరుపతిలో టిటిడికి సంబంధించి శ్రీనివాసం వసతి సముదాయం, విష్ణునివాసం తదితర ప్రాంతాల్లో ఈ దూకాణాలకు ఇటీవల టెండర్లు పిలిచింది. అర్హులైన వ్యాపారులు టెండర్లను దాఖలు చేశారు. టెండర్ల పరిశీలనలో టెండర్ షెడ్యూల్లలో ప్రతి పేజీ లో సంతకం చేయలేదన్న కారణంగా రెండు వందలకు పైగా టెండర్ షెడ్యూల్లు తిరస్కరణకు గురయ్యాయని సమాచారం. టెండర్ నిబంధనల్లో ఎక్కడా ప్రతి పేజీలో సంతకం చేయాలని పేర్కొనలేదని వ్యాపారులు వాపోతున్న. దుకాణాల కేటాయింపుల్లో ఇలా చేయడం మతలబు ఏంటని అధికారులతో వాదనకు దిగారు. దీంతో అక్కడి వ్యాపారులను వెలుపలికి పంపించారు. అలిపిరి, శ్రీనివాసం, విష్ణునివాసం తదితర ప్రాంతాల్లో దుకాణాలకు షీల్డ్ టెండర్లు పిలిచిన టిటిడి దుకాణాల టెండర్లలో వ్యాపారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నడం కారణంగానే కొంత మతలబు జరిగిందనేది తెలుస్తోంది,. ఈవిషయంగా సంబంధిత అధికారులను సంప్రదించడానికి ప్రయత్నించినా స్పందన లేదు.

## దుర్గమ్మ ఆలయంలో నేటి నుండి పవిత్రోత్సవాలు



**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 26, ప్రభాతవార్త :** దుర్గమ్మ ఆలయంలో ఈనెల 27 నుండి పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. శ్రీ పరాభవ నామ సంవత్సర పవిత్రోత్సవాలు సందర్భంగా గురువారం మొదటి రోజు తెల్లవారుజామున అమ్మవారికి స్నపనాభిషేకం, పవిత్ర మాలాధారఉదయం 8 గంటల తర్వాతే భక్తులకు అమ్మవారి దర్శనం వుంటుందన్నారు. **పవిత్రోత్సవం వివరాలు:** ఆలయంలో నిత్య కైంకర్యాలు, అర్చనలు, పూజలు జరిగే సమయంలో తెలిసి లేదా తెలియక జరిగే దోషాలు, స్పర్శ దోషాలు,లోపాలు,అశుచులు తొలగిపోయి ఆలయ పవిత్రత పరిపూర్ణంగా నిలిచేందుకు ఆగమ శాస్త్రోక్తంగా ప్రతి ఏటా నిర్వహించే విశేష మహోత్సవమే ఈ పవిత్రోత్సవం. రంగురంగుల పట్టు దారాలతో ప్రత్యేకంగా రూపొందించిన పవిత్ర మాలలను ప్రధాన దేవతలకు, పరివార దేవతలకు ధరింపజేసి, హోమ క్రతువులు నిర్వహించడం ద్వారా ఇంద్రకీలాద్రి క్షేత్రానికి విశేషమైన ఆధ్యాత్మిక తేజస్సు సమకూరుతుందని పురాణోక్తి. ఉత్సవాల మొదటి రోజైన ఆగస్టు 27 (గురువారం) తెల్లవారుజామున 3 గంటలకు శ్రీ కనకదుర్గ అమ్మవారి ప్రధాన ఆలయంలో శాస్త్రోక్తంగా సుప్రభాత సేవ నిర్వహిస్తారు. అనంతరం శ్రీ అమ్మవారి మూలవిరాట్‌కు అర్చక పండితులు వేద మంత్రోచ్ఛారణల మధ్య దివ్యమైన స్నపనాభిషేకం, పవిత్ర మాలాధారణ మహోత్సవాన్ని జరిపిస్తారు. ప్రధాన ఆలయంలో సుప్రభాత సేవ, స్నపనాభిషేకం, పవిత్రాలంకరణ క్రతువులు పూర్తయ్యేంత వరకు దర్శనాలు నిలిపివేయబడతాయని, ఉదయం 8 గంటల తర్వాతే భక్తులకు శ్రీ అమ్మవారి సర్వదర్శనం కల్పించడం జరుగుతుందని ఇఓ శీనానాయక్ తెలిపారు. పవిత్రోత్సవాల సందర్భంగా నిర్వహించే వివిధ వైదిక హోమాలు, జపాలు,మూల మంత్ర హవనములు తదితర కార్యక్రమాలు దేవస్థానంలో నిర్వహిస్తామన్నారు. దుర్గమ్మ సేవలో ఎన్నికల అధికారి ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ డా పవన్ కుమార్ శర్మ, విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం దర్శించుకున్నారు.

**ఇంద్రకీలాద్రిపై అన్నప్రసాదం ప్రైవేటీకరణ అవాస్తవం:**

దుర్గమ్మ ఆలయంలో ప్రైవేటుకు ప్రసాదం అనే అంశం అవాస్తవం, నిరాధారమైనదని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇఓ వికె శీనా నాయక్ స్పష్టం చేశారు. భక్తులకు అందించే పవిత్ర అన్నప్రసాద వితరణను ఏ ప్రైవేట్ సంస్థకూ అప్పగించడం లేదని, భక్తులకు అత్యంత పరిశుభ్రమైన వాతావరణంలో ఆరోగ్యకరమైన, నాణ్యమైన, రుచికరమైన అన్నప్రసాదం అందించేందుకు దేవస్థానం ముందుచూపుతో ఆలోచన చేసి అత్యాధునిక స్టీమ్ ఆధారిత వంటశాల పరికరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుందని వివరించారు. రూ.36.82 లక్షల దేవస్థాన నిధుల ఆదా తిరుమల తిరుపతి దేవస్థానంలో మెకనైజ్డ్ కిచెన్ ఏర్పాటు చేసిన టెక్నోలాజిక్ ఇంజనీర్స్ ఇండియా ప్రై.లి. సంస్థ ఈ పరికరాల సరఫరా, ఇన్‌స్టాలేషన్ కొరకు రూ. 2,31,82,668/ (జీఎస్టీ, రవాణా ఖర్చులు అదనం) కోట్ చేసింది. దేశవ్యాప్తంగా లక్షలాది మందికి పరిశుభ్రమైన వంటశాలలను విజయవంతంగా నిర్వహిస్తున్న అనుభవం కలిగిన హారేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ / అక్షయపాత్ర ఫౌండేషన్ వారు అదే ఆధునిక పరికరాలను కేవలం రూ. 1.95 కోట్లకు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చారని, దీని ద్వారా దేవస్థానానికి ఏకంగా రూ. 36,82,668 నిధులు ఆదా అవుతాయన్నారు. ఈ ప్రతిపాదనను ఆలయ ధర్మకర్తల మండలి క్షుణ్ణంగా పరిశీలించి ఆమోదించగా, ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందన్నారు. నిత్యాన్నదాన పథకానికి విరాళం దుర్గమ్మ ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి రు.1,00,150ల విరాళాన్ని విజయవాడకు చెందిన పి యశ్వంత్, కుటుంబ సభ్యులు బుధవారం అందించారు. దాతలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు. దుర్గమ్మ ఆలయానికి ఆధునిక ప్రింటర్ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి అత్యాధునిక ప్రింటర్ కం జిరాక్స్ మెషిన్ విరాళంగా ఆర్‌వీ డిజిటల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తమ నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న శుభ సందర్భంగా సుమారు రూ. 1,01,000 విలువైన అత్యాధునిక ప్రింటర్ కం జిరాక్స్ మెషిన్‌ను విరాళంగా బుధవారం చైర్మన్ బొర్రా రాధాకృష్ణకు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రామదుగు వెంకట్రావు అందజేశారు. దాతలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# తిరుపతి మేయర్ సీటు కోసం యువత ఉరకలు!

- జీరో బడ్జెట్ రాజకీయాల వైపు చూపు
- యువతకు ప్రాధాన్యమంటున్న ప్రధాన పార్టీలు




**తిరుపతి, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి మేయర్ పీఠం కోసం రాజకీయ పార్టీల్లో కొత్త తరం నేతలు ఉరకలు వేస్తున్నారు. డబ్బు, అంగబలం కంటే ప్రజాసేవ, యువతతో అనుసంధానం, విద్యార్హతలు, సామాజిక సేవ వంటి అంశాలకు ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో ఈసారి మేయర్ రేసు గతంతో పోలిస్తే మరింత ఆసక్తికరంగా మారనుంది. తమిళనాడు రాజకీయాల్లో కనిపిస్తున్న కొత్త తరహా రాజకీయాల ప్రభావం, జెన్‌జీ ఓటర్ల ప్రాధాన్యం, 'జీరో బడ్జెట్ పాలిటిక్స్‌'పై పెరుగుతున్న చర్చ యువ ఆశావహుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి. డబ్బు తీసుకోకుండా ఓటు వేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన పిలుపు కూడా ఈ చర్చకు ఊతమిచ్చింది. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ యువతకు ప్రాధాన్యతనిస్తుండటం, వైసిపి అధినేత వైఎస్ జగన్ కూడా జెన్‌జీ యువతకు పెద్దపీట వేయాలనే సంకేతాలు ఇవ్వడం తిరుపతిలోని యువ రాజకీయ ఆశావహుల్లో ఆశలు పెంచుతున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే మేయర్ ఎన్నికల్లో కొత్త ముఖాలకు అవకాశం దక్కుతుందా? అన్నది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**మూడు సామాజిక వర్గాల మధ్యే పోటీ:** తిరుపతి రాజకీయాల్లో తొలి నుంచీ ప్రధానంగా రెడ్డి, బలిజ సామాజిక వర్గాల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతూ వచ్చింది. ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ వంటి కీలక పదవుల్లో ఈ సామాజిక వర్గాలకు చెందిన నేతలు పలుమార్లు విజయం సాధించారు. అయితే 2021లో తొలిసారిగా జరిగిన తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బిసి-యాదవ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ ఆర్. శిరీష యాదవ్ మేయర్‌గా ఎన్నిక కావడం కొత్త సమీకరణాలకు తెరతీసింది. వచ్చే ఎన్నికల్లో మేయర్ పదవి కోసం కూటమి పార్టీలతో పాటు వైసిపి,, కాంగ్రెస్ పార్టీల నుండి బలిజ, రెడ్డి, యాదవ సామాజిక వర్గాలకు చెందిన పలువురు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం.

**కూటమిలో 'మేయర్ష్'పై మిత్రపక్షాల మల్లగుల్లాలు:** 2024 అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి తరఫున జనసేన అభ్యర్థి శ్రీనివాసులు విజయం సాధించడంతో ఈసారి మేయర్ స్థానం టిడిపికి కేటాయించాలని ఆ పార్టీ నేతలు పట్టుబడుతున్నట్టు తెలుస్తోంది. అయితే తమకే అవకాశం ఇవ్వాలని జనసేన కూడా కోరుతున్నట్టు సమాచారం. దీంతో మేయర్ సీటు ఎవరికి దక్కాలన్న అంశంపై కూటమిలో అంతర్గత చర్చలు మొదలైనట్టు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. కూటమి అధిష్ఠానం మూడు పార్టీల కీలక నేతల అభిప్రాయాలను సేకరించే ప్రయత్నం చేసినట్టు ప్రచారం జరుగుతోంది.

**అనితా యాదవ్‌కు అనగాని ఆశీస్సులు:** ఈ నేపథ్యంలో టిడివి రాష్ట్ర కార్యదర్శి అన్నా అనితా యాదవ్ పేరు టిడిపి మేయర్ అభ్యర్థిగా ప్రముఖంగా వినిపిస్తోంది. గత ఎన్నికల్లో వైసిపి నుండి కార్పొరేటర్‌గా గెలిచిన ఆమె డిప్యూటీ మేయర్ పదవిని ఆశించి కొంతమంది కార్పొరేటర్లతో కలిసి టిడిపిలో చేరారు. అయితే ఆ పదవి టిడిపికి చెందిన ఆర్‌సి మునికృష్ణకు దక్కడంతో ఆమెకు మేయర్ అవకాశం కల్పించాలనే అభిప్రాయం పార్టీలోని కొందరు నేతల్లో వ్యక్తమవుతోంది. ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్ కూడా ఆమెకు అనుకూలంగా ఉన్నట్టు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇదే సమయంలో జెసీఐ ఇండియా అంతర్జాతీయ డైరెక్టర్ డాక్టర్ ఎన్.బి. హర్షవర్ధన్ రెడ్డి పేరు కూడా మేయర్ రేసులో వినిపిస్తోంది. ఆయనకు అవకాశం కల్పించాలని ఆయన తండ్రి, మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.బి. సుధాకర్ రెడ్డి చంద్రబాబు నాయుడును కోరినట్టు సమాచారం. హర్షవర్ధన్ రెడ్డి ఐదు క్రీడల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుకోవడంతో పాటు ఐఐఎంలో విద్యాభ్యాసం, ఐటీలో అంతర్జాతీయ స్థాయి బాధ్యతలు, వివిటీలో పీహెచ్‌డీ వంటి విద్యా, వృత్తిపరమైన నేపథ్యాన్ని కలిగి ఉన్నారు. 20కి పైగా దేశాల్లో పర్యటించిన అనుభవంతో పాటు యువతతో అనుసంధానం, సామాజిక కార్యక్రమాల్లో చురుకుదనం తనకు కలిసొచ్చే అంశాలుగా ఆయన అనుచరులు భావిస్తున్నారు. బలిజ సామాజిక వర్గానికి చెందిన విద్యా సంస్థల అధిపతి పెనుమాడు ప్రణీత్ కూడా మేయర్ పదవిపై ఆసక్తి చూపుతున్నట్టు సమాచారం. చాలాకాలంగా టిడిపితో అనుబంధం ఉన్న ఆయన నగరంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి పదవిని ఆశించినా అవకాశం దక్కకపోవడంతో ఇప్పుడు మేయర్ రేసుపై దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ఇక మాజీ కార్పొరేటర్ యువనేత నరసింహాచారి కూడా పోటీలో ఉండనున్నారు.

**జనసేనలోనూ యువ ముఖాల వేట:** జనసేనకు మేయర్ స్థానం దక్కితే ఎమ్మెల్యే శ్రీనివాసులు కుమారుడు ఆరణి మదన్‌ను రంగంలోకి దించాలనే ఆలోచన ఆయన సన్నిహిత వర్గాల్లో ఉన్నట్టు సమాచారం. యువతను ముందుకు తీసుకురావాలన్న పార్టీ విధానం, భవిష్యత్ నాయకత్వాన్ని ఇప్పటి నుంచే తీర్చిదిద్దాలన్న ఆలోచనతో ఆయన పేరును పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. మరోవైపు తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్ రాయల్ పేరు కూడా జనసేనలో వినిపిస్తోంది. తిరుపతిలో ఆయనకు ఓటు బ్యాంకు, పట్టుకలిగి ఉండటంతో టివి చర్చల్లో వైసిపి నేతలపై ఘాటైన విమర్శలు చేస్తూ గుర్తింపు పొందిన ఆయనకు పార్టీ అవకాశం ఇస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

**వైసిపిలో అభినయ్ రెడ్డి పేరు:** కూటమి తరఫున అభ్యర్థి ఎవరు అన్నది స్పష్టమైన తర్వాతే తమ అభ్యర్థిని ఖరారు చేయాలని వైసిపి అధిష్ఠానం భావిస్తున్నట్టు సమాచారం. కూటమి నుంచి బలమైన యువ నేతను రంగంలోకి దింపితే అందుకు ధీటుగా యువ ముఖాన్నే బరిలోకి దించాలని ఆ పార్టీ యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి కుమారుడు, మాజీ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి పేరు వినిపిస్తోంది. గతంలో డిప్యూటీ మేయర్‌గా పనిచేసిన ఆయన ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు ఆ పదవికి రాజీనామా చేశారు. అయితే మేయర్‌గా పోటీ చేస్తే భవిష్యత్తులో ఎమ్మెల్యే అవకాశంపై ప్రభావం పడుతుందన్న సందేహం ఆయన వర్గంలో ఉన్నట్టు తెలుస్తోంది. మాజీ మేయర్ డాక్టర్ ఆర్.శిరీష యాదవ్ పేరు కూడా మరోసారి పరిశీలనలో ఉన్నట్టు సమాచారం. గతంలో మేయర్ పదవి జనరల్ మహిళకు కేటాయించినప్పటికీ బిసి వర్గానికి చెందిన శిరీష యాదవ్‌కు అవకాశం కల్పించడం అప్పట్లో రాజకీయంగా సంచలనంగా మారింది. రాయలసీమ మేధావుల ఫోరం కన్వీనర్ మాకిరెడ్డి పురుషోత్తం రెడ్డి కూడా మేయర్ పదవిపై ఆసక్తిగా ఉన్నట్టు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. అధినేత జగన్‌తో ఉన్న సాన్నిహిత్యాన్ని కూడా ఆయనకు అనుకూల అంశంగా అనుచరులు భావిస్తున్నారు.

**యువతకే పట్టం కడతారా?:** మొత్తం మీద తిరుపతి మేయర్ ఎన్నిక ఈసారి కేవలం పార్టీల మధ్య పోరుగా గాకుండా కొత్త తరం నాయకత్వానికి పరీక్షగా మారే అవకాశం కనిపిస్తోంది. మూడు ప్రధాన సామాజిక వర్గాల సమీకరణాలు, కూటమిలో టీడీపీ– జనసేన మధ్య సీటు కోసం పోటీ, వైసిపి వ్యూహం, యువతకు పెరుగుతున్న ప్రాధాన్యం.. ఇవన్నీ కలిపి మేయర్ రేసును ఉత్కంఠభరితంగా మారుస్తున్నాయి.

డబ్బు రాజకీయాలకు బదులు సేవ, పాత తరానికి బదులు కొత్త తరం, సంప్రదాయ సమీకరణాలకు బదులు సామాజిక, విద్యా, ప్రజాసేవా నేపథ్యం, ఈ అంశాల్లో ఏది తిరుపతి ఓటర్లను ప్రభావితం చేస్తుందో, చివరికి మేయర్ పీఠాన్ని ఎవరు అధిరోహిస్తారో వేచి చూడాల్సిందే.

27-08pg10exHMNWJQE:27-08pg10exHMNWJQE.qxd 8/26/2026 10:49 PM Page 1



ఆట

# సెమీఫైనల్‌కు నార్త్‌జోన్

## 52 రన్స్ తేడాతో వెస్ట్ జోన్ ఓటమి



**బెంగుళూరు:** దులీప్ ట్రోఫీ 4వ రోజున వెస్ట్ జోన్‌పై నార్త్ జోన్ అనూహ్య విజయాన్ని పూర్తి చేసింది. బుధవారం బెంగుళూరులో జరిగిన మ్యాచ్‌లో, నార్త్ జోన్ కేవలం 28 నిమిషాల్లో వెస్ట్ జోన్‌పై 52 పరుగుల తేడాతో విజయం సాధించి 2026-27 దులీప్ ట్రోఫీ సెమీఫైనల్‌లోకి ప్రవేశించింది. 87 పరుగుల లక్ష్యాన్ని ఛేదిస్తున్న వెస్ట్ జట్టుకు, చివరి రోజు ఉదయం మూడు వికెట్లు మిగిలి ఉండగా 67 పరుగులు అవసరమయ్యాయి. కానీ ఆ జట్టు వరుసగా వికెట్లు కోల్పోయింది. మొదటగా తనుష్ కోటియన్ అవుటయ్యాడు. ఎడమచేతి వాటం స్పిన్నర్ అబిద్ ముస్తాఖ్ వేసిన బంతి పిచ్ అయిన తర్వాత కూడా అదే లైన్‌లో కొనసాగి అతని వికెట్లను పడగొట్టడంతో అతను బోల్తా పడ్డాడు. అబిద్‌తో కలిసి మరో ఎడమచేతి స్పిన్నర్ నిశాంత్ సింధు బౌలింగ్ చేస్తుండటంతో, ఆట లయను దెబ్బతీయడానికి వెస్ట్, శార్దూల్ ఠాకూర్ కంటే ముందుగా ఎడమచేతి వాటం బ్యాట్స్‌మెన్ తుషార్ దేశ్‌పాండేను పంపాలని నిర్ణయించుకున్నాడు. ముంబై పేసర్ 17 బంతుల పాటు క్రీజులో నిలదొక్కుకున్నాడు. కానీ ఆవేశంతో క్రీజు దాటి బయటకు వచ్చి అబిద్ (60 పరుగులకు నాలుగు వికెట్లు) బౌలింగ్‌లో బంతిని బలంగా బాదబోయాడు. ఆ క్రమంలో బంతి బ్యాట్‌అంచుకు తగిలి స్లిప్‌ఫీల్డర్ చేతిలోకి వెళ్లింది. స్పెషలిస్ట్‌బ్యాటర్ ఉర్విల్ పటేల్ (44) తో శార్దూల్ జత కలిశాడు, కానీ వారిద్దరి భాగస్వామ్యం కేవలం మూడు బంతులే కొనసాగింది. నిశాంత్ బౌలింగ్‌లో ఉర్విల్ స్లాగ్ స్వీప్ ఆడబోయి విఫలమవడంతో లెగ్‌బిఫోర్ గా అవుటయ్యాడు. కేవలం ఒక గంట క్రికెట్ వ్యవధిలోనే, వెస్ట్ జట్టు 195 పరుగులకు మూడు వికెట్ల నుండి 234 పరుగులకే ఆలౌట్ అయి, అద్భుతమైన ఫామ్ నుండి పతనానికి పడిపోయింది.

## మహిళల హాకీ ప్రపంచ కప్..

# నేడు జర్మనీతో భారత్ ఢీ



**నెదర్లాండ్స్:** ఆస్ట్రేలియాతో గోల్ రహిత డ్రాతో సెమీఫైనల్ ఆశలు ఆవిరైన తర్వాత, గురువారం ఆమ్‌స్టెల్వీన్‌లో జర్మనీతో నెదర్లాండ్స్‌లో జరిగే ఐదవ, ఆరవ స్థానం కోసం జరిగే మ్యాచ్‌లో భారత్ మహిళల ప్రపంచ కప్ ప్రచారాన్ని ఘనంగా ముగించాలని చూస్తోంది. ఫలితంతో సంబంధం లేకుండా, 1974లో నాలుగో స్థానంలో నిలిచిన తర్వాత ప్రపంచ కప్‌లో స్జోర్డ్ మారిజ్నే జట్టు అత్యుత్తమ స్థానాన్ని ఖాయం చేసుకుంది. ఆమ్‌స్టెల్వీన్‌లో కేవలం ఒకే ఆటలో ఓడిపోయి, ఉన్నత ర్యాంకులో ఉన్న చైనా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియాలతో డ్రాలు చేసుకున్నప్పటికీ, భారత్ గోల్స్ చేయడంలో వెనుకబడటం విమర్శలకు గురైంది. దీపిక, నవనీత్ కౌర్ చెరో రెండు గోల్స్ చేసినప్పటికీ, షార్ట్ కార్నర్‌ల నుండి అవకాశాలను గోల్స్‌గా మార్చడంలో వారి పేలవమైన ప్రదర్శన చివరికి జట్టుకు నష్టం కలిగించింది. మరోవైపు, భారత రక్షణ విభాగం పటిష్టంగా, ఛేదించడానికి కష్టంగా ఉంది. పేరుమోసిన నెదర్లాండ్స్ దాడి విభాగం సైతం రెండు గోల్స్ చేయడానికి తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. గురువారం, ప్రపంచ నెం.5 జర్మనీపై కూడా భారత్ ఇదే విధమైన దృఢమైన ప్రదర్శనను పునరావృతం చేయాలని కోరుకుంటుంది. ఇరు జట్ల మధ్య ఉన్న ర్యాంకింగ్ వ్యత్యాసానికి తగినట్లుగా ఒక అద్భుత ప్రదర్శన ఇవ్వాలని జర్మనీ తీవ్రంగా ఆశిస్తుంది.

# యూఎస్ ఓపెన్ తొలి రౌండ్‌లోనే సుమిత్ నిష్క్రమణ

**న్యూయార్క్:** భారత నంబర్ 1 సింగిల్స్ ఆటగాడు సుమిత్ నాగల్ ఓటమి చెందాడు. అమెరికాలోని న్యూయార్క్‌లో జరుగుతున్న 2026 యూఎస్ ఓపెన్ గ్రాండ్ స్లామ్ క్వాలిఫైయింగ్ దశ మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. సింగిల్స్ విభాగంలో ఏకైక భారతీయ ఆటగాడైన నాగల్, గంటా 54 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన ప్రపంచ 86వ ర్యాంకర్ ఆర్థర్ గియా చేతిలో వరుస సెట్లలో (3-6, 6-7)



ఓటమి పాలయ్యాడు. 29 ఏళ్ల అతను ఈ ఏడాది తన తొలి గ్రాండ్ స్లామ్ ఈవెంట్‌లో పోటీ పడుతున్నప్పటికీ, క్వాలిఫైయింగ్ డ్రాలో అగ్రశ్రేణి ఆటగాడితో జరిగిన తన మొదటి మ్యాచ్‌లోనే నిష్క్రమించాల్సి వచ్చింది. ఆర్థర్ యొక్క మొదటి రెండు సర్వీస్ గేమ్‌లలో తాను సంపాదించిన నాలుగు బ్రేక్ పాయింట్లలో దేనినీ సద్వినియోగం చేసుకోలేక, సుమిత్ తన ఆరంభ అవకాశాలను చేజార్చుకున్నాడు. ఫ్రెంచ్ ఆటగాడు ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, మ్యాచ్ మిగిలిన భాగంలో మరే బ్రేక్ పాయింట్లు రాకుండా అడ్డుకుని, తన మొదటి మరియు ఏకైక బ్రేక్ పాయింట్‌ను సాధించి తొలి సెట్‌ను కైవసం చేసుకున్నాడు. రెండవ సెట్ మరింత ఉత్కంఠభరితంగా సాగింది. ఇద్దరు ఆటగాళ్లు బలమైన రిటర్న్‌లు చేస్తూ, అనేక గేమ్‌లను డ్యూస్‌కు తీసుకువెళ్లారు. మొదటి నాలుగు గేమ్‌లలోనే బ్రేక్‌లను మార్చుకున్నారు. గంటసేపు సాగిన పోరాటం తర్వాత, ఆర్థర్ సర్వ్‌పై సుమిత్‌కు సెట్ పాయింట్ లభించినప్పటికీ, దానిని మరోసారి సద్వినియోగం చేసుకోలేక, సెట్‌ను టైబ్రేక్‌కు తీసుకువెళ్లాడు. ఆ తర్వాత ఫ్రెంచ్ ఆటగాడు టైబ్రేక్‌లో అద్భుతంగా రాణించి, దానిని 7-4 తేడాతో సునాయాసంగా గెలుచుకొని, సుమిత్ నాగల్‌పై స్ట్రెయిట్‌సెట్స్ విజయాన్ని ఖాయం చేసుకున్నాడు.



# స్టార్ ప్లేయర్లు రీ ఎంట్రీకి రెడీ

## అఫ్ఘానిస్థాన్, వెస్టిండీస్ సిరీస్‌లే టీమిండియా లక్ష్యం

**న్యూఢిల్లీ:** గాయాలు, రిహాబిలిటేషన్ కారణంగా జట్టుకు దూరంగా ఉన్న పలువురు స్టార్ ప్లేయర్లు టీమిండియాలోకి రీ ఎంట్రీ ఇవ్వనున్నారు. ఇందుకు టీమిండియా పరిమిత ఓవర్ల స్టార్ ఆటగాళ్లు తిరిగి పూర్తి ఫిట్‌నెస్ సాధించేందుకు కఠోరంగా శ్రమిస్తున్నారు. ప్రస్తుతం, భారత్,శ్రీలంక జట్ల మధ్య టెస్ట్‌సిరీస్ జరుగుతుండగా, మరోవైపు బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్రేయర్లు వర్కౌట్లు చేస్తూ రీ ఎంట్రీకి సిద్ధమవుతున్నారు. స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా వర్క్‌లోడ్ మేనేజ్మెంట్‌పై దృష్టి పెట్టగా, స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్‌పాండ్యా గాయం నుంచి వేగంగా కోలుకుంటూ శిక్షణ పొందుతున్నాడు. విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ, యంగ్ పేసర్ హర్షిత్ రాణా, వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్, ఆల్‌రౌండర్ శివమ్ దూబె, స్పిన్నర్ రవి బిష్ణోయ్, సూర్యాంశ్ షెడ్గేలు ఒకే చోట తీవ్రంగా సాధన చేస్తున్నారు. ఈ ప్లేయర్ల ఫోకస్ అంతా రాబోయే ద్వైపాక్షిక సిరీస్‌లపైనే ఉంది. సెప్టెంబర్‌లో ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న 3 మ్యాచ్ ల టీ20 అంతర్జాతీయ సిరీస్ సమయానికి ఈ వైట్‌బాల్ స్టార్లు పూర్తి ఫిట్నెస్ సాధించాలని చూస్తున్నారు. ఆ తర్వాత అక్టోబర్ లో వెస్టిండీస్ జట్టుతో జరగబోయే వన్డే, టీ20 సిరీస్ కు ఈ కీలక ఆటగాళ్లందరూ భారత జట్టుకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఇటీవల ఆటగాళ్లకు ఫిట్‌నెస్ క్లియరెన్స్ ఇవ్వడం, గాయాల నిర్వహణపై కొన్ని ఆరోపణలు తలెత్తిన నేపథ్యంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ) హెడ్ వీవీఎస్ లక్ష్మణ్, బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మీడియా సమావేశంలో మాట్లాడి క్లారిటీ ఇచ్చారు. ఎంపిక ప్రక్రియలో, ఆటగాళ్ల ఫిట్‌నెస్ నివేదికలలో పూర్తి పారదర్శకత ఉంటుందని లక్ష్మణ్ స్పష్టం చేశారు. ఒకవేళ ఆటగాడు మ్యాచ్ సమయానికి ఫిట్‌నెస్ నిరూపించుకోకపోతే మరికరిని ఎంపిక చేస్తారని అర్థం. తాము నిందలు వేసేందుకు ఇష్టపడమని, ప్లేయర్లు కోలుకునే పురోగతిని ప్రతి దశలో పర్యవేక్షిస్తూ సెలెక్షన్ కమిటీకి నివేదిస్తామని లక్ష్మణ్ పేర్కొన్నారు. మొత్తానికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో స్టార్ ప్లేయర్ల కఠోర శ్రమ చూస్తుంటే త్వరలోనే భారత వైట్‌బాల్ జట్టు పూర్తి బలంతో మైదానంలోకి దిగడం ఖాయంగా కనిపిస్తోంది.

# లంకకు తప్పని ఫాలో ఆన్

## గెలుపు ముంగిట భారత్!

**కొలంబో:** కొలంబో వేదికగా శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌లో భారత్ పట్టు బిగించి గెలుపు ముంగిట నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంకను 290 పరుగులకు ఆలౌట్ చేసింది. 213 పరుగుల భారీ లోటుతో ఫాలో ఆన్ ఆడిన శ్రీలంక నాలుగో రోజు బుధవారం ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 72.4 ఓవర్లలో 6 వికెట్లకు 229 పరుగులు చేసి 16 పరుగుల ఆధిక్యంలో ఉంది. అంతకుముందు 265/8 ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 89.4 ఓవర్లలో 290 పరుగులకు కుప్పకూలింది. ఓవర్‌నైట్ బ్యాటర్ సోనాల్ దినుషా(103) సెంచరీ పూర్తి చేసుకున్నాడు. శ్రీలంక చివరి రెండు వికెట్లను అరంగేట్ర స్పిన్నర్ సారాన్ష్ జైన్ దక్కించుకున్నాడు. ప్రసిధ్ కృష్ణ(3/52), మానవ్ సుతార్(3/85) మూడేసి వికెట్లు తీయగా, మహమ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా తలో వికెట్ పడగొట్టారు. ఓవర్‌నైట్ స్కోర్‌కు శ్రీలంక 25



పరుగులు మాత్రమే జోడించింది. ఈ టెస్ట్ విజయంపై ఫోకస్ పెట్టిన భారత్ వ్యూహాత్మకంగా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించకుండా శ్రీలంకను ఫాలో ఆన్ ఆడించింది. రెండో ఇన్నింగ్స్ ఆరంభంలోనే శ్రీలంకకు సిరాజ్ గట్టి షాకిచ్చాడు. లాహిరు ఉడానా(3)ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. పసిందు సూర్యబండార, కామిల్ మిశ్రా ఆచితూచి ఆడారు. 58 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో సెట్ అయిన ఈ జోడీని జడేజా విడదీసాడు.

కామిల్ మిశ్రా(32)ఎల్బీగా పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి కామిందు మెండిస్ రాగా, శ్రీలంక 83/2 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. పసిందు సూర్యబండార 78 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించగా, కామిందు మెండీస్ 87 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. 115 పరుగుల భారీ భాగస్వామ్యంతో ప్రమాదకరంగా మారిన ఈ జోడీని ప్రసిధ్ కృష్ణ విడదీసాడు. శుభ్‌మన్ గిల్ స్టన్నింగ్ క్యాచ్‌తో కామిందు మెండీస్‌ను పెవిలియన్ చేర్చాడు. ఈవికెట్‌తో ప్రసిధ్ కృష్ణ మ్యాచ్‌ను భారత్‌వైపు తిప్పాడు. కెప్టెన్ ధనంజయ డిసిల్వా క్రీజులోకి రాగా, శ్రీలంక 199/3 స్కోర్‌తో టీ బ్రేక్‌కు వెళ్లింది. మూడో సెషన్‌లో భారత బౌలర్లు నిప్పులు చెరిగారు. ఆచితూచి ఆడిన ధనంజయ డిసిల్వా(23)తో పాటు సెంచరీ దిశగా సాగిన పసిందు సూర్యబండార(173 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 92)ను మానవ్ సుతార్ వరుస ఓవర్లలో పెవిలియన్ చేర్చాడు. ఆ వెంటనే నిరోషన్ డిక్‌వెల్లాను సరాన్ష్ జైన్ వికెట్ల ముందు బోల్తా కొట్టించాడు. సోనాల్ దినుషా, కేశర నువాంత మరో వికెట్ పడకుండా నాలుగో రోజు ఆటను ముగించారు.




# 50 వేల ఉద్యోగులపై వోక్స్‌వ్యాగన్ వేటు

**న్యూఢిల్లీ,ఆగస్టు 26:** ఆటో దిగ్గజం వోక్స్‌వ్యాగన్ తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంది. అమ్మకాలు తగ్గడం, చైనా కంపెనీల నుంచి పోటీ పెరగడం, ఉత్పత్తి వ్యయాలు అధికంగా ఉండటంతో భారీ పునర్వ్యవస్థీకరణకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా 50 వేల వరకు ఉద్యోగాలు తగ్గించేముప్పుఉంది. దీంతో జర్మనీలో ఉద్యోగుల ఆగ్రహం తీవ్ర స్థాయికి చేరింది. ఫోక్స్‌వ్యాగన్ ప్రధాన కార్యాలయం ఉన్న వోల్ఫ్స్‌బర్గ్‌లో 10 వేల మందికి పైగా కార్మికులు గుమికూడారు. సంస్థను పోటీకి తగినట్లు మార్చుకోవాల్సిన అవసరం ఉందని సీఈవో ఒలివర్ బ్లూమ్ వారికి చెప్పారు. అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. బ్లూమ్ ప్రసంగానికి కార్మికుల నుంచి తీవ్ర నిరసన ఎదురైంది. కొందరు ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 50 వేల ఉద్యోగాల కోతపై యాజమాన్యం చర్చిస్తోంది. ఇందులో సగం వరకు జర్మనీలో ఉండొచ్చని తెలుస్తోంది. స్వచ్ఛంద పదవీ విరమణ, ముందస్తు రిటైర్‌మెంట్, కొత్త నియామకాలపై ఆంక్షల ద్వారా ఉద్యోగుల సంఖ్యను తగ్గించాలని భావిస్తోంది. జర్మనీలోని పలు ప్లాంట్ల భవిష్యత్తుపైనా అనిశ్చితి నెలకొంది. ఒస్నాబ్రూక్ ప్లాంట్‌లో వచ్చే ఏడాది ఉత్పత్తి నిలిచిపోనుంది. మరో నాలుగు ప్లాంట్ల భవిష్యత్తు 2030 తర్వాత ఎలా ఉంటుందన్నది స్పష్టంగా లేదు. ఫోక్స్‌వ్యాగన్‌కు చైనా కార్ల తయారీ సంస్థల నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది. ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాల విభాగంలో చైనా కంపెనీలు వేగంగా ఎదుగుతున్నాయి. చైనాలో ఫోక్స్‌వ్యాగన్ అమ్మకాలు కూడా తగ్గాయి. అమెరికా టారిఫ్‌లు, అధిక ఉత్పత్తి వ్యయాలు సమస్యను మరింత పెంచుతున్నాయి. కంపెనీ వ్యయాలు కొంతమంది పోటీదారుల కంటే 30 శాతం అధికంగా ఉన్నాయని బ్లూమ్ తెలిపారు.

# ప్రపంచ ఆర్థికవ్యవస్థలో టగ్‌ఆఫ్ వార్!

## -ఐఎంఎఫ్ ఎండి క్రిస్టలినా జార్జియేవా




**న్యూయార్కు,ఆగస్టు 26:** ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఒక భారీ టగ్ ఆఫ్ వార్ స్థితిని ఎదుర్కొంటోందని అంతర్జాతీయ ద్రవ్యనిధి మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టలినా జార్జియేవా వ్యాఖ్యానించారు. ఒకవైపు పశ్చిమాసియాలో ఇంధన సరఫరా ఆటంకాలతో తలెత్తిన ప్రతికూలతలు, మరోవైపు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌రంగంలో పెట్టుబడుల వెల్లువతో పెరిగిన డిమాండ్ ఈ రెండు పరస్పర విరుద్ధ శక్తుల మధ్య గ్లోబల్ ఎకానమీ నలిగిపోతోందని ఆమె విశ్లేషించారు. జీ20 దేశాల ఆర్థిక మంత్రుల సమావేశానికి ముందు వాషింగ్టన్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. పశ్చిమాసియాలో హార్మూజ్ జలసంధి మూసివేత కారణంగా తలెత్తిన ఇంధన సంక్షోభాన్ని ప్రపంచం ఊహించిన దానికంటే మెరుగ్గానే తట్టుకోగలిగిందని జార్జియేవా తెలిపారు. చమురు, గ్యాస్ నిల్వలను సమర్థవంతంగా వినియోగించుకోవడం, గల్ఫ్ యేతర దేశాల నుంచి సరఫరాలు పెరగడం, ఇంధన వినియోగం తగ్గడం పునరుత్పాదక ఇంధన సామర్థ్యం వృద్ధి చెందడం వంటి అంశాలు దీని ప్రభావాన్ని తగ్గించాయని ఆమె వివరించారు. ఏఐ రంగంలో పెట్టుబడుల జోరు ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తోందని ఆమె నొక్కి చెప్పారు. అమెరికాలో ప్రారంభమైన ఏఐ విప్లవం ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ప్రధాన చోదకశక్తిగా మారుతోంది. ఇతర దేశాలు సైతం డేటా సెంటర్లు, మౌలిక సదుపాయాల కల్పనను వేగవంతం చేస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. ఇంధన ధరలు పెరిగితే ద్రవ్యోల్బణం భారమై, వడ్డీ రేట్లను తగ్గించకుండా సెంట్రల్ బ్యాంకులు కఠిన వైఖరిని అవలంబించే ముప్పు ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా ఇంధన దిగుమతులపై ఆధారపడే పేద దేశాలపై రుణ భారం మరింత పెరగవచ్చని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

# ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ ఏఎంసీలో 2% వాటా విక్రయం

**ముంబయి,ఆగస్టు26:** ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలో 2 శాతం వాటాను ప్రుడెన్షియల్ కార్పొరేషన్ హోల్డింగ్స్ బ్లాక్ డీల్ ద్వారా విక్రయించనుంది. ఈ లావాదేవీ విలువ సుమారు రూ.2,964 కోట్ల నుంచి




రూ.3,122 కోట్ల వరకు ఉండొచ్చని అంచనా.ఈ బ్లాక్ డీల్‌లో సుమారు 98.85 లక్షల షేర్లు చేతులు మారనున్నాయి. ఒక్కో షేర్‌కు రూ.2,998-రూ.3,158 ధరను ఆఫర్ ధరగా నిర్ణయించినట్లు సమాచారం. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ ముగింపు ధరతో పోలిస్తే ఈ ఆఫర్ ధర సుమారు 2-7 శాతం డిస్కౌంట్‌తో ఉంది.ఇది పూర్తిగా సెకండరీ షేర్ సేల్ కావడంతో కంపెనీ నుంచి కొత్తగా ఎలాంటి షేర్ల జారీ ఉండదు. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ ప్రమోటర్ అయిన ప్రుడెన్షియల్ కార్పొరేషన్ హోల్డింగ్స్‌కు కంపెనీలో 34.59 శాతం వాటా ఉంది. 2 శాతం వాటా విక్రయం అనంతరం ఆ వాటా తగ్గనుంది. ఈ విక్రయం ద్వారా వచ్చే మొత్తం కంపెనీకి కాకుండా షేర్లను విక్రయిస్తున్న ప్రమోటర్‌కు చేరుతుంది. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో మెరుగైన ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. సంస్థ నికర లాభం ఏడాది ప్రాతిపదికన 25.5 శాతం పెరిగి రూ.965 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంలో నికర లాభం రూ.769 కోట్లుగా ఉంది.మొత్తం ఆదాయం 20.2 శాతం పెరిగి రూ.1,745 కోట్లకు చేరింది. బుధవారం ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ షేరు 2.1 శాతం తగ్గి రూ.3,222.80 వద్ద ముగిసింది.




# నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, ఆగస్టు 26:** దేశీయ ఈక్విటీ సూచీలు బుధవారం నష్టాలతో ముగిశాయి. గరిష్ఠ స్థాయిల వద్ద ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగడం, అమెరికా జూలై వ్యక్తిగత వినియోగ వ్యయాల ద్రవ్యోల్బణ గణాంకాల కోసం మార్కెట్లు అప్రమత్తంగా ఎదురుచూడటం ఇందుకు కారణమయ్యాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ కీలకంగా పరిగణించే రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు రానున్న రోజుల్లో వడ్డీ రేట్లపై ఫెడ్ నిర్ణయాలకు సంబంధించి కొత్త సంకేతాలను అందించనున్నాయి.ఎన్విడియా ఫలితాలపై కూడా మార్కెట్ వర్గాలు దృష్టి సారించాయి. ఎఐ రంగంలో వ్యయాలు ఏ స్థాయిలో కొనసాగుతున్నాయి, టెక్నాలజీ ఆధారిత మార్కెట్ ర్యాలీ నిలకడగా ఉంటుందా అనే అంశాలపై ఈ ఫలితాలు స్పష్టత ఇవ్వనున్నాయి. దీంతో ఐటీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.44 శాతం పడిపోవడం కూడా సూచీలపై ఒత్తిడి పెంచింది. మరోవైపు ఫైనాన్షియల్ షేర్లు, ప్రైవేట్ బ్యాంకులు లాభపడగా, సిమెంట్, మెటల్ షేర్లు కూడా పురోగమించాయి.ముడి చమురు ధరలు తగ్గడం మార్కెట్ సెంటిమెంట్‌కు కొంత మద్దతునిచ్చింది. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 86 డాలర్ల దిగువకు పడిపోయింది. నిఫ్టీ 50 సూచీ 126.80 పాయింట్లు నష్టపోయి 24,207.75 వద్ద ముగిసింది. ఎస్అండ్‌పీ బీఎస్ఈ సెన్సెక్స్ 183.15 పాయింట్లు తగ్గి 77,472.94 వద్ద స్థిరపడింది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు లాభాల్లోనే కొనసాగాయి. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.17 శాతం, బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.56 శాతం పెరిగాయి. బీఎస్ఈలో 2,375 షేర్లులాభపడగా, 1,944 షేర్లు నష్టపోయాయి. మరో 231 షేర్లలో ఎలాంటి మార్పులేదు. అక్టోబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ ధర 2.24 డాలర్లు తగ్గి బ్యారెల్‌కు 85.03 డాలర్లకు చేరింది. అక్టోబర్ 5, 2026 సెటిల్‌మెంట్‌కు ఎంసీఎక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ 0.43 శాతం తగ్గి 10 గ్రాములకు రూ.1,62,115 వద్ద నిలిచాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు 0.11 శాతం పెరిగి 98.95కు చేరింది. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 1.47 శాతం పడిపోయింది. ప్రధానంగా ఇన్ఫోసిస్ 2.10 శాతం, టెక్ మహీంద్రా 1.81 శాతం, విప్రో 1.52 శాతం, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ 1.50 శాతం, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 1.31 శాతం, ఎంఫాసిస్ 1.31 శాతం, టీసీఎస్ 1.14 శాతం, పర్సిస్టెంట్ సిస్టమ్స్ 1.14 శాతం, కోఫోర్జ్ 0.68 శాతం చొప్పున నష్టపోయాయి.ఇతర షేర్లలో అద్వైత్ ఎనర్జీ ట్రాన్సిషన్స్ 3.71 శాతం, ఎంటీఏఆర్ టెక్నాలజీస్ 1.92 శాతం లాభపడ్డాయి. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 1.51 శాతం పడిపోయింది. ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ 0.29 శాతం, సాయి పేరెంటరల్స్ 0.71 శాతం పెరగగా, సుబెక్స్ 0.39 శాతం, ఎన్‌బీసీసీ0.32 శాతం నష్టపోయాయి.



# ఉల్లిధరల నియంత్రణకు కేంద్రం జోక్యం

## రూ.35 సబ్సిడీ ధరకే విక్రయం

**న్యూఢిల్లీ, ఆగస్టు 26:** దేశవ్యాప్తంగా ఉల్లిపాయల ధరలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో గురువారం నుంచి దేశ రాజధాని ఢిల్లీలో కిలో ఉల్లిపాయలను రూ.35 సబ్సిడీ ధరకు విక్రయించనుంది. నగరాల్లో ఉల్లిపాయల రిటైల్ ధరలు కిలోకు రూ.55-60 వరకు చేరాయి. కేంద్ర ఆహార మంత్రి ప్రహ్లాద్ జోషి గురువారం ఈ సబ్సిడీ విక్రయాలను ప్రారంభించనున్నారు.2026 కోసం ఉత్పత్తి రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న 1.21 లక్షల టన్నుల బఫర్ స్టాక్ నుంచి ఉల్లిపాయలను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నారు. నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్, కేంద్రీయ భండార్ సంస్థల ద్వారా రిటైల్ విక్రయాలు చేపట్టనున్నారు.ఎన్‌సీసీఎఫ్ వద్ద ప్రస్తుతం 62 వేల టన్నుల ఉల్లిపాయల బఫర్ నిల్వ ఉంది. ఇందులో నుంచి మహారాష్ట్రలోని నాసిక్ నుంచి 400 టన్నుల ఉల్లిపాయలను 'కాండా ఎక్స్‌ప్రెస్ ద్వారా ఢిల్లీకి తరలిస్తున్నారు.

కేంద్రీయ భండార్‌కు చెందిన 100 స్టోర్ల ద్వారా ఉల్లిపాయలను విక్రయించనున్నారు. మదర్ డెయిరీకి చెందిన 300 ఔట్‌లెట్ల ద్వారా కూడా విక్రయించేందుకు చర్చలు జరుగుతున్నాయి.రైల్వే రేక్‌ల ద్వారా వచ్చే ఉల్లిపాయలను చండీగఢ్, లూధియానా, వారణాసి తదితర నగరాల్లో కూడా విక్రయించనున్నారు.నాఫెడ్ వద్ద 55 వేల టన్నుల కంటే తక్కువ ఉల్లిపాయల బఫర్ స్టాక్ ఉంది. ఈ సంస్థ కూడా ఢిల్లీతో పాటు కొచ్చి, గువాహటి తదితర ప్రాంతాల్లో ఉల్లిపాయలను విక్రయించనుంది. గత నెల రోజులుగా ఉల్లిపాయల ధరలు గణనీయంగా పెరిగాయి. 25న దేశవ్యాప్తంగా సగటు రిటైల్ ధర కిలో రూ.44.72కు చేరింది. జూలై 25న ఇది రూ.34.80గా ఉంది. అంటే నెల వ్యవధిలో 28 శాతానికి పైగా పెరిగింది. ఏడాది క్రితం కిలో ఉల్లిపాయ ధర రూ.28.67గా ఉండగా, ప్రస్తుతం 56 శాతం పెరిగింది.పలు మెట్రో నగరాల్లో ధరలు మరింత ఎక్కువగా ఉన్నాయి. బుధవారం చెన్నై, కోల్‌కతాలో కిలో ఉల్లిపాయ రూ.60, ఢిల్లీలో రూ.55, ముంబైలో రూ.48, రాంచీలో రూ.38గా నమోదయ్యాయి.

ఏడాది క్రితం ఇదే సమయంలో చెన్నైలో రూ.35, కోల్‌కతాలో రూ.32, ఢిల్లీలో రూ.33, ముంబైలో రూ.32, రాంచీలో రూ.25గా ధరలు ఉన్నాయి.హోల్‌సేల్ మార్కెట్‌లోనూ ధరలు ఇదే స్థాయిలో పెరిగాయి. ఆగస్టు 25న సగటు హోల్‌సేల్ ధర కిలో రూ.36.73గా ఉంది. ఏడాది క్రితం రూ.22.54తో పోలిస్తే ఇది 63 శాతం అధికం. దేశంలో ఉల్లిపాయల ఉత్పత్తి 307.37 లక్షల టన్నులుగా ఉంటుందని అంచనా.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., Renigunta Road, 3rd Mile Stone, Tirupati-517507 Ph. No. 2238770, Fax:: 08772238790, RNI No.64860/9 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.

27- 8 pg 9:27- 8 pg 9.qxd 8/26/2026 10:47 PM Page 1



# చెలి



జీవితంలో ప్రతి దశా ప్రత్యేకమైనదే! ముఖ్యంగా 20-29 ఏళ్ల వయసులో కొన్ని కీలక సంఘటనలు జరుగుతుం టాయి.

## తప్పటడుగులకు ఫుల్ స్టాప్!

చదువు, ఉద్యోగం, వివాహం.. మరి కొందరైతే పిల్లల్ని కూడా కంటుంటారు. అయితే ఇరవైల్లో ఉన్న వారు కొన్ని అంశాల్లో మాత్రం ఆచితూచి అడుగేయాలంటున్నారు నిపుణులు.

**పొదుపు తప్పనిసరి...** ప్రస్తుతం ఇరవైల్లో ఉన్నప్పుడే చాలామందికి ఉద్యోగాలు వస్తున్నాయి. దీంతో చిన్న వయసులోనే జీవితంలో స్థిరపడు తున్నారు. అయితే కొంతమంది ఇప్పుట్నుంచే డబ్బు పొదుపేంటి? కొన్నాళ్లు ఎంజాయ్ చేద్దాం. అన్న ఆలోచనతో పొదుపును పక్కన పెట్టేస్తుంటారు. ఈ నిర్లక్ష్యం వల్ల భవిష్యత్తులో పలు ఇబ్బందుల ఎదుర్కోవాల్సి రావచ్చంటున్నారు నిపుణులు. అందుకే ఇరవైల్లో ఉన్నప్పుడే డబ్బు పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలి. అప్పుడే జీవితంపై పూర్తి అవగాహన వస్తుంది. భవిష్యత్తులో ఆర్థికపరంగా ఎలాంటి సమస్యల్లేకుండా జాగ్రత్తపడచ్చు.

**ఇలాంటి స్నేహితులు !** ఉద్యోగాల పేరుతో ఇరవైల్లోనే జీవితంలో స్థిరపడే సరికి కొత్త అనుభూతి పొందు తుంటారు చాలమంది. ఈ క్రమంలో ఆఫీస్‌లో, కెరీర్ పరంగా కొత్త వ్యక్తులు పరిచయమవు తుంటారు. వారితో స్నేహం ఏర్పడుతుంది. అయితే ఈ స్నేహాలు మనల్ని సానుకూలంగా ముందుకు నడిపించేవైతే పర్లేదు. కానీ మనల్ని తప్పుదోవ పటి ంచేవైతే ఆదిలోనే జాగ్రత్తపడాలంటున్నారు నిపుణులు. అదేవిధంగా మీ బలాబలాలు, బలహీనతలు, మంచి చెడ్డలు.. తదితర విషయాలగురించి ఆలోచించే వారితో స్నేహబంధాన్ని ఏర్పరచుకుంటే వ్యక్తిగతంగా, కెరీర్ పరంగా ప్రయోజనకరంగా ఉంటుంది.


**ప్రేమా? ఆకర్షణా ?...** ఇరవైల్లోనే చాలామంది ప్రేమలో పడుతుంటారు. అది ప్రేమో, ఆకర్షణో తెలియక తప్పటడుగు వేసేవారూ లేకపోలేదు. కాబట్టి ఈ విషయంలో అవగాహన పెంచుకోవడం ముఖ్యం. అలాగే కొంతమంది ప్రేమ విషయంలో పలు సమస్యలు ఎదురైనా.. వారితోనే జీవితం కొనసాగించడానికి ఆసక్తి చూపుతుంటారు. పెళ్లయ్యాక వాళ్లే మారుతారులే అన్న ఆలోచనతో వివాహ బంధంలోకి అడుగుపెడు తుంటారు. ఇలాంటి తప్పటడుగులే వేయద్దంటున్నారు నిపుణులు. ఇలాంటి చెడు నిర్ణయాల వల్ల జీవితాంతం ఇబ్బంది పడాల్సి వస్తుందంటు న్నారు. అందుకే ఇలాంటి చేటు చేసే బంధాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. ఇలాంటి వాళ్లనే కాదు. వాళ్ల జ్ఞాపకాల్నీ మదిలో నుంచి తొలగిస్తే జీవితంలో పాజిటివిటీతో

## ఎంతో కొంత విశ్రాంతిగా..



ఉద్యోగాల్లో కొన్ని సందర్భాలు డెడ్‌లైన్‌తో ఉంటాయి. మరో పక్క ఇంట్లో పనులూ ఓ పట్టాన తెమలవు. దీంతో తెలి యని ఆందోళన.. దేనిపైనా దృష్టిపెట్టలేకుండా చేస్తుంది. అలాకాకూడదంటే.. మల్టీ టాస్కింగ్ చేయడంలో మహిళలు సమర్థులం టారు! కానీ ఆ అలవాటు అన్ని సమయాల్లోనూ మంచిదికాదు. ముఖ్యంగా పని ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు దీని జోలికి పోవద్దు అంటారు. కెరియర్ నిపుణులు. దేనికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలో గుర్తించగలిగితే దానిమీదే శ్రద్ధపెట్టి త్వరగా పూర్తి చేయొచ్చు. ఇలా పనులన్నింటికీ ఓజాబితా రాసుకుంటే.. మనలో ఆందోళన తగ్గించడానికి ఈ స్పష్టత చాలు. పని పూర్తి చేయాలనే తొందరలో విరామం తీసుకోకుండా పనిచేస్తుంటారు కొందరు. దీనివల్ల అనుకున్న లక్ష్యం చేరకపోగా మరింత ఒత్తిడికి గురవుతుంటారు. ఇలాంటప్పుడు పనిని కాసేపైనా వాయిదా వేయడం మంచిదే. ఆ సమయంలో ఓ మంచి కాఫీ తాగండి. నచ్చని మరో అంశంపై దృష్టిపెట్టండిలేదా ఓ చిన్న కునుకు తీయండి. ఇవన్నీ మీకంగారుని తగ్గిస్తాయి. తిరిగి ఉత్సాహంగా పనులు మొదలు పెట్టే శక్తినిస్తాయి. ఒక్కోసారి ఒత్తిడితో కూడుకున్న పనులు రెండుమూడురోజులు కూడా కొనసాగొచ్చు. అలాంటప్పుడు రోజుకి కనీసం గంటైనా ఏదైనా వ్యాయామం చేయండి. అది ఆందోళనని ఎదుర్కొనే శక్తినిస్తుంది. మెదడుని చురుగ్గా మార్చగలిగే బాదం, వాల్‌నట్స్ వంటివి తినండి. మనసుని ప్రశాంతంగా ఉంచే కొన్ని గుమ్మడి గింజల్ని నోట్లో వేసుకోండి. ఇవన్నీ ఒత్తిడిని తట్టుకుంటూ పనిచేయ గలిగే ఏకాగ్రతనీ పెంచుతాయి. □

## ఏదో ఒకటే..



**ఉద్యోగం, వ్యాపారం ఒకేసారి చేయడం లాభం,** సురక్షితం అని మీకు అనిపించ వచ్చు. కానీ, ఒకేసారి రెండు పడవల మీద కాళ్లు పెట్టడం మీకే ఇబ్బంది. దానివల్ల ఒక్కోసారి మానసికంగా, శారీరకంగా, ఆర్థికం గానూ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావొచ్చు. ఇలా రెండు పనులు ఒకేసారి చేసేకంటే ఏదో ఒక దానిమీదనే సమయం వెచ్చించడం మంచిది. ఒకవేళ మీరు వ్యాపారంలోనే కొనసాగాలి అనుకుంటే ముందుగా కొన్ని విషయాలు ఆలోచించుకోండి. మీ వ్యాపారం పట్ల మీకు ఎంత పాషన్ ఉంది? అందులో వచ్చే లాభనష్టాలను భరించగలరా? క్లిష్టపరిస్థితుల్లో గైడ్ చేయడానికి మెంటార్లు ఉన్నారా? మార్కెటింగ్, ఫైనాన్స్ వంటి విషయాలపై మీకు ఎంత పరిజ్ఞానం ఉంది? కొత్తగా ఎంత వరకూ నేర్చుకోగలరు? కుటుంబ మద్దతు ఎంతవరకూ ఉండొచ్చు? లాంటివీ ఆలోచించుకోండి. పైగా వ్యాపారమంటే నిర్ణీత సమయాల్లోనే పని ఉండదు. కాబట్టి, వీటనిననంటినీ దృష్టిలో ఉంచుకుని తగిన నిర్ణయం తీసుకోండి. □

## దత్తాత్రేయుడి నామస్మరణ

దత్తాత్రేయుడి నామం అత్యంత శక్తిమంతమైనది .. మహా మహిమాన్వితమైనది. ఆ స్వామి నామస్మరణ ఎలాంటి కష్టాలనైనా దూరం చేస్తుంది. ఎలాంటి బాధల నుంచైనా విముక్తిని కలిగిస్తుంది. ఆ స్వామి దర్శనం జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది .. ఆ స్వామి సేవ మోక్షానికి అవసరమైన అర్హతను కలిగిస్తుంది. అలాంటి స్వామిని ఆయన జయంతి రోజున పూజించడం వలన అనంతమైన పుణ్యఫలాలు లభిస్తాయని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. మార్గశిర పౌర్ణమి రోజున త్రిమూర్తులు ఒకే రూపంతో అనసూయాదేవి గర్భాన జన్మించారు. మూడు శిరస్సులతో .. ఆరు చేతులతో .. కాషాయ వస్త్రాలతో.. శంఖ చక్రాలతో పద్మాలతో .. త్రిశూలం .. రుద్రాక్షమాలలు .. యజ్ఞోపవీతం ధరించిన దత్తాత్రేయ స్వామి పరిపూర్ణమైన జ్ఞాన స్వరూపుడిగా దర్శనమిస్తూ వుంటాడు. ప్రకృతిలోని ప్రతి జీవిని గురువుగా భావించమని దత్తాత్రేయస్వామి తత్వం చెబుతోంది. హనుమంతుడు .. సుబ్రహ్మణ్యేశ్వరుడు .. పరశురాముడు .. కార్త వీర్యార్జునుడు .. ప్రహ్లాదుడు .. యదు మహారాజు .. అలర్కుడు .. వేదధర్ముడికి దత్తాత్రేయుడు జ్ఞానబోధ చేసినట్టుగా ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. అలాంటి దత్తాత్రేయ స్వామిని ఆపదలో తలచుకున్నంత మాత్రాన్నే ఆయన రక్షణ లభిస్తుంది. జీవితాన్ని వెలుగు మార్గంలో ప్రయాణింపజేసే జ్ఞానం .. సంతృప్తికరమైన జీవితం అనంతరం మోక్షం కలుగుతుంది. □

## బెల్లం వెన్న పొంగనాలు



దోశ పిండి, కొబ్బరి, బెల్లం, క్యారెట్ తురుము-కప్పు చొప్పున, నెయ్యి- నాలుగు చెంచాలు, వెన్న-కప్పు, కాజు, బాదం, పిస్తా ముక్కలు-పావు కప్పు.

**తయారీ:** పెద్ద గిన్నెలో దోశ పిండి, కొబ్బరి, క్యారెట్ తురుము, వెన్న, ఎండు ఫలాల ముక్కలు వేసి బాగా కలపాలి. పొయ్యి వెలిగించి గిన్నె పెట్టి బెల్లం వేసి, తగినన్ని నీళ్లు పోసి తీగ పాకం తయారు చేసుకోవాలి. ఈ పాకాన్ని దోశ పిండిలో పోసి చక్కగా కలపాలి. పొంగనాల పెనంలో కాస్తంత నెయ్యి రాసి ఈ పిండిని పొంగనాల్లా వేసుకోవాలి. కొద్ది కొద్దిగా నెయ్యి వేస్తూ రెండు వైపులా చక్కగా కాల్చుకోవాలి. అంతే రుచికరమైన తియ్యతియ్యని బెల్లం వెన్న పొంగనాలు రెడీ.




ప్రశ్న :నా వయస్సు 60 సంవత్సరాలు. ఇద్దరు పిల్లలు పెరిగి పెద్దవారు అయ్యారు. అందులో 40 ఏళ్ల నా కూతురు కూడా నాలాగే మోకాళ్ల నొప్పులతో బాధ పడుతోంది. ఎత్తు 5 అడుగుల 2 అంగుళాలు, బరువు 70 కిలోలు. కొంత కాలంగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నాను. వైద్యుడిని సంప్రదిస్తే మోకాళ్ల గుజ్జు దెబ్బతిన్నందున బరువు తగ్గాలని సూచించారు. రోజంతా ఇంటి పనులు, ఇతర పనులు చేస్తూనే ఉన్నా బరువు తగ్గడం లేదు.15 ఏళ్ల క్రితం గర్భసంచిని తొలగించారు. దాని వల్లే బరువు పెరిగిందని కొందరు చెబుతున్నారు. ఇది నిజమేనా? నేను ఎంత బరువు తగ్గాలి? ఎలా తగ్గాలి? తగిన సలహాలు ఇవ్వండి. అలాగే నా కూతురికి సూచనలు చేయండి.

ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు


వ్యథ

## గర్భసంచి తొలగిస్తే బరువు పెరుగుతారా?



జవాబు: అమ్మా, గర్భసంచి తొలగించినంత మాత్రాన బరువు పెరగడం తప్పనిసరి కాదు. అయితే గర్భసంచితో పాటు అండాశయాలను కూడా తొలగించినట్లయితే హార్మోన్లలో మార్పులు, మెనోపాజ్ ముందుగా రావడం వంటి కారణాలతో బరువులో మార్పులు రావచ్చు. అయితే వయసు, మెనోపాజ్, ఆహారపు అలవాట్లు, శారీరక చురుకుదనం వంటి అనేక అంశాలు కూడా బరువు పెరగడానికి కారణమవుతాయి. మీ ఎత్తు, బరువు ప్రకారం బిఎంఐ సుమారు 28.2. అంటే మీరు అధిక బరువు విభాగంలో ఉన్నారు. మోకాళ్లపై పడే భారాన్ని తగ్గించేందుకు మొదటి లక్ష్యంగా 5-7 కిలోలు తగ్గి 63-65 కిలోలకు చేరడం మంచిది. అన్నం లేదా చపాతీ పరిమాణాన్ని కొద్దిగా తగ్గించి, కూరగాయలు, ఆకుకూరలు, పప్పులు, పెరుగు, గుడ్లు వంటి పోషకాహారాన్ని పెంచండి. స్వీట్లు, బిస్కెట్లు, బేకరీ పదార్థాలు, వేయించిన ఆహారం, చక్కెర పానీయాలను తగ్గించండి. మోకాళ్లకు ఒత్తిడి కలగకుండా వైద్యుడు లేదా ఫిజియోథెరపిస్ట్ సూచించే తక్కువ ప్రభావం ఉన్న వ్యాయామాలు, ఉదాహరణకు స్టేషనరీ సైక్లింగ్ లేదా ఈత, చేయవచ్చు. వారానికి సుమారు 250-500 గ్రాముల చొప్పున నెమ్మదిగా బరువు తగ్గడం సరిపోతుంది. ఆకలితో ఉండటం లేదా వేగంగా బరువు తగ్గించే డైట్లు పాటించడం మంచిది కాదు. 2-3 నెలలు క్రమంగా ప్రయత్నించినా బరువు తగ్గకపోతే వైద్యుడి సలహాతో థైరాయిడ్, రక్తంలో చక్కెర వంటి అంశాలను పరీక్షించుకోవచ్చు. అలాగే మోకాళ్ల గుజ్జు దెబ్బతిన్న స్థాయిని బట్టి ఫిజియోథెరపీ, కండరాలను బలోపేతం చేసే వ్యాయామాలు కూడా అవసరం. కాబట్టి ఫిజియోథెరపిస్ట్ సలహాలు తీసుకోండి.మోకాళ్లను కాపాడుకుంటూ, పోషకాహారంతో, నెమ్మదిగా బరువు తగ్గడమే ఆరోగ్యకరమైన మార్గం. కాగా మీ కూతురు కూడా మీలాగే అధిక బరువు ఉన్నట్టు అయితే ఇప్పటి నుంచే ఆహార నియమాలు పాటిస్తూ బరువు నియంత్రణలో ఉంచుకోవాలి. ఆమె కూడా నిపుణులను కలసి

## సిన్నబోకే నా శ్రీలత...



తెలంగాణ నేపథ్యంలో సాగే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం ఇడుపుకాయితం నుంచి మొదటి పాట ఓ శ్రీలత ప్రోమో విడుదలైంది. కథానాయకుడు ప్రియదర్శి పుట్టినరోజును పురస్కరించుకుని ఈ పీపీ మెలోడీ పాట ప్రోమోను చిత్ర బృందం విడుదల చేసింది. సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాస్ వర్క్స్ పతాకాలపై ప్రముఖ నిర్మాతలు సుకుమార్, బన్నీ వాస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వంశీరెడ్డి దొండపాటి దర్శకత్వం వహిస్తుండగా, ప్రియదర్శి సరసన తెలంగాణ జానపద కళాకారిణి నాగదుర్గ కథానాయికగా టాలీవుడ్‌కి పరిచయం అవుతోంది. తాజాగా విడుదలైన ప్రోమోలో కొత్తగా పెళ్లయిన శ్రీనివాస్ (ప్రియదర్శి), శ్రీలత (నాగదుర్గ)ల మధ్య సాగే సరదా రొమాంటిక్ సన్నివేశాలు, వారిద్దరి ఆకట్టుకునే కెమిస్ట్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. "ఓ శ్రీలత శ్రీలత శ్రీలత నువ్వు సిన్నబోకే నా శ్రీలత... ఈ శ్రీనివాసుడే నీ జత్త అంటూ అల రాజు రాసిన సాహిత్యం, సురేష్ బొబ్బిలి అందించిన స్వరాలు పాటపై మంచి బజ్ క్రియేట్ చేశాయి. ప్రస్తుతం వేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని డిసెంబర్ మొదటి వారంలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

# తెర

## ప్రేమకు కుటుంబ విలువల జోడి..



యష్ తేజ్ , జయశ్రీ హీరో హీరోయిన్లుగా సుజయ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై, ఆర్ఎన్ క్రియేషన్స్ సమర్పణలో తెరకెక్కనున్న సరికొత్త యూత్‌ఫుల్ లవ్ స్టోరీ పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. చందు దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్రాన్ని నిర్మాతలు కె. గోపాల్, జె. రవీందర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ ప్రారంభోత్సవ వేడుకకు పలువురు సినీ ప్రముఖులు హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ దర్శకుడు వి.ఎన్. ఆదిత్య క్లాప్ కొట్టగా, సీనియర్ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ్ కెమెరా స్విచ్చాన్ చేశారు. అనంతరం తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ పూర్వ సంచాలకులు మామిడి హరికృష్ణ స్క్రిప్ట్‌ను చిత్ర యూనిట్‌కు అందజేసి.. సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దర్శకుడు చందు మాట్లాడుతూ.. నేటి తరం ప్రేమకథలకు కుటుంబ విలువలను జోడించి ఈ సినిమాను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ప్రేమలో ఉన్న యువతీయువకులు తమ తల్లిదండ్రుల భావోద్వేగాలను, బాధ్యతలను దృష్టిలో ఉంచుకుంటే ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయి? పేరెంట్స్ గురించి వారు ఎలా ఆలోచిస్తారు? అనే ఆసక్తికరమైన కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. సరికొత్త అనుభూతిని పంచే అందమైన ప్రేమకథను ప్రేక్షకులకు అందించబోతున్నందుకు సంతోషంగా ఉందని నిర్మాతలు కె. గోపాల్, జె. రవీందర్ వ్యక్తం చేశారు. ఈ చిత్రానికి ప్రొడక్షన్ డిజైనర్‌గా భూపతి యాదగిరి, సంగీత దర్శకుడిగా నాగ వంశీ, సినిమాటోగ్రాఫర్లుగా నాని బిశెట్టి, సురేష్ జిల్లా వ్యవహరిస్తుండగా.. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా ఎర్రం రామకృష్ణ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని, పూర్తి వివరాలను మరో అప్డేట్‌లో ప్రకటిస్తామని మేకర్స్ ఈ సందర్భంగా తెలియజేశారు.

## కల నెరవేరింది



తన నటన, డ్యాన్స్‌తో సౌత్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి పూర్ణసోషల్ మీడియా వేదికగా తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. రజనీకాంత్ కథానాయకుడిగా నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న జైలర్2 చిత్రం నుంచి ఇటీవల విడుదలైన మొదటి ప్రత్యేక గీతంలో పూర్ణ తన స్టెప్పులతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నారు. ఈ పాటకు వస్తున్న అద్భుతమైన స్పందనపై స్పందిస్తూ ఆమె ఒక భావోద్వేగపూర్వక నోట్ షేర్ చేశారు. చిన్నప్పటి నుంచి డ్యాన్స్ టీచర్ కావాలన్నదే తన జీవిత లక్ష్యమని, ఆ కలను తన భర్త మద్దతుతో నిజం చేసుకున్నానని ఆమె తెలిపారు. ఒక గొప్ప సూపర్ హీరో సరసన నృత్యం చేయాలని తాను ఎప్పటినుంచో అనుకున్నానని, అయితే సాక్షాత్తూ సూపర్‌స్టార్ రజనీకాంత్ సినిమాలో డ్యాన్స్ చేసే గొప్ప అవకాశం వస్తుందని కలలో కూడా ఊహించలేదని పేర్కొన్నారు. ఈ అరుదైన అవకాశం ఇచ్చిన దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్‌కు, తన నృత్యాన్ని ఆదరిస్తున్న అభిమానులకు పూర్ణ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే తన ఈ ప్రయాణం వెనుక అమ్మ త్యాగం, మద్దతు ఎంతో ఉన్నాయని, ఈ మధుర క్షణాలు తన జీవితాంతం గుర్తుండిపోతాయని ఉద్వేగంగా వెల్లడించారు. ప్రస్తుతం పూర్ణ చేసిన ఈ వ్యాఖ్యలు నెట్టింట తెగ వైరల్

## శరీరం చెప్పేది వినడం నేర్చుకుంటున్నా



నటి సమంత తన గర్భధారణ సమయంలో అనుసరిస్తున్న ఫిట్‌నెస్ రొటీన్ విశేషాలను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. జిమ్‌లో వ్యాయామం చేస్తున్న ఫోటోలు, వీడియోలను షేర్ చేస్తూ.. గర్భధారణ కాలంలో ఫిట్‌నెస్ లక్ష్యాలు ఎలా మారతాయో వివరించారు.ఇన్నాళ్లూ శరీరాన్ని మరింతగా శ్రమ పెట్టేలా తీవ్ర శిక్షణ తీసుకున్నానని, అయితే ఇప్పుడు తన శరీరం ఇచ్చే సంకేతాలను గమనిస్తూ దానిని గౌరవించడం నేర్చుకుంటున్నానని సమంత పేర్కొన్నారు. వైద్యుడి ముందస్తు అనుమతితోనే వ్యాయామాలను కొనసాగిస్తున్నట్లు తెలిపిన ఆమె, ప్రసూతి సమయపు వ్యాయామాలలో ప్రత్యేక శిక్షణ ఉన్న ట్రైనర్ పర్యవేక్షణలోనే శిక్షణ తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. తన ఆరోగ్య పరిస్థితి, గర్భధారణ దశకు తగినట్లుగా వ్యాయామాల్లో మార్పులు చేసినట్లు చెప్పారు. గర్భధారణ ప్రయాణం ప్రతి ఒక్కరికీ భిన్నంగా ఉంటుందని, కాబట్టి తన వర్కౌట్ రొటీన్‌ను ఇతరులు గుడ్డిగా అనుసరించవద్దని సమంత సూచించారు. ఏదైనా వ్యాయామం ప్రారంభించే ముందు తప్పనిసరిగా డాక్టర్‌ను సంప్రదించి, నిపుణులైన ట్రైనర్ సహాయం తీసుకోవాలని కోరారు. గతంలోలా ఎక్కువ బరువులు ఎత్తడం కాకుండా, శరీరం సహకరించిన మేరకే వర్కౌట్స్ చేస్తున్నానని సమంత వివరించారు. 'కొన్ని రోజులు వర్కౌట్ నేలపై పడుకోవడంతోనే పూర్తవుతుంది. ఒక చిన్న ప్రాణాన్ని మోస్తున్న ఈ సమయంలో నా శరీరం చేస్తున్న పనుల్లో ఇదే అత్యంత బలమైనద్ని అని ఆమె వ్యాఖ్యానించారు.

## రెండు అక్షరాల సెంటిమెంట్



నందమూరి బాలకృష్ణ, దర్శకుడు గోపీచంద్ మలినేని కలయికలో వస్తున్న 111వ చిత్రంపై సినీ వర్గాల్లోనూ, అభిమానుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. వీరసింహారెడ్డి వంటి ఘనవిజయం తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న రెండో సినిమా కావడంతో ఈ చిత్రంపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. బాలకృష్ణ సినీ ప్రయాణాన్ని పరిశీలిస్తే రెండు అక్షరాల పేర్లతో వచ్చిన రాము (1987), సింహా (2010) చిత్రాలు బాక్సాఫీస్ వద్ద రికార్డు విజయం సాధించి రజతోత్సవం జరుపుకున్నాయి. అందుకే ఈ 111వ చిత్రానికి కూడా రెండక్షరాల పేరే పెడతారని అభిమానులు గట్టిగా నమ్ముతున్నారు. ప్రస్తుతం చిత్రసీమలో గాడ్ లేదా దాదా అనే రెండు పేర్లు ప్రచారంలో ఉన్నాయి. బాలయ్యకున్న మాస్ దేవుడు అనే గుర్తింపునకు గాడ్ సరిపోతుందనే చర్చ నడుస్తుండగా, ముందస్తు దృశ్యాలలో చూపించిన రౌద్ర రూపానికి దాదా తగినట్లుగా ఉంటుందని భావిస్తున్నారు. కాకినాడ రేవు ప్రాంతంలో వేగంగా జరుగుతున్న చిత్రీకరణలో బాలయ్యకు చిన్నపాటి గాయం కావడంతో శస్త్రచికిత్స జరిగింది. దీనివల్ల చిత్రీకరణకు తాత్కాలికంగా విరామం లభించింది. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారు. నిర్మాతల శ్రేయస్సు దృష్ట్యా ఆయన త్వరలోనే మళ్లీ చిత్రీకరణలో పాల్గొననున్నారు. ముంబై నేపథ్యంలో సాగే యాక్షన్ కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్ కథానాయికగా, మంచు మనోజ్, సంజయ్ దత్, సముద్రఖని, శరత్ కుమార్ ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. తమన్ స్వరాలు అందిస్తున్నారు. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట్ సతీశ్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 24న ఘనంగా విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. సినిమా పేరు, విడుదల తేదీపై త్వరలోనే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రానుంది.

## కంటెంట్‌పై పూర్తి నమ్మకంతో వస్తున్నాం



కికు యనమల, కశిష్ ఖాన్ జంటగా నటించిన యూనిక్ సర్వైవల్ డ్రామా థ్రిల్లర్ కికు చిరంజీవి ఈనెల 28న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలయ్యేందుకు సిద్ధమైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో చిత్ర బృందం ఘనంగా ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. చిత్ర బృందంఈ కార్యక్రమంలో పాల్గొన్న నటీనటులు, సాంకేతిక నిపుణులు సినిమా విశేషాలను పంచుకుంటూ ప్రేక్షకులపై గట్టి నమ్మకాన్ని వ్యక్తం చేశారు. హీరో కికు యనమల మాట్లాడుతూ మంచి కంటెంట్ ఉన్న చిత్రాలను తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారు. ఒక కొత్త తరహా రిస్కీ పాయింట్‌తో, ఎంగేజింగ్‌గా ఈ సినిమాను తెరకెక్కించాం. మొదటి నుంచి చివరి వరకు ప్రేక్షకులను సీటు అంచున కూర్చోబెట్టే థ్రిల్ ఇందులో ఉంటుంది.. అని అన్నారు.

నిర్మాత దీప్తి నదిమింటి మాట్లాడుతూ కంటెంట్‌పై ఉన్న ధైర్యంతోనే ఈ చిత్రాన్ని ఆగస్ట్ 28న థియేటర్లలోకి తెస్తున్నాం. సినిమా చూసిన ఏ ఒక్కరూ నిరాశపడరు, ఆ గ్యారెంటీ మాది. ఈ సినిమాకు ప్రేక్షకులు ఇచ్చే థియేటర్ ఆదరణే చిన్న చిత్రాలకు కొండంత బలాన్ని ఇస్తుంది అని తెలిపారు.

నటుడు శ్రీకాంత్ అయ్యంగార్ మాట్లాడుతూ.. చిన్న సినిమాలను అందరూ థియేటర్లలోనే చూసి ప్రోత్సహించాలి. థియేటర్ ఎక్స్‌పీరియన్స్ కోసమే చేసిన ఈ ప్రయత్నాన్ని గెలిపించాలి అని కోరారు. శుభ సాయి వెంకట్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో తనికెళ్ల భరణి, గోపరాజు రమణ, శ్రీకాంత్ అయ్యంగార్, వివేక్ రాఘవ తదితరులు కీలక పాత్రలు పోషించారు. శేఖర్ చంద్ర సంగీతం అందించగా, ఛోటా కె ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తించారు.

## డేటింగ్ యాప్స్ ట్విస్టుల నేపథ్యం..



మేమ్ ఫేమస్ చిత్రంతో యువత మనసు దోచుకున్న యంగ్ హీరో సుమంత్ ప్రభాస్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం రోమాంచకం. టాలీవుడ్ సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా సమర్పణలో భద్రకాళి పిక్చర్స్ బ్యానర్‌పై ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి వేణుగోపాల్ రెడ్డి దర్శకత్వం వహించారు. ఈ రొమాంటిక్ కామెడీ అండ్ థ్రిల్లర్ మూవీ ట్రైలర్‌ను తాజాగా చిత్రబృందం విడుదల చేసింది. ట్రైలర్ ఆరంభం నుంచి సుమంత్ ప్రభాస్ తనదైన మార్క్ తెలంగాణ నేటివిటీ యాస, ఫన్నీ టైమింగ్, ఎనర్జిటిక్ నటనతో అలరించారు. నేటితరం యూత్ సంస్కృతి, డేటింగ్ యాప్స్ ఆధారంగా సాగే రిలేషన్‌షిప్స్, ఆ తర్వాత ఊహించని మలుపులతో కథ సాగుతుందని ట్రైలర్ ద్వారా స్పష్టమవుతోంది.

ఈ సందర్భంగా చిత్ర సమర్పకులు సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ నేను రోమాంచకం సినిమా చూశాను. చాలా బాగుంది. ఈ సినిమాలో హీరో క్యారెక్టరైజేషన్ ఇన్నోసెంట్‌గా ఉంటుంది. అలాంటి క్యారెక్టర్‌లో పర్ఫార్మ్ చేసి మెప్పించడం కష్టం. హీరో, హీరోయిన్, వారి స్నేహితుల క్యారెక్టర్స్ చూస్తుంటే సినిమాలా అనిపించదు. పక్క నుండి వీళ్లను చూస్తున్నట్లు అనిపిస్తుంటుంది అన్నారు. హీరో సుమంత్ ప్రభాస్ మాట్లాడుతూ రోమాంచకం క్యూట్ లవ్ ఫిలిం. భద్రకాళీ సంస్థలో ట్రావెల్ అవుతుంటే తెలిసింది సందీప్ అన్న, ప్రణయ్ అన్న ఎంత మంచి మనసున్న వాళ్లో. యాక్టర్‌గా ఓపెన్ అప్ అయిపోయి నటించే అందరినీ నవ్వించే అందరూ ఇష్టపడే ఇలాంటి బ్యూటిఫుల్ క్యారెక్టర్‌లో నటించే అవకాశం దక్కిందన్నారు. హీరోయిన్ అనంతిక సానిల్‌కుమార్ మాట్లాడుతూ.. మా సినిమా చూసి ప్రతి ఒక్కరూ ప్రేమలో పడతారన్నారు. డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, కాస్ట్యూమ్ డిజైనర్ కీర్తన, మ్యూజిక్ డైరెక్టర్ వాసుకి వైభవ్ తదితరులు మాట్లాడారు.

## ఖిల్లా రోడ్ మిలాద్ ఉన్‌నబి వేడుకల్లో పాల్గొన్న టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్

**హైదరాబాద్, ఆగస్టు 26,ప్రభాతవార్త:** నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఖిల్లా రోడ్‌లో మిలాద్‌ఉన్‌నబి కార్యక్రమంలో టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పాల్గొని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్తచూపిన శాంతి, సోదరభావం, మానవతా విలువలు సమాజానికి ఆద ర్శమని వాటిని ఆచరించినవారి జన్మకు అర్థం ఉంటుందని అన్నారు. తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతులతో, సోదరభావంతో జీవించాలని ఆకాంక్షించారు. మత సామరస్యం, పరస్పర గౌరవం, ఐక్యతను మరింత బలోపేతం చేయడమే సమాజ అభివృద్ధికి దోహద పడుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు, కార్యకర్తలు, యువకులు తది తరులు పాల్గొన్నారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని జరుపుకునే పవిత్రమైన మిలాద్ ఉన్ నబీ సందర్భంగా తెలంగాణ ప్రజలకు, ముఖ్యంగా ముస్లిం సోదర సోదరీమణులందరికీ టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ హృదయపూర్వక శుభా కాంక్షలు తెలిపారు. మహమ్మద్ ప్రవక్త బోధనలు సమాజానికి ఎల్లప్పు డూ మార్గ దర్శకంగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు.



బుధవారం గాంధీభవన్‌లో జరిగిన ముఖాముఖిలో ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరిస్తున్న ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు

## వన్ నేషన్, వన్ ఎలక్షన్ అమెరికాలో సాధ్యం భారత్‌లో అసాధ్యం: వి.హనుమంతరావు

**హైదరాబాద్, ఆగస్టు 26,ప్రభాతవార్త:** వన్ నేషన్ వన్ ఎలక్షన్ అమెరికాలో సాధ్యం భారత దేశంలో అసాధ్యం అని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు అన్నారు.గాంధీభవన్‌లో బుధవారం ప్రజలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో విహెచ్ పాల్గొని వన్ నేషన్ వన్ ఎలక్షన్‌తో నరేంద్ర మోడీ నాలుగోసారి ప్రధాని అవ్వాలని చూస్తున్నారన్నారు. ప్రధాని మోడీకి, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు సంబంధాలు ఉన్నాయని, అందుకే భారత్‌ను అమెరికాలా చేయాలని మోడీ చూస్తున్నారని అన్నారు. భారత్ సెక్యులర్ దేశమనీ వన్ నేషన్ వన్ ఎలక్షన్ సాధ్యం కాదని చెప్పారు. భారత దేశంలో భిన్న మతాలు, భిన్న కులాల ఉన్నాయన్నారు. కేంద్రం చేస్తున్న క్యాస్ట్ సెన్స్, కులగణనలో బిసిల కాలమే లేదని తెలిపారు. అలాంటిది వన్ నేషన్ వన్ ఎలక్షన్ ఎక్కడిదని ప్రశ్నించారు. 70శాతం ఉన్న బిసిలకు అన్యాయం చేస్తారా అంటూ నిలదీశారు. ముందు బిసిల సంగతి తేల్చాలన్నారు మేము వన్ నేషన్ వన్ ఎలక్షన్‌కు వ్యతిరేకమని స్పష్టం చేశారు. కులగణన పేరుతో ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో ఉన్న ఓట్లకు, ఎలక్షన్ కమిషన్ లెక్కలకు తేడా ఉందని విహెచ్ అన్నారు.గత ప్రభుత్వం ప్రగతి భవన్‌ను కట్టి ప్రజల సమస్యలను చెప్పుకోవ డానికి అవకాశాలు ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ప్రగతి భవన్‌ను ప్రజా భవన్‌గా మార్చి ప్రజా సమస్యల పరిష్కార కేంద్రంగా మార్చారని తెలిపారు. గాంధీభవన్ కూడా ప్రజల సమస్యల పరిష్కార వేదిక అయ్యేలా ముఖాముఖీ కార్యక్రమం చేపట్టారని చెప్పారు.భూములకు సంబంధించిన సమస్యలే ఎక్కువగా తన దృష్టికి వచ్చినట్లు వీహెచ్ తెలిపారు. పటేల్ పట్వారి విధానం వల్ల భూ సమస్యలు తక్కువగా ఉండేవన్నారు. గత ప్రభుత్వం ధరణితో పాటు అనేక సమస్యలు తీసుకొచ్చిందని విమర్శించారు. బిఆర్ఎస్ హయాంలో ఇందిరాగాంధీ పంచిన భూములను మళ్లీ భూస్వాములు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని తెలిపారు. రిజిస్ట్రేషన్ ఆఫీసులో తప్పిదాలు జరుగుతున్నాయని, రెవెన్యూ శాఖ మంత్రి పటిష్ట చర్యలు తీసుకోవాలని వి.హనుమంతరావు హితవు చెప్పారు.

## హైదరాబాద్ విమోచన చరిత్రను ప్రతి ఇంటికి చేరుస్తాం

### సెప్టెంబరు 17న పెరేడ్‌గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ: బూర నర్సయ్య గౌడ్



**హైదరాబాద్, ఆగస్టు 26 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రాంతం దశాబ్దాలుగా వివక్షకు, అణచివేతకు గురైందని, దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్రం వస్తే నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల రక్తచరిత్ర నుంచి తెలంగాణకు 1948 సెప్టెంబర్ 17నే విమోచనం లభించిందని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తెలంగాణ విమోచన కమిటీ చైర్మన్ డా. బూర నర్సయ్య గౌడ్ స్పష్టం చేశారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయ న మాట్లాడారు. నిజాం పాలన కింద ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల్లో సెప్టెంబర్ 17ను ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహిస్తుంటే, పోరాటానికి కేంద్రబిందువైన తెలం గాణలో మాత్రం అమరవీరులకు అధికారిక గుర్తింపు ఇవ్వకపోవడం చారిత్రక అన్యాయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో 1969 తొలిదశ ఉద్యమంలో 369 మంది, మలిదశలో దాదాపు 1,200 మంది బలిదానాలు చేశారని, రాష్ట్రం ఏర్పడి 13 యేళ్లు గడుస్తున్నా అమరవీరుల స్థూపానికి తాళాలు వేసి ఉండటం, సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. సుందర్‌లాల్ కమిటీ నివేదిక ప్రకారం విమోచన పోరాటంలో సుమారు 20 వేల మంది ప్రాణాలు కోల్పోయారని, నిజాం పాలన ముగిసినా గడీల రాజకీయ సంస్కృతి కొనసాగుతోందని బూర నర్సయ్య గౌడ్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అధికారికంగా విమోచన ఉత్సవాలు నిర్వహిస్తోందని, అదే స్ఫూర్తితో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు సూచనల మేరకు విమోచన చరిత్రను ప్రతి గడపకూ చేర్చేందుకు తెలంగాణ విమోచన ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సమగ్ర కార్యాచరణను రూపొందించినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా తెలంగాణ విమోచన సాధన కోసం బిజెపి తరఫున 7 ప్రధాన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం ముందుంచారు.

## 34వేల టీచర్ పోస్టులను భర్తీ చేయండి

### సిఎం రేవంత్ రెడ్డికి ఎంపి ఆర్.కృష్ణయ్య లేఖ

**హైదరాబాద్ ఆగస్టు 26 ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 34 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు వెంటనే డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్య సభ సభ్యులు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సీఎం ఎనుముల రేవంత్ రెడ్డికి బుధవారం బహిరంగ లేఖ రాశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వల్ల బోధన దెబ్బతిని విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో మ్యాథ్స్, సైన్స్, ఇంగ్లీష్ బోధించే ఉపాధ్యాయులు లేకపో వడంతో 14 వేల పాఠశాలల్లో విద్యార్థులు ప్రాథమిక పరిజ్ఞానాన్ని కోల్పోతున్నారు. దీనివల్ల నీట్ , ఇంజినీరింగ్, మెడిసిన్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో మన విద్యార్థులు ఇతర రాష్ట్రాల విద్యార్థులతో పోటీ పడలేకపోతున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల పాఠ శాలల్లో 9వేల 9,000పోస్టులు, ఎయిడెడ్ పాఠశాలల్లో 5 వేల 900 పోస్టులు, ఆదర్శ పాఠశాలల్లో 3 వేల 3,000 పోస్టులు, కస్తూర్బా పాఠశాలల్లో 15వందల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఉపాధ్యాయులు లేకపోవడం వల్లే ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. ప్రభుత్వం ఎన్‌రోల్‌మెంట్ పెరిగిందని చెప్తున్నప్పటికీ, 2026-27 విద్యాసంవత్సరంలో ఏకంగా 30 వేల మంది ఎన్‌రోల్‌మెంట్ తగ్గినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. బి.ఎడ్ , డి.ఎడ్ పూర్తి చేసి అన్ని అర్హతలు కలిగిన 16 లక్షల మంది నిరు ద్యోగులు ఉద్యోగాలు లేక వారి శక్తియుక్తులు వృథా అవుతున్నాయని, వారి సేవలను సమాజాభివృద్ధికి ఉపయోగించుకోవాలని కోరారు.

## తెలంగాణ-జపాన్ మధ్య వర్క్‌ఫోర్స్ మొబిలిటి బలోపేతం: మంత్రి వివేక్



**హైదరాబాద్, ఆగస్టు 26,ప్రభాతవార్త:** నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక శిక్షణ, ఉద్యోగాల కల్పన, అంతర్జాతీయ వర్క్‌ఫోర్స్ మొబిలిటీ రంగాల్లో తెలం గాణ-జపాన్ మధ్య భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు శక్తి, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. జపాన్ పర్యటనలో ఉన్న మంత్రి వివేక్ నేతృత్వంలోని తెలంగాణ ప్రతినిధి బృందం హిరోషిమా ప్రిఫెక్చర్ వైస్ గవర్నర్ టోరు యోషిమత్సు ను బుధవారం కలిసింది. ఈ సం దర్భంగా తెలంగాణలో చేపడుతున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, సాంకేతిక శిక్షణ, యువతకు ఉపాధి అవకాశాలు, జపాన్‌లో ఉద్యోగాల కోసం నైపుణ్య సిబ్బందిని సిద్ధం చేయడం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణలో యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ అందించేందుకు 119 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి వివరించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ ఇచ్చి, అంతర్జాతీయ స్థాయి ఉద్యోగ అవకాశాలకు వారిని సిద్ధం చేస్తున్నామని తెలిపారు. జపాన్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను తెలంగాణ నుంచి అందించేలా ఒక వ్యవస్థీకృత విధానాన్ని రూపొందించడంపై సమావేశంలో చర్చించారు. జపనీస్ భాషలో శిక్షణ, సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధి, ఉద్యోగాల కోసం నైపుణ్య సిబ్బంది ఎంపిక, శిక్షణ, నియామకం వంటి అంశాల్లో పరస్పర సహకారం పెంచుకోవాలని నిర్ణయించారు. హిరోషిమా ప్రిఫెక్చర్ ప్రతినిధులు అక్టోబర్ 2026లో హైదరాబాద్‌లో పర్యటిం చనున్నారు. ఈ పర్యటన సందర్భంగా ఇరు ప్రాంతాల మధ్య సహ కారానికి సంబంధించిన నిర్దిష్ట రంగాలను గుర్తించి, తదుపరి కార్యా చరణ రూపొందించేందుకు అవకాశం ఉంటుందని మంత్రి తెలిపారు. డిసెంబర్ 9 నుంచి 11 వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2026లో హిరోషిమా ప్రభుత్వ ప్రతినిధులు, జపాన్ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొనాలని మంత్రి వివేక్ వెంకటస్వామి ఆహ్వానించారు.

ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, శక్తి శాఖ కార్యదర్శి హరిచందన, హిరోషిమా ప్రిఫెక్చర్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వృత్తి విద్య, ప్రాక్టికల్ శిక్షణ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధిలో జపాన్ అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేసేందుకు వివేక్ వెంకటస్వామి నేతృత్వంలోని తెలంగాణ ప్రతినిధి బృందం ఫుకుయామా హయ్యర్ టెక్నికల్ స్కూల్‌ను సందర్శించింది. ఈ సందర్భంగా నిర్మాణ రంగంతో పాటు టెక్నికల్, వెల్డింగ్, ఆటోమొబైల్, ఎలక్ట్రికల్ ల్యాబొరేటరీలను మంత్రి పరిశీలించారు.

## స్కిల్లింగ్, అప్‌స్కిల్లింగ్, రీస్కిల్లింగ్‌లో భాగస్వామ్యమవ్వండి

### స్కిల్ క్యాపిటల్‌గా తెలంగాణను తీర్చిదిద్దేందుకు కలిసి రండి: పారిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్ బాబు పిలుపు

**హైదరాబాద్, ఆగస్టు 26 ప్రభాతవార్త:** తెలంగాణను స్కిల్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దేందుకురాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న స్కిల్లింగ్, అప్‌స్కిల్లింగ్, రీస్కిల్లింగ్ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పారిశ్రామికవేత్తలకు రాష్ట్ర ఐటి,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. మా రుతున్న సాంకేతికతకు అనుగుణంగా పరిశ్రమ లకు అవసరమైన రెడీ టూ వర్క్ ఫోర్స్‌గా తెలంగాణ యువతను తీర్చిదిద్దేందుకు ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. బుధవారం బంజారాహిల్స్‌లోని బోయింగ్, లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ (ఎల్ఎల్ఎఫ్), సెంట్రల్ ఇన్‌స్టి ట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ (సిఐటిడి) సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన బోయింగ్ స్కిల్లింగ్ ప్రోగ్రామ్‌ను విజయవంతంగా పూర్తి చేసిన యువత, దివ్యాంగులు, వెటరన్స్‌కు ఆయన ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ టెక్నా లజీ, ఏఐ వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కూడా ఎప్పటికప్పుడు మారుతున్నాయన్నారు.

ఆ దిశగా యువతను తీర్చిది ద్దాలంటే ప్రభుత్వం, పరిశ్ర మలు, పరిశో ధనా సంస్థలు, నిపుణులు, విద్యా సంస్థలు సమన్వ యంతో పనిచేయాల్సి న అవ సరం ఉందన్నారు. పరిశ్రమలు, విద్యా సంస్థల మధ్య అంతరాన్ని తగ్గించాలనే సంకల్పంతో రాష్ట్రంలో స్కిల్లింగ్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేస్తున్నామన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నామన్నారు. ఆధునిక, పరిశ్రమ ఆధారిత శిక్షణను అందించేందుకు ప్రభుత్వ ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. అకడమిక్ కరిక్యులమ్‌లో అవసరమైన మార్పులు, చేర్పులు చేయడంతో పాటు అనేక కొత్త కోర్సులకు శ్రీకారం చుట్టామన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఇందుకోసం పరిశ్రమలు, పారిశ్రామి కవేత్తలతో కలిసి పనిచేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. యువత తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపర్చుకుంటూ భవిష్యత్ అవకాశాలను అందిపుచ్చుకోవాలని మంత్రి సూచించారు.

కార్యక్రమంలో బోయింగ్, లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్, సెంట్రల్ ఇన్‌స్టి ట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ ప్రతినిధులు ప్రవీణ, యశోద, రష్మీ ప్రభ మిశ్రా, బితుపాన్ బోరా, రత్న శేఖర్ రెడ్డి, ఓం దేవ్, డా. విజయ్ కృష్ణ కాంత్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు భాషాభ్యున్నతికి మారుపేరు మండలి

### పాట్నా హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి

### వైభవంగా మండలి వెంకట కృష్ణారావు శతజయంతి సమాపన ఉత్సవం

### జాతీయకవి ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డికి మండలి స్మారక సాహిత్య పురస్కారం ప్రదానం



కసిరెడ్డి వెంకటరెడ్డికి మండలి వెంకటకృష్ణారావు స్మారక సాహిత్య పురస్కారం ప్రదానం చేస్తున్న జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి, బుద్ధప్రసాద్, కమలాకరభారతి, నరసింహాచార్య, కమలాకరశర్మ తదితర అతిథులు

**నాంపల్లి, ఆగస్టు 26 ప్రభాతవార్త :** ప్రజా సమాజసేవకు, తెలుగు భాషాభ్యున్నతికి మారుపేరు మండలి వెంకటకృష్ణారావు అని ఆయనకు సాటి మరెవ్వరూ లేరని, ఆయన పేరున స్మారక సాహిత్య పురస్కారం ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డికి అందించడం ఎంతో సబబు, అంతటి మహోన్నత వ్యక్తిని సన్మానించడం మననిమనం భాషా సంస్కృతులను సత్కరించుకున్నట్లేనని పాట్నా హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి అన్నారు. సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రపంచ తెలుగు మహాసభలను మహోన్నతంగా నిర్వహించి తెలుగుభాష, సంస్కృతి, సంప్రదాయాలు, కళలను విశ్వవ్యాప్తం చేసిన తెలుగుజాతి గర్వించదగ్గ ఏకైక వ్యక్తి వెంకటకృష్ణారావు అని కొని యాడారు. ప్రముఖ కమలాకర చారిటబుల్ ట్రస్ట్, కమలాకర లలిత కళాభారతి సంయుక్త ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయ తెలుగు బాషానిలయంలోని మండలి వెంటక కృష్ణారావు శతజయంతి సమాపన ఉత్సవం వైభవంగా జరిగింది. ముందుగా తెలుగు వైభవమ్ శీర్షికన తెలంగాణ జాతీయ సాహిత్య పరిషత్తు అధ్యక్షుడు డా. వద్లూరి ఆంజనేయరాజు నిర్వహణలో జరిగిన కవిసమ్మేళనంలో 17మంది ప్రముఖ కవులు, కవయిత్రులు పాల్గొని మండలి వెంకట కృష్ణారావు గొప్పదనాన్ని ప్రస్ఫుటిస్తూ తమ కవితలు అద్భుతంగా ఆలపించి ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నారు. అనంతరం డా. టి.గౌరీశంకర్ సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పాట్నా హైకోర్టు విశ్రాంత చీఫ్ జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి పురస్కార ప్రదాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్, విశిష్ట అతిథులు డా. కె.వి.కృష్ణ కుమారి, ఆచార్య సాగి కమలాకరశర్మ, సిహెచ్.త్రినాథరావు, సంస్థ వ్యవస్థాపకురాలు భారతీ కమలాకర్, కార్యక్రమ నిర్వాహకుడు సాధన నరసింహాచార్య తదితరులతో కలిసి మండలి వెంకట కృష్ణారావు చిత్రపటానికి పూల మాలవేసి ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా అభినవ వివేకానందుడు, జాతీయకవి ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డిని ఘనంగా సత్కరించి మండలి వెంకటకృష్ణారావు స్మారక సాహిత్య పురస్కారం ప్రదానంచేసి అభినందించారు. ఈ సందర్భంగా వక్తలు మండలి వెంకటకృష్ణారావు పేరుచెప్పగానే గాంధేయ సిద్ధాంతాలు, సమాజసేవ లక్ష్యాలు, నిరాడంబర విధానాలు ప్రస్ఫుటిస్తాయన్నారు.

### వరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్

## 3.12 లక్షల ఎకరాలకు చేరిన సాగు

### నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి



బుధవారం రిలయన్స్ కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖేతన్ మోదీ నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం మంత్రులు ఉత్తమ్, తుమ్మలతో చర్చిస్తున్న దృశ్యం

**హైదరాబాద్, ఆగస్టు 26,ప్రభాతవార్త:** వరికి ప్రత్యామ్నంగా ఆయిల్‌పామ్ సాగు చేయాలని నీటిపారుదల,పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణలో 3.12 లక్షల ఎకరాలకు సాగు విస్తీర్ణం చేరిందని ఆయన తెలిపారు. రిలయన్స్ కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖేతన్ మోదీ నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం బుధవారం రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవ సాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మా వతి రెడ్డితో విస్తృ తంగా చర్చించారు. రిలయన్స్ కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ వైస్ ప్రెసిడెంట్ అర్పన్ బసు, స్టేపుల్స్ విభాగం అధిపతి సంజీవ్ గిరి, ఉద్యానవన శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, ఇతర ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఆయిల్‌పామ్ విస్తరణకు ఇప్పటివరకు రూ.515.84 కోట్ల వ్యయం చేశారని తెలిపారు. సూర్యాపేట జిల్లాలో, ముఖ్యంగా ఒకదానికొకటి ఆనుకొని ఉన్న కోదాడ-హుజూర్‌నగర్ ప్రాంతాన్ని ఆయిల్‌పామ్ ప్లాంటేషన్-ప్రాసెసింగ్ క్లస్టర్‌కు ప్రారంభ కేంద్రంగా పరిశీలించాలని రిలయన్స్ ప్రతినిధులకు ఉత్తమ్ సూచించారు. తదుపరి దశలో ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలను కూడా అనుసంధానించడం ద్వారా విస్తృతమైన ముడిసరుకు సేకరణ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే అవకాశాలను అధ్యయనం చేయాలని పేర్కొన్నారు. నీటిని అధికంగా వినియోగించే వరి సాగుపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గిస్తూ, రైతులకు స్థిరమైన, లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటలను అందించే దిశగా తెలంగాణ ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగుకు భారీ ప్రోత్సాహం ఇవ్వాలని నిర్ణయించింది. ఆయిల్‌పామ్ తోటల విస్తరణతో పాటు ప్రాసెసింగ్, రిఫైనింగ్, అనుబంధ పరిశ్రమలను ఒకే గొలుసులో అనుసంధానిస్తూ సమగ్ర ఫార్మ్‌టు ఇండస్ట్రీ ఆయిల్‌పామ్ వ్యవస్థను నిర్మించేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోంది.ఈ దిశగా రైతును వరి సాగు నుంచి మరో పంటవైపు మళ్లించాలంటే కేవలం సూచనలు సరిపోవు. ప్రత్యామ్నాయ పంట వరి కంటే మెరుగైన ఆదాయం ఇవ్వాలి. మార్కెట్‌పై భరోసా ఉండాలి. పంట చేతికొచ్చిన వెంటనే కొనుగోలు, ప్రాసెసింగ్‌కు వ్యవస్థ సిద్ధంగా ఉండాలి. అప్పుడే పంటల వైవిధ్యీకరణ విజయవంతమవుతుంది" అని స్పష్టం చేశారు. వంటనూనెల దిగుమతులపై దేశఆధారపడటాన్ని తగ్గించే జాతీయ లక్ష్యంలో తెలంగాణకీలక పాత్ర పోషించాలని కోరారు.

### ఫీజు బకాయిలపై రాంచందర్‌రావు

## దీక్షలకు అర్థంలేదు

### ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ కుమార్

**హైదరాబాద్,ఆగస్టు 26,ప్రభాతవార్త:** బిజెపి అధ్యక్షులు రామ్ చందర్ రావ్ ఎందుకు ఫీజుల బకాయిల మీద దీక్ష చేశారో అర్థం కావడం లేదనీ ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ కుమార్ అన్నారు.బుధవారం గాంధీభవన్‌లో మాట్లాడుతూ బిజెపి వాళ్లకు బకాయిల లెక్కలు, విద్యార్థుల సంఖ్య కూడా సక్కగా తెలియదని ఎద్దేవా చేశారు.బిఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో బకాయిలు ఉంటే ఎందుకు బిజెపి నాయకులు ఎందుకు దీక్షలు చేయడం లేదనీ ప్రశ్నించారు.రాష్ట్ర ప్రభుత్వం ఫీజ్ బకాయిలు డబ్బులు బ్యాంక్‌లో జమ చేశాక ఇప్పుడు చేయడం ఎందుకుదీక్షలనీ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫీజ్ రూ.7,800 కోట్ల బకాయిలు ఉన్నాయి.అక్కడ మీరే అధికారంలో భాగస్వాములుగా ఉన్నారు కదా అక్కడ ఎందుకు చెల్లిడంలేదో తెలుపాలని కోరారు. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఒక్క రాష్ట్రంలో అయినా ఫీజ్ రియంబర్స్ మెంట్ ఉందా అని ప్రశ్నించారు.మధ్యప్రదేశ్ లో విద్యార్థుల స్కాలర్ షిప్ ల బకాయిలు ఉన్నాయటఅక్కడ దీక్ష చేయండి అని సలహాఇచ్చారు.ఇంత వయసులో మీరెందుకు 48 గంటల దీక్ష చేయడం ఎందుకు ఆంబోతుల ఉన్న అరవింద్ తో చేయించండనీ సూచించారు.మొన్న మీపాలనలో నీట్ పరీక్షల బాగోతం చూశాం కదా అని గుర్తుచేశారు. దేశంలో ఖాళీలు ఉన్న ఉద్యోగాలు నింపండనీ అన్నారు. యుపి లో 11 సార్లు పేపర్ లీక్ అయ్యాయి అని ఆగ్రహం వ్యక్తంచేశారు.అక్కడ ఒక్క సంవత్సరంలో 25వేల పాఠశాలలు మూత పడ్డాయనీ తెలిపారు.మధ్యప్రదేశ్ తదితర బిజెపిపాలిత రాష్ట్రాలలో విద్యావ్యవస్థ అధ్వాన్నంగా ఉందని అన్నారు.



ధర్మ టీచర్స్ యూనిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర విద్యా సదస్సులో పాల్గొన్న విశారదన్ మహారాజ్, విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు, ప్రొఫెసర్ లింబాద్రి తదితరులు

## తెలంగాణ విద్యారంగంలో సంక్షోభం

### మనసుపెట్టి పాలిస్తేనే విద్యా, వైద్య రంగాలు ప్రగతిపథంలో

### ధర్మ టీచర్స్ యూనిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యా సదస్సు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఆగస్టు 26 ప్రభాతవార్త :** ధర్మ టీచర్స్ యూనిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర విద్యా సదస్సులో తెలంగాణ విద్యా రంగం ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిస్థితులు, సమస్యలపై పలువురు వక్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ఈ సమావేశం రాష్ట్ర యూనిట్ కన్వీనర్ సుంకర శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, దామెర ఉపేందర్ సమన్వయం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన బీసీ, ఎస్సీ, ఎస్టీ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్ మాట్లాడుతూ, పాలకులకు విద్యా రంగంపై చిత్తశుద్ధి కరువైందని విమర్శించారు. ప్రభుత్వం మనసుపెట్టి పరిపాలన చేస్తే తెలంగాణలో విద్యా, వైద్య రంగాలను అద్భుతంగా అభివృద్ధి చేయవచ్చని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం సమయంలో 48 శాతంగా ఉన్న విద్యార్థుల ఎన్ రోల్మెంట్ ప్రస్తుతం 31 శాతానికి పడిపోయిందని, నేషనల్ ఎడ్యుకేషన్ ఇండెక్స్‌లో రాష్ట్రం 37వ స్థానంలో నిలిచిందని వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా రంగాన్ని ఉన్నతీకరిస్తున్నామని ప్రభుత్వాలు చెప్తున్నా గ్రామీణ స్థాయిలో ఆచరణకు నోచుకోవడం లేదని, ఇప్పటికీ 3,500 పాఠశాలల్లో బాలికలకు సరైన టాయిలెట్ సౌకర్యాలు లేవని మండిపడ్డారు. విద్యా రంగానికి బడ్జెట్‌లో 20 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా, తక్కువ శాతంలో నిధులు కేటాయించి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. పూలే, సాహు మహారాజ్, బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధనకై ధర్మ టీచర్స్ యూనిటీ పనిచేస్తోందని, సంక్షోభంలో ఉన్న విద్యా రంగాన్ని బాగు చేయడంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఉపాధ్యాయులు ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్, ఎం.వి.కె. ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ డాక్టర్ కూరపాటి వెంకట్ నారాయణ, ఆర్. వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శేషమ్మ దశదిన కర్మకు హాజరైన సిఎం రేవంత్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు26:** మాజీ మంత్రి కాసు కృష్ణారెడ్డి మాతృమూర్తి శేషమ్మ దశదిన కర్మ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని, కాసు శేషమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. బుధవారం సాయంత్రం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని జెఆర్సీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సిఎం రేవంత్‌రెడ్డి వెంట ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు జైవీర్ రెడ్డి, రాజేష్ రెడ్డి, నాగరాజు, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ కోటింరెడ్డి వినయ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి మంత్రులకు వజ్రాల హారతి

### భూ భారతి అవకతవకలపై రాహుల్ గాంధీకి లేఖ

### సెప్టెంబరు 5,6 తేదీల్లో పెద్ద ఎత్తున నిరసన దీక్షలు

### ప్రభుత్వం స్పందించకుంటే అసెంబ్లీ ముట్టడి

### బిజెపి ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి



బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరా బాద్, ఆగస్టు 26:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిషేధిత భూముల జాబితా (22ఎ)ను అడ్డుపెట్టుకుని లక్షల కోట్ల రూపాయల కుంభకోణానికి తెరలేపిందని బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజ మెత్తారు. బుధవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాల యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అంతేకాకుండా రాష్ట్రంలో జరుగుతున్న భూ బదిలీలు, చీకటి ఒప్పం దాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన బినామీ, షెల్ కంపెనీలకు సుమారు 15 వేల కోట్ల రూపా యల ఆస్తులు అక్రమంగా బదిలీ అయ్యాయని, క్యాబినెట్ మంత్రిగా ఉంటూ సొంత కంపెనీలకు లబ్ధి చేకూర్చుకోవడం దారుణమని మహేశ్వర్ రెడ్డి ఆరో పించారు. గత ప్రభుత్వంలో ధరణి పేరుతో జరిగిన దోపిడీని తీవ్రంగా విమ ర్శించిన కాంగ్రెస్ నాయకులు, నేడు అదేవిధానాన్ని భూ భారతి పేరుతో మంత్రులకు వజ్రాల హారతిగా మలుచుకున్నారని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్రం నుంచి ప్రతి నెలా 200కోట్ల రూపాయలు ఢిల్లీలోని రాహుల్ గాంధీకి ముడుపులుగా వెళ్తున్నాయంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలే బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారని,ఈ ఆరోపణలపై ప్రభుత్వం తక్షణమేస్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ భారీ అవినీతి వ్యవహారంపై రాహుల్ గాంధీకి ఇంగ్లీష్, తెలుగు భాషలలో బహిరంగ లేఖనువిడుదల చేసినట్లు మహేశ్వర్ రెడ్డి తెలిపారు. అంతేకాకుండా, అక్రమ ఆస్తుల బదిలీ, షెల్ కంపెనీల లావాదేవీలపై సీబీఐతో లేదా సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ (ఫోరెన్సిక్ ఆడిట్) జరిపించాలని, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని వెంటనే మంత్రివర్గం నుంచిబర్తరఫ్ చేయాలని బీజేపీ పక్షాన ఆయన పట్టుబట్టారు. ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద వచ్చేనెల 5, 6 తేదీల్లో బీజేపీ ఎమ్మెల్యేలు,ఎంపీలు, ఎమ్మెల్సీలు, భూములను నిషేధిత జాబితాలో చేర్చబడిన బాధితులతో కలిసి నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించి భూ భారతి 22ఎ, సమస్యపై చర్యలు తీసుకోకపోతే బీజేపీ పక్షానఅసెంబ్లీ ముట్టడికార్యక్రమాన్ని చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈనిరసన కార్యక్రమాల్లో బీజేపీ కార్యకర్తలు భారీగా పాల్గొని తెలంగాణ ప్రజల పక్షాన పోరాడాలని ఏలేటి మహేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు.